WWW.ninadam.co.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

సోమవారం, మార్చి 24, 2025 | సంపుటి - 21 | సంచిక 187 | వెల - 7 | పేజీలు -12 + 8

Published from Hyderabad and Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Anantapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam



## సన్‌రైజర్స్ హైదరాబాద్ బోణి

రాజస్థాన్‌పై ఘనవిజయం..

గెలుపుతో టోర్నీ స్టార్ట్..

2లో

హైదరాబాద్, మార్చి 23, నినాదం:

ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ బోణీ కొట్టింది. సొంతగడ్డపై రాజస్థాన్ రాయల్స్ పై ఘన విజయం సాధించింది. ఉప్పల్ వేదికగా జరిగిన ఈ పోరులో 44 పరుగుల తేడాతో గెలిచి సీజన్ ను గ్రాండ్ గా ప్రారంభించింది. మరోవైపు రాజస్థాన్ చివరి వరకు పోరాడినా టార్గెట్ మరింత పెద్దది కావడంతో ఫలితం లేకుండా పోయింది. మొదట బ్యాటింగ్ చేసిన సన్ రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 286 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో రాజస్థాన్ రాయల్స్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 242 పరుగులు చేసి ఓడిపోయింది.

## ఐపీఎల్ మ్యాచ్.. బ్లాక్ టికెట్ల దందా..

### రంగంలోకి పోలీసులు

2లో



ఐపీఎల్ మ్యాచ్ నేపథ్యంలో బ్లాక్ టికెట్స్ దందాపై రాచకొండ కమిషనరేట్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. అయినా ఉప్పల్‌లో భారీగా బ్లాక్ టికెట్స్ దందా నడుస్తోంది. శని, ఆదివారాల్లో 19 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 45 బ్లాక్ టికెట్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం ముగ్గురిని, ఆదివారం 16 మందిని అరెస్ట్ చేసినట్లు రాచకొండ పోలీసులు వెల్లడించారు. వారిలో నలుగురి నుంచి 15 టికెట్లు స్వాధీనం చేసుకున్నట్లు మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసులు తెలిపారు. అలాగే దేవేందర్ అగర్వాల్ నుంచి 2, గుగులోతు రాకేష్ నుంచి 4, భానోత్ యాకుబ్ నాయక్ నుంచి 2 టిక్కెట్లను స్వాధీనం చేసుకున్నామని ఎల్బీనగర్ పోలీసులు చెప్పారు. ఇక కార్తీక అనే వ్యక్తి నుంచి 3, అప్పల సురేష్ దాస్ నుంచి 2 టికెట్లు స్వాధీనం చేసుకున్నట్లు మల్కాజిగిరి పోలీసులు పేర్కొన్నారు. మ్యాచ్ నేపథ్యంలో బ్లాక్ టికెట్ల విక్రయం జరగకుండా రాచకొండ పోలీసులు పటిష్టమైన చర్యలు చేపట్టారు. హైదరాబాద్ వేదికగా రాజస్థాన్ రాయల్స్‌తో హైదరాబాద్ సన్ రైజర్స్ ఢీ కొట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఉప్పల్ స్టేడియం వద్ద అభిమానుల కోలాహలం ప్రారంభమైంది. ఉప్పల్ స్టేడియం పరిసరాలు ఆరెంజ్ రంగు సంతరించుకొంది. ఇక ఐపీఎల్ 18వ సీజన్‌లో ఉప్పల్ స్టేడియంలో మెదట మ్యాచ్ ప్రారంభంకానుంది. సొంత గడ్డపై ఈ సీజన్‌లో తొలి మ్యాచ్‌ను హైదరాబాద్ సన్ రైజర్స్ ఆడుతోన్నారు. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై సన్ రైజర్స్‌కు మంచి రికార్డ్ ఉందన్న సంగతి అందరికి తెలిసిందే.

## నాలుగు దేశాల వలసదారులకు ట్రంప్ షాక్



### 5 లక్షల మైగ్రెంట్ల హోదా రద్దు

- త్వరలో వారిని సొంత దేశాలకు పంపుతామని ప్రకటన
- క్యూబా, హైతీ, నికరాగ్వా, వెనెజులా దేశాలపై ఎఫెక్ట్
- సర్కారు నిర్ణయంపై ఫెడరల్ కోర్టుల్లో దావాలు
- అమెరికా చట్టాలకు కట్టుబడి ఉండండి: కేంద్రం

న్యూఢిల్లీ, నినాదం:

అమెరికాలో ఉంటున్న లక్షలాది మంది మైగ్రెంట్లకు టెంపరరీ హోదాను రద్దు చేస్తున్నట్టు హోంల్యాండ్ సెక్యూరిటీ శాఖ ప్రకటించింది. మరో నెల రోజుల్లో క్యూబా, హైతీ, నికరాగ్వా, వెనెజులా దేశాలకు చెందిన సుమారు 5.32 లక్షల మందిని వారి వారి దేశాలకు డిపోర్ట్ చేయనున్నట్టు స్పష్టం చేసింది. యుద్ధాలు, సంక్షోభాలు నెలకొన్న క్యూబా, హైతీ, నికరాగ్వా, వెనెజులా దేశాల పౌరులకు గత అధ్యక్షుడు జో బైడెన్ హయాంలో హ్యూమనిటేరియన్ పెరోల్ కింద అమెరికా ఆశ్రయం కల్పించింది. ఈ నాలుగు దేశాల నుంచి నెలకు 30 వేల మందికి టెంపరరీ హోదాతో అమెరికా వచ్చి రెండేండ్లు పని చేసుకునేందుకు అవకాశం ఇచ్చింది. దీంతో అక్టోబర్ 2022లో లక్షలాది మంది అమెరికాకు వలస వచ్చారు. అయితే, వీరందరూ 2లో



## ప్రజా పాలనలో సర్వమతాల సముద్ధరణ

- దానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- శ్రీరామనవమి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలి
- అంచనాలకు మించి భక్తులు వేడుకలకు హాజరయ్యే అవకాశం
- భారీ ఏర్పాట్లు చేయండి
- వేడుకలకు సిద్ధమవుతున్న మిథిలా స్టేడియం పరిశీలన
- తెలంగాణ ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని చాటేలా దేవాలయాల అభివృద్ధి
- రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2లో..

## భారత్ ప్రయోజనాలకే ప్రాధాన్యం

- వాణిజ్య ఒప్పందాలు వాస్తవం..
- కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్



న్యూఢిల్లీ, నినాదం:

అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలపై ఓవైపు చర్చ జరుగుతుండటం, ప్రతీకార వాణిజ్య సుంకాలకు అగ్రరాజ్యం అమెరికా గడువు విధించిన నేపథ్యంలో వాణిజ్య ఒప్పందాలు వాస్తవమని, అయితే భారత్ ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం అనే విధానాన్ని తాము అనుసరించనున్నామని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ ఆర్థిక సంబంధాల్లో వాణిజ్య ఒప్పందాలు చాలా కీలకమని, అయితే ఇందువల్ల ఒనగూరే ప్రయోజనాలను చాలా జాగ్రత్తగా బేరీజు వేసుకోవాలని ఒక మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో జైశంకర్ అన్నారు.

2లో



## ఏప్రిల్ 5న ప్రధాని శ్రీలంక పర్యటన

కొలంబో, నినాదం:

భారత ప్రధాని నరేంద్ర మోడీ పొరుగు దేశం శ్రీలంకలో పర్యటించనున్నారు. 2025, ఏప్రిల్ 5న మోడీ శ్రీలంకలో పర్యటిస్తారని ఆ దేశ అధ్యక్షుడు అనుర కుమార దిస్సనాయక ప్రకటించారు. ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలను మరింత బలంగా చేయడంతో పాటు గతేడాది భారత్, శ్రీలంక మధ్య కుదిరిన ఒప్పందాలను ఖరారు చేయడానికి ప్రధాని మోడీ శ్రీలంకకు వస్తున్నారని ఆయన తెలిపారు.

2లో

## బండి సంజయ్‌కి అదొక్కటే తెలుసు..

### ఇంకేం తెల్వదు : కేటీఆర్

- కాంగ్రెస్ పెట్టే బాధలు భరించలేక అందరూ కేసీఆర్‌ను గుర్తుచేసుకుంటున్నరు
- ఇయ్యాల భూమికి జానెడున్నోడు, మూడు ఫీట్లున్నోడు ఎగిరెగిరి పడుతున్నడు

కేంద్రంలో 11 ఏళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణకు చేసిందేం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. అయోధ్య తలంబ్రాల పేరుతోటి రేషన్ బియ్యం పంచి మొన్న ఎలక్షన్‌లల్ల ఒక్కసారి గెలిచిండ్రని ఎద్దేవా చేశారు.



కరీంనగర్, నినాదం:

కరీంనగర్ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొన్న సెంటిమెంటు పూసి మాయ జేసిండ్రు తప్పితే.. తెలంగాణల వాళ్ల ఆటలు ఎన్నడూ సాగలే అన్నారు. ‘బండి సంజయ్‌ని తెలంగాణకు ఏం జేసిండ్రని అడిగితే ఏం జెప్తడు. ఏం జెప్పడు. ఎందుకంటే ఆయనకు ఏ తెల్వదు. ఆయనకు ఒక్కటే తెలుసు. ఏందది మసీదు కూలగొడ్దాం. అండ్ల శవం దొరికితే మీది, శివం దొరికితే మాది అంటడు. అదొక్కటే తెలుసాయనకు. లేదంటే అన్నా ఇయ్యాలేం వారమే, రేపేం వారేమే, ఎల్లుండే వారమే అని అడుగుతడు. అంతే తప్ప వాళ్లు ఓ బడి తెచ్చింది లేదు, ఓ గుడి కట్టింది లేదు’ అని కేటీఆర్ విమర్శించారు. 2లో



## కేటీఆర్ సూర్యాపేటలో ఏం మాట్లాడారో ఆయనకే అర్థం అయ్యిందో లేదో

- మంత్రి కోమటిరెడ్డి

నల్గొండ, నినాదం: 2లో

కేటీఆర్ సూర్యాపేట లో ఏమి మాట్లాడాడో కనీసం ఆయనకైనా అర్థం అయ్యిందో కాలేదోనని విమర్శించారు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి. SLBC ఘటనపై రాజకీయం చేయడం తగదని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో వైయస్ఆర్ హయాంలో ఎస్ఎల్బీసీ ప్రారంభిస్తే.. బీఆర్ఎస్ పదేండ్లు పాలించి పూర్తి చేయలేకపోయింది మంత్రి కోమటిరెడ్డి అన్నారు. BRS వల్లనే శ్రీశైలం ఎడమగట్టు కెనాల్ టన్నెల్ కూలిపోయిందని .. చాలా బాధాకరమైన విషయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ ఎల్ బీ సీ విషయంలో సోమవారం సీఎంతో సమావేశం అవుతామని చెప్పారు.

## బస్సు- కారు ఢీకొని ముగ్గురు మృతి

సూర్యాపేట జిల్లా బీబీ గూడెం వద్ద..

సెలవు రోజు ఘోర ప్రమాదం..




హైదరాబాద్, నినాదం:

సూర్యాపేటలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం అందరినీ కలచివేసింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం, ఈ ఘటనను మరింత విషాదంగా మార్చింది. ఈ దుర్ఘటన చివ్వెం మండలంలోని బీబీగూడెం వద్ద చోటు చేసుకుంది. ఆర్టీసీ బస్సు, ఒక కారును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో దంపతులు, వారి ఎనిమిదేళ్ల కూతురు ప్రాణాలు కోల్పోయారు. మృతులను మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని కంతాయపాలెం గ్రామానికి చెందిన గడ్డం రవీందర్, రేణుక, వారి కుమార్తె రితిక(8)గా గుర్తించారు. ఖమ్మం నుంచి బస్సు సూర్యాపేట వెళ్తున్న క్రమంలో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో మరో ముగ్గురికి గాయాలైనట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు, అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతులను ఆసుపత్రికి తరలించారు. 2లో

## ఏప్రిల్ 2న జంతర్ మంతర్ వద్ద బీసీ పోరుగర్జన

హైదరాబాద్, మార్చి 23. నినాదం:

పార్లమెంట్‌లో ప్రస్తుతం జరుగుతున్న సమావేశాల ముగిసేలోపు బీసీ బిల్లును ఆమోదించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర అసెంబ్లీలో బీసీ బిల్లు చట్టబద్ధతకు సహకరించిన బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ పార్టీలకు కృతజ్ఞతలు తెలిపారు. 2లో





## దేశ సరిహద్దుల్లో AI రోబోలతో నిఘా

న్యూఢిల్లీ, నినాదం: 2లో

దేశ సరిహద్దుల్లో నిఘా కోసం AI పవర్డ్ రోబోలను తయారు చేశారు. అంతర్జాతీయ సరిహద్దుల్లో ముఖ్యంగా వివాదాస్పద సరిహద్దు భూభాగాల్లో ఈ రోబోలతో నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ రోబోలను ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ గౌహతి సహకారంతో డా స్పాటియో రోబోటిక్ లేబొరేటరీ సంస్థ రూపొందించింది. ఈ రోబోలు రక్షణ డీఆర్ డీఏ నుంచి కూడా గుర్తింపు పొందింది. భారత సైన్యం ఇప్పటికే నిఘా వ్యవస్థకోసం ఫీల్డ్ ట్రయల్ నిర్వహించినట్లు అధికారులు చెప్పారు.

# ప్రజా పాలనలో సర్వమతాల సముద్ధరణ..

భద్రాచలం, నినాదం:

దక్షిణ అయోధ్య అయిన భద్రాచలంలో సీతా రాముల కల్యాణ ఉత్సవాన్ని తెలుగు రాష్ట్రాల్లో కోట్లాది ప్రజలు భక్తి తో వీక్షిస్తారని , ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ , సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ మొదటి వారంలో జరిగే శ్రీ రామనవమి మహోత్సవానికి తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని , ఈసారి అంచనాకు మించి భక్తులు కూడా ఎక్కువగా హాజరయ్యే అవకాశం ఉందని కావున ఎవరికీ అసౌకర్యం కలగకుండా భారీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నవమి ఏర్పాట్ల పై మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్ తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆర్ అండ్ బి, విద్యుత్, ఆర్ డబ్ల్యూ ఎస్, శానిటేషన్, హెల్త్, రవాణా, ఫైర్, ఎక్సైజ్ తదితర శాఖల అధికారులను నవమికి జరుగుతున్న ఏర్పాట్లపై వివరాలను అడిగి మంత్రి తెలుసుకున్నారు. అంతకు ముందు నవమి వేడుకలకు సిద్ధమవుతున్న మిథిలా స్టేడియాన్ని పరిశీలించారు. జిల్లా



కలెక్టర్, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని చాటేలా దేవాలయాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు తెలంగాణ అన్ని జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు. అందుకనుగుణంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. శ్రీరామనవమి వేడుకలకు ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి హాజరవుతారని మంత్రి తెలిపారు. మూడు రోజుల్లో మాడవీధుల విస్తరణకు అవసరమైన స్థల సమీకరణకు డబ్బులు చెల్లించి, శ్రీరామనవమి రోజున ముఖ్యమంత్రి చేతుల మీద గా మాడవీధుల విస్తరణ పనులు ప్రారంభోత్సవ కార్యక్రమం చేపడతామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. .వేసవి అధికంగా ఉన్నందున మంచినీటి కేంద్రాలు, మజ్జిగ పంపిణీ కేంద్రాలను అధికంగా ఏర్పాటు చేయాలన్నారు. స్నానఘట్టాలను, ఆలయ పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ సహా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర స్థాయి అధికారులు, వివిధ రంగాల ప్రముఖులు హాజరుకానున్న నేపథ్యంలో పార్కింగ్ కు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. వేడుకలకు హాజరయ్యే అతిథులందరికీ కావాల్సిన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వీలైనన్ని ఎక్కువగా ప్రాథమిక చికిత్సా కేంద్రాలు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. కల్యాణం అనంతరం స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా దర్శన భాగ్యం కల్పించాలని తెలిపారు. ట్రాఫిక్ కు విఘాతం కలగకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అగ్ని ప్రమాదం జరగకుండా ముందుగానే ఫైర్ ఇంజన్లు అందుబాటులో ఉంచుకుని నవమి ఉత్సవాలను అట్టహాసంగా జరపాలని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్థానిక ఆర్డీవో దామోదర్ , వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఏప్రిల్ 5న ప్రధాని శ్రీలంక పర్యటన

ఈ పర్యటన సందర్భంగా ప్రధాని మోడీ ట్రింకోమలీలో సాంపూర్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. ప్రధాని మోడీ పర్యటనపై గత వారమే ఆ దేశ విదేశాంగ మంత్రి విజిత హెరాత్ మాట్లాడుతూ.. అధ్యక్షుడు దిస్సనాయక గత సంవత్సరం ఢిల్లీ పర్యటన సందర్భంగా కుదిరిన ఒప్పందాలను ఖరారు చేయడానికి భారత ప్రధాని శ్రీలంకలో పర్యటిస్తారని తెలిపారు. శ్రీలంక, భారత్ మధ్య సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి ఒక ఒప్పందం కుదిరింది. శ్రీలంకలోని ట్రింకోమలీ జిల్లా సాంపూర్‌లో 50 మెగావాట్ల (దశ 1), 70 మెగావాట్ల (దశ 2) సామర్థ్యం గల సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నారు. సిలోన్ విద్యుత్ బోర్డు, నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రెండు ప్రభుత్వాల మధ్య జాయింట్ వెంచర్‌గా నిర్మాణం చేపట్టనున్నాయి. ఈ పర్యటన సందర్భంగా ప్రధాని మోడీ గతంలో ఇరు దేశాల మధ్య జరిగిన ఒప్పందాలను ఖరారు చేయడంతో పాటు.. ట్రింకోమలీ జిల్లా సాంపూర్‌లో ఏర్పాటు చేయనున్న సౌర విద్యుత్ ప్లాంట్ల నిర్మాణాన్ని ప్రారంభించనున్నారు.

## దేశ సరిహద్దుల్లో AI రోబోలతో నిఘా

సరిహద్దుల్లో ప్రస్తుత భద్రత చర్యలకు భిన్నంగా ఈ రోబోటిక్ నిఘా వ్యవస్థ స్వయం ప్రతిపత్తిని కలిగి ఉంటుందని డీఎస్ ఆర్ఎలస్ సీఈవో అర్నబ్ కుమార్ బర్మాన్ తెలిపారు. పోల్ ట్రావర్సల్ సామర్థ్యం, అడాప్టివ్ అబ్స్టాకిల్ నావిగేషన్, AI-ఆధారిత నిఘాతో కూడిన ఈ వ్యవస్థ సరిహద్దు రక్షణ, కీలకమైన మౌలిక సదుపాయాల నిఘా,వ్యూహాత్మక రక్షణ పరంగా గేమ్-ఛేంజర్ లాంటిది. సరిహద్దుల్లో భద్రత పరంగా తలెత్తుతున్న సవాళ్లను ఈ వ్యవస్థ పరిష్కరిస్తుందన్నారు. 24గంటల నిఘా, కిష్టమైన భూభాగంలో నిరంతరాయంగా, నిరాటంకంగా పనిచేస్తుందన్నారు. ఈ వ్యవస్థలో సెన్సార్ నిఘా ఉంటుంది. దాడులను గుర్తించి నిరోధించే సామర్థ్యం కలిగి ఉంటుందని బర్మాన్ అన్నారు. సరిహద్దుల్లో డ్రోన్లు పంపడం, చొరబాటు యత్నాలు చేస్తే రోబోల సెన్సార్లు వెంటనే గుర్తించి నిరోధిస్తాయని చెప్పారు. జాతీయభద్రతను బలోపేతం చేసేలా మరిన్ని ఆవిష్కరణ చేస్తామన్నారు.



కేటీఆర్ సూర్యాపేటలో ఏం మాట్లాడారో

## ఆయనకే అర్థం అయ్యిందో లేదో

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు, మిషన్ భగీరథ, సాగునీరు, రహదారుల స్థితిగతులపై ఏర్పాటు చేసిన రివ్యూ మీటింగ్ లో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఖమ్మం, నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లా నుంచి ముప్పై ఆరు సీట్లు గెలిచామని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. నల్గొండ జిల్లా ప్రాజెక్ట్ లు తమ హయాంలో పూర్తి చేయడం జరుగుతుందని చెప్పారు. మంత్రి ఉత్తమ్ చొరవతోనే శ్రీశైలం నుంచి రోజుకి ఐదు వేల టీఎంసీ నీళ్లు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నేత రాంరెడ్డి దామోదర్ రెడ్డి ఆరోగ్యం బాగాలేక పోవడం వల్లనే జగదీష్ రెడ్డి గెలిచారని, జగదీష్ రెడ్డి మంత్రి గా ఉన్నప్పుడు ఏ రోజు ప్రాజెక్ట్ గురుంచి పట్టించుకోలేదని మండిపడ్డారు. నల్గొండ జిల్లాలో తాము చేసిన అభివృద్ధే కనిపిస్తోందని, జగదీశ్ రెడ్డి చేసిందేమీ లేదని అన్నారు. మహాత్మ గాంధీ యూనివర్సిటీ ని తామే పూర్తి చేసినట్లు తెలిపారు.

## ఏప్రిల్ 2న జంతర్ మంతర్ వద్ద బీసీ పోరుగర్జన

ఢిల్లీలో కూడా ఈ బిల్లుకు ఆమోదం పొందేందుకు కూడా తగిన సహకారం అందించాలని కోరారు. బీసీ ముస్లింలను సాకుగా చూపించి బిల్లును ఆమోదించకుండా పెండింగ్‌లో పెట్టాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యోచిస్తుందని జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. అలాగే పెండింగ్‌లో పెడితే కేంద్ర ప్రభుత్వానికి బీసీ సత్తా చూపిస్తామని తెలిపారు. ఏప్రిల్ 2లోగా పార్లమెంటులో బీసీ బిల్లును ఆమోదించాలని.. లేనిపక్షంలో ఏప్రిల్ 2వ తేదీన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద లక్షలాది మంది బీసీలతో పోరు గర్జన నిర్వహిస్తామని హెచ్చరించారు. 29 రాష్ట్రాల్లోని లక్షలాది బీసీలను ఢిల్లీకి తరలిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఛలో ఢిల్లీ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశ్ చారి, కనకాల శ్యామ్ కురుమ, మణిమంజరి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## బస్సు- కారు ఢీకొని ముగ్గురు మృతి

పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి, విచారణ ప్రారంభించారు. ప్రమాదానికి సంబంధించిన మరింత సమాచారం సేకరించడానికి వారు సాక్షులను ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో ఆర్టీసీ బస్సు వేగంగా ప్రయాణిస్తున్నట్లు సమాచారం. మలుపు వద్ద రెండు వాహనాలు వేగంగా వచ్చిన క్రమంలోనే ఈ ఘోర ప్రమాదం జరిగి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. సూర్యాపేటలో జరిగిన ఈ ప్రమాదం స్థానిక ప్రజల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటన గురించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదం నేపథ్యంలో వేగం నియంత్రణతోపాటు డ్రైవింగ్ సమయంలో శ్రద్ధ వహించాలని పోలీసులు ప్రజలకు సూచిస్తున్నారు. దీంతోపాటు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని కోరుతున్నారు.

## సంభాల్ హింసాకాండలో కీలక మలుపు.. జామా మసీదు చీఫ్ అరెస్టు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ లో గత ఏడాది నవంబర్ 24న జరిగిన హింసాకాండ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ ఘటనతో ప్రమేయం ఉన్నట్టుగా భావిస్తున్న షాహి జామా మసీదు కమిటీ అధ్యక్షుడు జాఫర్ అలిని పోలీసులు ఆదివారంనాడు అరెస్టు చేశారు. స్థానిక పోలీసులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక విచారణ బృందం ఇంతకుముందు కూడా ఆయన సాక్ష్యాన్ని నమోదు చేసేందుకు కస్టడీలోకి తీసుకుందని అధికారులు తెలిపారు. అయితే, మార్చి 24న త్రిసభ్య జ్యుడిషియల్ కమిటీ ముందు వాంగ్మూలం ఇవ్వకుండా అడ్డుకునేందుకే జాఫర్ అలీని అరెస్టు చేసినట్టు ఆయన సోదరుడు తాహిర్ అలీ ఆరోపించారు. హింసాకాండ ఘటనలో జాఫర్ అలీని అరెస్టు చేసినట్టు సంభాల్ పోలీసు సూపరింటెండెంట్ ధ్రువీకరించారు. అయితే మరిన్ని వివరాలు వెల్లడించేందుకు నిరాకరించారు. మొఘులుల కాలం నాటి మసీదు రీసర్వే సందర్భంగా గత నవంబర్ 24న హింసాకాండ చెలరేగింది. ఈ ఘటనలో నలుగురు ప్రాణాలు కోల్పోగా, పలువురు గాయపడ్డారు. ఈ ఘటన తీవ్ర సంచలనం సృష్టించడంతో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నలుగురు సభ్యులతో కూడిన జ్యుడిషియల్ ప్యానల్‌ను విచారణకు నియమించింది. కాగా, సోమవారం జ్యుడిషియల్ ప్యానల్ ముందు జఫర్ అలి హాజరై వాంగ్మూలం ఇవ్వాల్సి ఉందని, అలా జరక్కుండా చేసేందుకు ఉద్దేశపూర్వకంగానే ఆయనను ముందస్తుగా అరెస్టు చేశారని తాహిర్ అలీ ఆరోపించారు. ఉదయం 11.15 గంటలకు విచారణ అధికారి తమ ఇంటికి వచ్చారని, సర్కిల్ అధికారి కులదీప్ సింగ్ మాట్లాడాలనుకుంటున్నారని తమతో చెప్పారని అన్నారు. సర్కిల్ ఆఫీసర్ గత రాత్రి కూడా తమతో మాట్లాడారని, కమిషన్ విచారణ సోమవారం ఉండనగా ఉద్దేశపూర్వకంగానే జాఫర్ అలీని అరెస్టు చేసి జైలుకు పంపారని వివరించారు. హింసాకాండలో చనిపోయిన వారంతా పోలీసు బుల్లెట్లకే చనిపోయినట్టు జాఫర్ ఇప్పటికే మీడియా ముందు చెప్పారని, ఆ మాటను ఆయన ఉపసంహరించుకునే ప్రసక్తే లేదని తాహిర్ అలీ తెలిపారు. జాఫర్‌ను కస్టడీలోకి తీసుకునేటప్పుడు ఆయన ఏమైనా చెప్పారా అని మీడియా ప్రశ్నించగా, తాను సత్యమే చెబుతానని, అందుకోసం జైలుకు వెళ్లేందుకు కూడా సిద్ధంగా ఉన్నానని తన సోదరుడు చెప్పినట్టు తాహిర్ అలీ సమాధానమిచ్చారు.

యాంకర్ శ్యామలకు కష్ట కాలం..

## ఆమె వంతు కూడా రానే వచ్చింది !

హైదరాబాద్:

బెట్టింగ్ యాప్స్ కేసులో విచారణకు రంగం సిద్ధమైంది. నేటి నుంచి ముమ్మరంగా విచారణ సాగనుంది. హైకోర్టు ఆదేశాల మేరకు మార్చి 24న నటి శ్యామల, 25న విష్ణు ప్రియ, రీతూల విచారణ జరగనుంది. బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ చేసిన 11 మందిపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు కాగా ఇప్పటి వరకు టేస్టీ తేజ, కానిస్టేబుల్ కిరణ్, విష్ణు ప్రియ, రీతూ చౌదరిలను పోలీసులు విచారించారు. వీరితో పాటు సన్నీ, అజయ్, సుధీర్ కూడా ఎప్పుడైనా విచారణకు హాజరయ్యే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే హర్ష సాయి, ఇమ్రాన్ ఇంకా పోలీసులకు అందుబాటులోకి రాలేదని సమాచారం. అటు మియాపూర్ కేసులో మొదట బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులు, మధ్యవర్తులను విచారించే అవకాశం ఉన్నట్లు సమాచారం. బెట్టింగ్ యాప్ లలో మన తెలంగాణ రాష్ట్రంలోనే ఒక సంవత్సరంలో వంద కోట్లకు పైగా నష్టపోయినట్టు అంచనా. ఆ అప్పులు తీర్చలేక, ఇంట్లోవాళ్లకు చెప్పుకోలేక మానసిక వేదనతో ఆత్మహత్యాయత్నాలు చేస్తున్నారు కొందరు. ఇప్పటికే ఒక్క హైదరాబాద్‌లోనే పది మంది ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు చెప్తున్నారు.

## బండి సంజయ్‌కి అదొక్కటే తెలుసు.. ఇంకేం తెల్వదు : కేటీఆర్

‘ఒక ఓటు ద్వారా తప్పుడు పాలకులను ఎన్నుకున్నందుకు ఐదేళ్ల శిక్ష పడింది. ఇగనైనా మనం మేలుకోవాలి. మంచి పాలకులను ఎన్నుకోవాలె. బీఆర్ఎస్‌ను ఓడగొట్టడానికి కాంగ్రెస్ పార్టీ అసూయ, ద్వేషం, ఆశ అనే మూడు ప్రయోగాలు చేసింది. స్థానిక నాయకత్వం మీద అసూయ నింపింద్రు. కేసీఆర్ మీద ద్వేషం పెంచింద్రు. ఓటర్లకు తులం బంగారం, రూ.15 వేల రైతుబంధు, పెన్షన్ల రెట్టింపు అని ఆశ పెట్టింద్రు. వాళ్ల ప్రయోగాలు ప్రజలపై పనిచేయడంలో ప్రజల తప్పు లేదు. మన తప్పే ఉంది. కేసీఆర్ ప్రజలకు చెప్పమన్నది మనం సరిగ్గా చెప్పుకోలేకపోయినం.’ అని అన్నారు. ‘కేసీఆర్ హయాంలో దినదినాభివృద్ధి చెందిన తెలంగాణ ఇవాళ కాంగ్రెస్ పాలనలో ఆగమైతున్నది. తెలంగాణను కాపాడుకోవాలంటే మళ్లీ బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావాలె. ఏప్రిల్ 27 తర్వాత కొత్తగా మెంబర్‌షిప్ కార్యక్రమాన్ని ప్రారంభించుకుందాం. కమిటీలను నిర్మించుకుందాం. కమిటీల్లో ప్రజల మధ్య ఉండే నాయకులకు చోటు కల్పిద్దాం. ప్రజలకు కాంగ్రెస్, బీజేపీ ఎట్ల అన్యాయం చేసినయో వివరించేలా మన నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలె. అందుకోసం అన్ని జిల్లా కేంద్రాల్లో శిక్షణ కార్యక్రమాలు పెట్టుకుందాం. ఒకవేళ రేవంత్‌రెడ్డికి బుద్ధొచ్చి స్థానిక సంస్థల ఎన్నికలు పెడితే పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తం. ఈ సారి కరీంనగర్‌లోని 13 స్థానాల్లో గులాబీ జెండా ఎగిరేలా పనిచేద్దాం. పార్టీకి టికెట్ ఇచ్చిన అభ్యర్థి వెంటే క్యాడర్ నడువాలి. వ్యక్తిగత కక్షల కుపోతే అవతలి అభ్యర్థికి లబ్ధి జరుగుతది. 2028లో కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేద్దామని శపథం చేద్దాం.’ అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

### కాంగ్రెస్ పెట్టే బాధలు భరించలేక అందరూ కేసీఆర్‌ను గుర్తుచేసుకుంటున్నరు

బీఆర్ఎస్ పార్టీ 24 ఏళ్లు పూర్తిచేసుకుని 25వ ఏడులోకి అడుగుపెట్టబోతున్నదని, ఈ సందర్భంగా రాష్ట్రంలో పరిస్థితి గురించి చెప్పుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఏ మూలకు పోయి ఏ రైతును పలుకరించినా గుడ్లల్లకెళ్లి నీళ్లు దిరుగుతున్నయని, బాధపడుతున్నరని చెప్పారు. కేసీఆర్ ఉన్నప్పుడే బాగుండనని, ఇప్పుడు బతుకులు అన్యాయమై పోతున్నయని చెబుతున్నరని తెలిపారు. రైతులే కాదు రాష్ట్రవ్యాప్తంగా ఎవరిని పలుకరించినా బాధ వ్యక్తం చేస్తున్నరని కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్ పెట్టే బాధలు చూసి ఇప్పుడు అందరికీ కేసీఆర్ గుర్తుకొస్తున్నరని అన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే రైతుబంధుకు రాంరాం చెప్తరని కేసీఆర్ ముందే చెప్పారుని, అయినా వినిపించుకోలేదని అన్నారు. కాంగ్రెసోళ్లు ఇందిరమ్మ రాజ్యం తెస్తమని చెప్పినా ఓట్లేసింద్రని, ఇందిరమ్మ రాజ్యమంటే ఎమర్జెన్సీ రాజ్యమనే సంగతి మర్చిపోయినట్టున్నరని వ్యాఖ్యానించారు. ఒక్కటి మాత్రం వాస్తవమని ప్రజలకు ఏ కష్టమొచ్చినా, ఏ దుఃఖమొచ్చినా గుర్తుకొస్తున్నది కేసీఆరేనని కేటీఆర్ అన్నారు. ఆటోడ్రైవర్లు కేసీఆర్‌ను గుర్తుచేసుకుంటున్నరని చెప్పారు. ఉద్యోగులు కేసీఆర్ పెంచిన జీతాలను దిజేసుకుంటున్నరని తెలిపారు. నిరుద్యోగులు కేసీఆర్‌ను గుర్తుచేసుకుంటున్నరని



అన్నారు. కాంగ్రెస్‌కు ఓటేసినందుకు తప్పైపోయిందని చెప్తున్నరని వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రతిబిడ్డ మళ్లీ ఓట్లు ఎప్పుడొస్తయా, గులాబీ జెండాకు ఎప్పుడు పట్టం కడుదామా అని ఎదురుచూస్తున్నరని చెప్పారు.

### ఇయ్యాల భూమికి జానెడునోడు, మూడు ఫీట్లునోడు ఎగిరెగిరి పడుతున్నడు

కాంగ్రెస్, బీజేపీలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ పార్టీలు రెండూ తెలంగాణ ప్రజలను ఏళ్లుగా మోసం చేస్తున్నాయని విమర్శించారు. ఇవాళ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ పార్టీలు రెండూ తెలంగాణ ప్రజలను ఏళ్లుగా మోసం చేస్తున్నాయని విమర్శించారు. ఇవాళ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో కేటీఆర్ లేచి నిలబడి మైకు అందుకోగానే జనం సీఎం సీఎం అంటూ నినాదాలు చేశారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీపైనా, రేవంత్‌రెడ్డిపైనా, బీజేపీపైన విమర్శలు గుప్పించారు. కేసీఆర్ ఉద్యమం మొదలుపెట్టిన సందర్భాన్ని గుర్తుచేశారు. కేసీఆర్ తెలంగాణ ఉద్యమం మొదలు పెట్టినప్పుడు చేసిన వాగ్ధానాన్ని కేటీఆర్ ప్రస్తావించారు. ‘తాను గొంగలి పురుగునైనా ముద్దాడుతా.. కుష్ఠురోగినైనా కౌగిలించుకుంటా.. ఆరెస్సెస్ నుంచి ఆర్ఎస్‌యూ దాకా, లెఫ్ట్ నుంచి రైట్ దాకా అన్ని పార్టీలను కలుపుకుపోతా.. మీరు ఓట్లేసి మమ్మల్ని ఎంపీలు, ఎమ్మెల్యేలు చేస్తే ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ సాధిస్తా.. మధ్యలో తప్పుకుంటే రాళ్లతో కొట్టి చంపండి..’ అని నాడు కేసీఆర్ చెప్పిన సందర్భాన్ని గుర్తుచేశారు. అంతటి చిత్తశుద్ధితో కేసీఆర్ పార్టీ పెట్టారని అన్నారు. ఇయ్యాల భూమికి జానెడు ఉన్నోడు, మూడు ఫీట్లు ఉన్నోడు ఎగిరెగిరి పడుతున్నడని, తెలంగాణ గురించి ఏం తెల్వనోడు గూడా కేసీఆర్ ఏంజేసిండని మాట్లాడుతున్నరని ఎద్దేవా చేశారు. కాలం మనది కానప్పుడు వానపాములు కూడా నాగుపాములై బుసలు కొడుతుంటే చూడాలని, గ్రామ సింహాలు కూడా సింహాల లెక్క గర్జిస్తుంటే చూడాలని చెప్పారు.



## సన్‌రైజర్స్ హైదరాబాద్ బోణీ

287 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో రాజస్థాన్ ఆరంభంలోనే తడబడింది. ఓపెనర్ యశస్వి జైశ్వాల్ ఒక పరుగే చేసి ఔటయ్యాడు. ఆ తర్వాత వచ్చిన కెప్టెన్ పరాగ్.. తొలి బంతికి ఫోర్ కొట్టి రెండో బంతికి ఔటయ్యాడు. ఈ రెండు వికెట్లు కూడా సిమర్జీత్ సింగ్ కే దక్కాయి. నాలుగో స్థానంలో వచ్చిన నితీష్ రాణా కూడా ఎక్కువ సేపు క్రీజ్ లో నిలబడలేకపోయాడు. కేవలం 11 పరుగులే చేసి షమీ బౌలింగ్ లో క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. 50 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడినా.. ధృవ్ జురెల్, సంజు శాంసన్ పోరాటం అత్యద్భుతం. ఓటమి కళ్ళ ముందు కనబడుతున్నా వీరి పోరాటం సన్ రైజర్స్ జట్టులో దడ పుటించింది. బౌండరీల వర్షం కురిపిస్తూ స్కోర్ కార్డును ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఇద్దరూ తమ హాఫ్ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. నాలుగో వికెట్ కు ఈ జోడీ 9 ఓవర్లలోనే 110 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఏదైనా సంచలనం నమోదవుతుందా అనే సమయంలో శాంసన్, జురెల్ స్వల్ప వ్యవధిలో ఔటయ్యారు. చివర్లో శుభమ్ దూబే, హెట్ మేయర్ బౌండరీలతో విరుచుకుపడ్డారు. అయితే జట్టును మాత్రం గెలిపించలేకపోయారు. హైదరాబాద్ బౌలర్లలో హర్షల్ పటేల్, సిమర్జీత్ సింగ్ తలో రెండు వికెట్లు పడగొట్టారు. అంతకముందు మొదట బ్యాటింగ్ చేసిన సన్ రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 286 పరుగులు చేసింది. తొలి సారి సన్ రైజర్స్ తరపున ఆడుతున్న ఇషాన్ కిషాన్ 45 బంతుల్లో సెంచరీ చేసి దుమ్ము లేపాడు. అతని ఇన్నింగ్స్ లో 6 సిక్సర్లు, 11 ఫోర్లు ఉన్నాయి. ట్రావిస్ హెడ్ (67) హాఫ్ సెంచరీతో మెరుపులు మెరిపించగా.. క్లాసన్(34), నితీష్ రెడ్డి (30) రాణించారు. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లలో తుషార్ దేశ్ పాండే మూడు వికెట్లు తీసుకోగా.. తీక్షణ రెండు వికెట్లు పడగొట్టాడు. సందీప్ శర్మ ఒక వికెట్ పడగొట్టాడు.

## ట్రంప్ షాక్



ఈ ఏడాది ఏప్రిల్ 24న లేదా ఫెడరల్ రిజిస్టర్ లో నోటీస్ పబ్లిష్ చేసిన 30 రోజుల తర్వాత లీగల్ స్టేటస్ ను కోల్పోతారని శుక్రవారం యూఎస్ హోంల్యాండ్ సెక్యూరిటీ మంత్రి క్రిస్టీ నోయెమ్ వెల్లడించారు. అమెరికా గత అధ్యక్షులు సంక్షోభాల్లో ఉన్న ఆయా దేశాల బాధిత పౌరులకు ఆశ్రయం కల్పించేందుకు అమలు చేస్తున్న హ్యూమనిటేరియన్ పెరోల్ దుర్వినియోగం అవుతోందని, అందుకే తాము ఈ పాలసీని రద్దు చేస్తామని ప్రెసిడెంట్ ట్రంప్ ఇదివరకే ప్రకటించారు. ట్రంప్ ఆదేశాల నేపథ్యంలో తాజాగా ఈ పాలసీ కింద వచ్చిన మైగ్రెంట్లకు టెంపరరీ హోదాను రద్దు చేయనున్నారు. అమెరికాలో ఉండేందుకు చట్టబద్ధమైన హక్కు లేనివాళ్లంతా పెరోల్ టర్మినేషన్ డేట్‌లోగా తప్పకుండా డిపోర్ట్ కావాల్సిందేనని హోంల్యాండ్ సెక్యూరిటీ తేల్చిచెప్పింది. ట్రంప్ సర్కారు నిర్ణయాన్ని సవాల్ చేస్తూ అమెరికన్ పౌరులు, ఇమిగ్రెంట్ల గ్రూపు ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాల్లోని ఫెడరల్ కోర్టుల్లో పిటిషన్లు కూడా దాఖలయ్యాయి. ఈ నాలుగు దేశాల పౌరులకు హ్యూమనిటేరియన్ పెరోల్ ను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశాయి.

### అమెరికా చట్టాలకు కట్టుబడి ఉండండి: కేంద్రం

అమెరికాలో ఉంటున్న ఇండియన్ స్టూడెంట్లు అక్కడి చట్టాలు, నిబంధనలకు కట్టుబడి ఉండాలని భారత ప్రభుత్వం సూచించింది. హమాస్ టెర్రరిస్ట్ సంస్థ ప్రాపగండాను వ్యాప్తి చేస్తున్నాడంటూ ఇటీవల జార్జిటౌన్ వర్సిటీలో పోస్ట్ డాక్టోరల్ రీసెర్చర్ గా ఉన్న బాదర్ ఖాన్ సూరిని యూఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. పాలస్తీనా అనుకూల నిరసనల్లో పాల్గొన్న కారణంగా కొలంబియా వర్సిటీ స్టూడెంట్ రంజిని శ్రీనివాసన్ వీసా రద్దు కావడంతో ఆమె అరెస్ట్ కు ముందే కెనడాకు సెల్ఫ్ డిపోర్ట్ అయింది. ఖాన్ సూరి డిపోర్టేషన్‌కు అమెరికా అధికారులు సిద్ధం కాగా, కోర్టు స్టే ఇచ్చింది. ప్రస్తుతం అతను డిటెన్షన్ సెంటర్‌లోనే ఉన్నాడు. యూనివర్సిటీల్లో పాలస్తీనా, హమాస్ అనుకూల నిరసనల్లో పాల్గొనేవారిని టెర్రరిస్ట్ సింపథైజర్లుగా ప్రకటించిన ప్రెసిడెంట్ ట్రంప్.. వారిని సొంత దేశాలకు తిప్పిపంపుతామని హెచ్చరించారు. దీనిపై తాజాగా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందించా రు. ‘‘ఇమిగ్రేషన్ వ్యవహారాలు ఆయా దేశాల సార్వభౌమ అధికారాల ప్రకారం కొనసాగుతా యి. ఇండియాకు వచ్చే విదేశీయులు ఇక్కడి చట్టాలకు కట్టుబడి ఉండాలని కోరుకున్నట్లే..అమెరికాలోని ఇండియన్లు అక్కడి చట్టాలకు కట్టుబడి ఉండాలి’’ అని స్పష్టం చేశారు.

## భారత్ ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం



ప్రధానంగా సున్నితమైన టెక్నాలజీ విషయంలో ఇలాంటి ఒప్పందాల వల్ల ఇరువైపులా ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు. భారత ప్రభుత్వం ప్రస్తుతం మూడు కీలక వాణిజ్య ఒప్పందాలపై సంప్రదింపులు జరుపుతోందని జైశంకర్ తెలిపారు. వీటిలో ఒకటి యూఎస్‌తో జరురుతోందని చెప్పారు. "అంతర్జాతీయ ఆర్థిక సంబంధాల్లో వాణిజ్య ఒప్పందాలు కీలకం. ఇప్పుడు వీటి ప్రాధాన్యత కూడా పెరిగింది. దీనిని భారత్ గుర్తించింది. ప్రస్తుతం, మనం మూడు వాణిజ్య ఒప్పందాలపై సంప్రదింపులు జరుపుతున్నాం. ఐరోపా సమాఖ్య, యూకే, అమెరికాతో ద్వైపాక్షిక ఒప్పందంతో చర్చలు జరుపుతున్నాం. న్యూజిలాండ్‌తో కూడా ఈ వారమే చర్చలు ప్రారంభించాం. మరి కొందరితో కూడా చర్చలు జరపనున్నాం" అని జైశంకర్ తెలిపారు. భారతదేశం "ఇండియా ఫస్ట్" విధానాన్ని అనుసరించనుందని జైశంకర్ భరోసా ఇచ్చారు. వికసిత్ భారత్ లక్ష్యంగా ఇండియా ఫస్ట్ పాలసీని అనుసరించనున్నట్టు చెప్పారు. గతంలో ఎక్కువగా ఆసియా దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏ)లు చేసుకునే వాళ్లమని, వాణిజ్యం పోటాపోటీగా ఉండేదని అన్నారు. అమెరికా ఫస్ట్ పాలసీలో భాగంగా డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రతీకార సుంకాలకు కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. భారత్‌తో మంచి సంబంధాలే ఉన్నాయని, అయితే భారత్ అధిక సుంకాలు విధిస్తోందని, ఏప్రిల్ 2 నుంచి ప్రతీకార సుంకాలు తప్పవని హెచ్చరించారు.

మాజీ మంత్రి విడదల రజినీకి

## బిగ్ షాక్.. ఏసీబీ కేసు నమోదు..

విజయవాడ : ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైసీపీ నేతలపై వరుస కేసులు నమోదవుతున్నాయి.. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలు మొదలుకొని.. సోషల్ మీడియా పోస్టుల వరకు ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ కేసులు నమోదవుతున్నాయి. ఈ క్రమంలో మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు విడదల రజినీకి బిగ్ షాక్ తగిలింది. రజినీతో పాటు పలువురిపై కేసు నమోదు చేశారు ఏసీబీ అధికారులు. అవినీతి ఆరోపణలు, బెదిరింపులు తదితర అభియోగాలపై కేసు నమోదైనట్లు తెలుస్తోంది. అవినీతి నిరోధక చట్టంలోని 7, 7A, ఐపీసీ 384, 120B, సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేశారు ఏసీబీ అధికారులు. 2020 సెప్టెంబర్ లో పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం విశ్వనాథుని కండ్రిక గ్రామంలోని శ్రీ లక్ష్మీబాలాజీ స్టోన్ క్రషర్ యజమానిని విజిలెన్స్ తనిఖీల పేరుతో బెదిరించి రూ.2.20 కోట్లు అక్రమంగా వసూలు చేశారనే అభియోగంపై విడదల రజిని మీద కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది.

## జగన్‌పై సోము వీర్రాజు
# సంచలన వ్యాఖ్యలు



**విశాఖ, మార్చి 23(నినాదం న్యూస్) :** వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డిపై బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. కూటమి లక్ష్యం వైఎస్సార్‌సీపీ ఖాళీ చేయడమేనని.. జగన్ పార్టీకి 20 శాతం ఓట్లు కూడా రాకుండా చూస్తామన్నారు. మళ్ళీ సిఎం అవుతానని జగన్ కలలు కంటున్నారని.. అధికారులను బెదిరిస్తున్నారని మండిపడ్డారు. ఏపిలో ప్రతిపక్ష నాయకుడు శాసన సభకు వెళ్ళడం లేదని, ప్రజలు ఇవ్వని ప్రతిపక్ష హోదా కావాలని జగన్ కోరుతున్నారని.. 2014లో వైఎస్సార్‌సీపీకి ప్రతిపక్ష హోదా ఇస్తే జగన్ సభకు వెళ్ళలేదని అన్నారు. 2024లో ప్రజలు వైఎస్సార్‌సీపీకి ప్రతి పక్ష హోదా ఇవ్వలేదని.. ప్రతి పక్ష హోదా ఇస్తేనే సభకు వస్తానని అనడం విడ్డూరంగా ఉందన్నారు. జగన్‌ది రెండు నాల్కుల ధోరణి అని సోము వీర్రాజు విమర్శించారు. అలాగే బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్‌పై ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఫైర్ అయ్యారు. ఆయన రాత్రి పూట సరిగా నిద్ర పోవడంలేదని, కేసీఆర్ తన కుమార్తె కవిత, కుమారుడు కేటీఆర్, మేనల్లుడు హరీష్ రావుల కోసం ఆలోచిస్తున్నారని, వారి కుటుంబం మాత్రమే అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నారని అన్నారు. కేసీఆర్ తెలంగాణ ప్రజలకు కళ్లబ్లో కబుర్లు చెప్పి పదేళ్లు తెలంగాణను పాలించారని సోము వీర్రాజు ఆరోపించారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎవ్వరు చేయలేనంత నాశనం జగన్మోహన్ రెడ్డి ఏపీ రాష్ట్రానికి చేశారని, అన్నీ విధాలుగా రాష్ట్రాన్ని నాశనం చేసిన జగన్‌ను ప్రజలు దూరం పెట్టాలని బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ప్రజలకు పిలుపిచ్చారు. ఆసెంబ్లీలో వైసీపీ దూరగతాలను, ఆక్రమాలను బయటపెట్టామన్నారు. ఆసెంబ్లీలో ఎమ్మెల్యేలకు స్పోర్ట్స్, సాంస్కృతిక కార్యక్రమాలు చాలా అత్యుత్సాహంగా నిర్వహించారన్నారు. జగన్ హాయాంలో సిఎం రిలీఫ్ ఫండ్ పూర్తి స్థాయిలో ఎవరికి అందలేదని ఆరోపించారు. ఈరోజు ఉత్తర నియోజకవర్గంలో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణి చేస్తున్నామన్నారు. టిడ్కో ఇళ్లను దూర్మర్గపు వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిందని, ఇప్పుడు ఆ భారం లబ్దిదారుల మీద పడుతోందన్నారు. ఒక సెంటూ పనికిరాని భూములు పేదలకు కేటాయించారని, ఆ సైటు వద్దని చెప్తే, తిరిగి రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవిస్తామని విష్ణుకుమార్ రాజు అన్నారు. **మాధవ్ కామెంట్స్...** బీజేపీ మాజీ ఎమ్మెల్సీ మాధవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వివిధ పార్టీల నేతలు బీజేపీలో చేరడం పరిపాటి అయిందన్నారు. ఆదారి ఆనంద్ బీజేపీలో చేరడం శుభపరిణామమన్నారు. దేశ వ్యాప్తంగా నరేంద్రమోదీ పేరు మారుమ్రోగుతుందని, మోదీ నేతృత్వంలో దేశం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందన్నారు. త్వరలో విశాఖలో బీజేపీ పార్టీలో చేరికలు ఉంటాయని మాధవ్ అన్నారు.

# ఆయనకు నాపై చాలా కోపం ఎందుకో తెలియదు



**గుంటూరు, మార్చి 23(నినాదం న్యూస్) :** కూటమి ప్రభుత్వంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని మాజీ మంత్రి, వైసీపీ నేత విడదల రజిని ఆరోపించారు. రెడ్‌బుక్‌లో తనను టార్గెట్ చేశారన్నారు.అందులో భాగంగానే తనపై అక్రమ కేసు పెట్టారని విమర్శించారు. తనపై ఫిర్యాదు చేసిన వారిని తానెప్పుడూ చూడలేదని చెప్పారు. తనపై ఏసీబీ కేసు నమోదు చేయడంతో.. ఆదివారం గుంటూరులో మాజీ మంత్రి విడదల రజినీ స్పందించారు. ఆ క్రమంలో ఆమె మాట్లాడుతూ.. తానంటే నరసరావుపేట ఎంపీ ఎల్ శ్రీకృష్ణదేవరాయలుకు చాలా కోపమని తెలిపారు. అది ఎందుకో తెలియదన్నారు. ఆ ఎంపీ ఆదేశాలతోనే తనపై కేసు పెట్టారని వివరించారు. తనను, తన కుటుంబాన్ని ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రెడ్‌బుక్ పాలనలో భాగంగానే తనపై ఈ అక్రమ కేసు పెట్టారన్నారు. తనపై కేసు పెట్టిన వారు టీడీపీకి చెందిన వారేనని విడదల రజిని ఈ సందర్భంగా పేర్కొన్నారు. తాను ఏ తప్పు చేయకపోయినా.. తనన ఇబ్బంది పెడుతున్నారన్నారు వైసీపీలో ఉన్నప్పటి నుంచి శ్రీకృష్ణదేవరాయకులకు తనపై కక్ష ఉందని గుర్తు చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎంపీగా శ్రీకృష్ణదేవరాయలు ఉన్నారని తెలిపారు. ఒక మహిళా ఎమ్మెల్యే కాల్ డేటా అడిగారని చెప్పారు. తనపై విజిలెన్స్ విచారణ చేయడానికి తానేం తప్పు చేశానని కూటమి ప్రభుత్వాన్ని వైసీపీ నేత, మాజీ మంత్రి విడదల రజినీ ప్రశ్నించారు. 2019 ఎన్నికలకు కొద్ది రోజుల ముందు విడదల రజిని వైసీపీలో చేరారు. అనంతరం చిలకలూరిపేట నుంచి ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచి.. గెలిచారు. అనంతరం వైఎస్ జగన్ కేబినెట్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ఆమె బాధ్యతలు చేపట్టారు. అయితే 2019 సార్వత్రిక ఎన్నికల్లో నరసరావుపేట నుంచి వైసీపీ అభ్యర్థిగా లావు శ్రీకృష్ణదేవరాయలు గెలిచారు. చిలకలూరిపేట ఎమ్మెల్యే విడదల రజిని.. ఆయన లోక్‌సభ పరిధిలోకి వస్తుంది. కానీ ఎమ్మెల్యేగా, మంత్రిగా విడదల రజినీ ఏ రోజు.. లోక్ సభ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయులను పట్టించుకోలేదు. సరికదా.. పల్నాడు జిల్లాలో విడదల రజిని వర్గం ఒకటి హల్ చల్ చేసేదనే ఓ చర్చ సైతం గతంలో సాగింది. సదరు వర్గం.. జిల్లాలో ఎవరినైనా ఐ డొంట్ కేర్ అన్నట్లుగా వ్యవహరించేది. దీంతో ఈ వ్యవహారం కాస్తా పార్టీ అధినేత, నాటి సీఎం వైఎస్ జగన్‌తోపాటు సకల శాఖల మంత్రి సజ్జల రామకృష్ణా రెడ్డి చేరింది. వారు సైతం విడదల రజినికి మద్దతుగా మాట్లాడడంతో.. పలువురు నేతలు పార్టీ వీడేందుకు సిద్ధమయ్యారనే ఓ ప్రచారం సాగింది. అందులోభాగంగా లావు శ్రీకృష్ణదేవరాయులు గత ఎన్నికలకు ముందే వైసీపీ గుడ్ బై చెప్పి..టీడీపీలో చేరారు. తాజాగా మర్రి రాజశేఖర్ సైతం వైసీపీకి రాజీనామా చేశారు. ఆయన రాజీనామా చేసిన అనంతరం ఆయన పట్ల వైసీపీ అధినేత వైఎస్ జగన్ వ్యవహరించిన వైఖరిని మీడియా ఎదుట ఎండగట్టిన సంగతి అందరికి తెలిసిందే.

## ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ జన్మదిన వేడుకలు



**భీమదేవరపల్లి మార్చి 23 (నినాదం న్యూస్):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ అంబేద్కర్ కూడలి వద్ద ఆదివారం సాయంత్రం తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నార్లగిరి ప్రీతం జన్మదిన వేడుకలను యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గజ్జల రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ నాయకునిగా తన రాజకీయ జీవితం మొదలుపెట్టి నేడు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ గా ఎదిగిన ఆయన మరెన్నో పదవులు పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జక్కుల అనిల్ యాదవ్, ముల్కనూర్ మాజీ సర్పంచ్ మాడుగుల కొమురయ్య,హుస్నాబాద్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి బొల్లంపల్లి కాంతారావు, చిట్కురి అనిల్, రోడ్డ అజయ్, డాక్టర్ ఎదులపురం తిరుపతి, మాడుగుల చింటూ, మాడుగుల గోపి, మహిళ నాయకురాలు సుహాసిని, అంబాల రాజ్ కుమార్, నితిన్, కిరణ్, భరత్, రాజేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్వాస కోశ క్యాన్సర్లపై అంతర్జాతీయ సదస్సు






**హైదరాబాద్, మార్చి 23(నినాదం న్యూస్) :** యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్, హైటెక్ సిటీ ఆధ్వర్యంలో ఇబస్ (ఎండో బ్రాంకియల్ అల్ట్రాసౌండ్) లంగ్ క్యాన్సర్ల పై ఏర్పాటయిన అంతర్జాతీయ శిక్షణ సదస్సు, లైవ్ వర్క్ షాప్ నేడు హైటెక్ సిటీ యశోద హాస్పిటల్స్ లో ప్రారంభమైంది. యశోద హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డా. జి. ఎస్. రావు ముఖ్య అతిథిగా ఈ అంతర్జాతీయ సదస్సును ప్రారంభించారు. ఈ అత్యాధునిక లంగ్ క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ చికిత్స ప్రక్రియలకు సంబంధించి దేశంలోని ప్రధాన పల్మనాలజిస్ట్(శ్వాసకోశవ్యాధుల నిపుణుల)కు ఉన్నతస్థాయి శిక్షణ ఇచ్చేందుకుగాను 'ఇబస్ – మాస్టర్ క్లాస్' పేరిట యశోద హాస్పిటల్స్–హైటెక్ సిటీ లోని ఇంట్రవెన్షనల్ పల్మోనాలజీ విభాగం దీనిని ఏర్పాటుచేసింది. లంగ్ క్యాన్సర్ ను తొలిదశలోనే గుర్తించి, నిర్ధారించే అద్వితీయ చికిత్సగా అంతర్జాతీయంగా ఎంతో గుర్తింపు పొందుతున్న "ఇబస్" ఈ చికిత్సా ప్రక్రియ మనదేశంలోని అతికొద్ది అత్యాధునిక వైద్యకేంద్రాలలో మాత్రమే అందుబాటులోకి వచ్చింది. ఎండో బ్రాంకియల్ అల్ట్రాసౌండ్ (ఇబస్)కి సంబంధించి మనదేశంలో అగ్రగామిగా ఉన్న యశోద హాస్పిటల్స్ దేశవ్యాప్తంగా ఉన్న పల్మోనాలజిస్టులకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం దృష్ట్యా అంతర్జాతీయ ప్రముఖ పల్మనాలజిస్టులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ శిక్షణా కార్యక్రమంలో పల్మనాలజిస్టులు వినూత్న చికిత్సా ప్రక్రియ అయిన ఇబస్ గూర్చి సమగ్రంగా తెలుసుకోవటమే కాకుండా లంగ్ క్యాన్సర్ చికిత్సలో అధునాతన చికిత్సా విదానాలు అమలుచేయటంలో అనుభవం పొందుతారు, అని ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన యశోద గ్రూప్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, డాక్టర్. జి. ఎస్. రావు తెలిపారు. ఈ సందర్భంగా యశోద హాస్పిటల్స్–హైటెక్ సిటీ, సీనియర్ పల్మనాలజీ వైద్య నిపుణులు డాక్టర్. వి. నాగార్జున మాటూరు మాట్లాడుతూ, మన దేశంలో పురుషుల మరణాలకు కారణమవుతున్నకాన్సర్లలో ఊపిరితిత్తుల కాన్సర్ రెండో స్థానంలో ఉంది. దేశంలో ఏటా నమోదయ్యే కాన్సర్ కేసులలో 7 శాతం కేసులకు, కాన్సర్ మరణాలలో 10 శాతానికి కారణమవుతున్నది శ్వాసకోశాల కాన్సర్లే. జనాభాలోని ప్రతీ లక్షమందిలో సుమారు 30 మంది ఈ వ్యాధి బారి పడుతున్నట్లు అంచనా. శ్వాసకోశాలకు సంబంధించిన వ్యాధులు, ప్రత్యేకించి కాన్సర్లు – ప్రమాదకరమైన ఇన్ఫెక్షన్లను నిర్ధారించే పరీక్షలు కష్టతరంగా, వ్యాధిగ్రస్థులకు తీవ్ర అసౌకర్యంగా ఉంటూ వచ్చాయి. ఇటువంటి తీవ్రమైన, ప్రాణాంతకమైన వ్యాధులను వీలైనంత వేగంగా, గుర్తించేందుకు ఎండో బ్రాంఖియల్ అల్ట్రాసౌండ్ 'ఇబస్' తో పరిష్కారం లభిస్తుంది. "ఇబస్ విధానంలో రోగి శరీరంపైన ఎటువంటి గాటుపెట్టవలసిన అవసరం ఉండదు. దీనిలో డాక్టర్ బ్రాంఖోస్కోప్ ను నోటి గుండా పంపించటం ద్వారా లింఫ్ నోడ్స్ కూ సంబంధించిన నీడిల్ బయాప్సీ చేయగలుగుతారు. ఇబస్ కోసం అల్ట్రాసౌండ్ ప్రాసెసర్, ఫైన్ గేజ్ అస్పిరేషన్ నీడిల్తో కూడిన ప్రత్యేకమైన ఎండోస్కోపును పేషెంట్ శ్వాసనాళం ద్వారా పంపిస్తారు. అల్ట్రాసౌండ్ వల్ల శ్వాస మార్గాలు, రక్తనాళాలు, శ్వసకోశాలు, లింఫ్ నోడ్స్ యధాతథ చిత్రాలను చూస్తూ డాక్టర్లు పరిస్థితిని అంచనావేయగలుగుతారు. ఊపిరితిత్తులు, లింఫ్ నోడ్స్ కు సంబంధించిన సమస్యలను దీని ద్వారా ఖచ్చితంగా గుర్తించటం సాధ్యపడుతుందని" యశోద హాస్పిటల్స్ సీనియర్ పల్మనాలజిస్ట్ డాక్టర్. వి. నాగార్జున మాటూరు తెలియజేసారు. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా 500 మందికి పైగా పల్మోనాలజిస్టులు హాజరయ్యారు. దేశవ్యాప్తంగా ఉన్న ఐదు వందలమందికి పైగా అధ్యాపకులు, అంతర్జాతీయ నిపుణులు కూడా ఈ కార్యక్రమంలో కీలక ఉపన్యాసాలు ఇచ్చారు.

# ఆర్టీసీ డిపోలో నిర్లక్ష్యం పరాకాష్ట

- విద్యార్థుల జీవితాలతో చెలగాటం
- తృటిలో తప్పిన పరీక్షల గండం






**మణుగూరు మార్చి 23( నినాదం న్యూస్) :** టిఎస్ఆర్టిసి నియమ నిబంధనలకు పెట్టింది పేరుగా. సమయపాలన ప్రజాసేవ గా చెప్పుకునే ఆర్టీసీ సంస్థ లో నిర్లక్ష్యం పరాకాష్టికి చేరింది. సిబ్బంది నిర్లక్ష్యం పనితీరుతో ఎస్ఎస్సి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడి గురుకుల విద్యార్థులకు తృటిలో పరీక్షల గండం తప్పింది. ఈ సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు టిఎస్ఆర్టిసి డిపోలో చోటుచేసుకుంది. మణుగూరులో అతిపెద్ద గురుకుల పాఠశాల లో విద్యార్థులు సుమారు 600 మంది విద్యను అభ్యసిస్తూ ఉంటారు. ఇటీవల ఈ పాఠశాలలో ఎస్ ఎస్ సి విద్యార్థులు సుమారు 42 మంది పరీక్షల్లో పాల్గొనేందుకు ప్రతినిత్యం మణుగూరు లో ఉన్న జడ్పీఎస్ఎస్ స్కూలు, మరియు పీవీ కాలనీలో ఉన్న సింగరేణి స్కూల్లో విద్యార్థులు ఎస్ఎస్సి పరీక్షలు రాస్తూ ఉంటారు. ఇందు నిమిత్తం విద్యార్థులను పరీక్ష కేంద్రాలకు తరలించేందుకు గురుకుల పాఠశాల యాజమాన్యం మణుగూరు టిఎస్ఆర్టిసి డిపో అధికారులను సంప్రదించింది. ఎస్ఎస్సి పరీక్షలు అయిపోయేంతవరకు విద్యార్థులను తీసుకుపోయి తీసుకువచ్చేందుకు కాంట్రాక్టర్ పద్ధతిలో బస్సును అద్దెకు తీసుకున్నారు. ప్రతిరోజు ఆ బస్సు ఉదయం ఎనిమిదిన్నర గంటలకు డిపో నుండి గురుకుల పాఠశాలకి చేరుకుంటుంది. కానీ శనివారం రోజు ఆ బస్సు సిబ్బంది నిర్లక్ష్యం వలన బస్సు 9 గంటల 15 నిమిషాలకు గురుకుల పాఠశాలకు చేరుకుంది. 8:30 గంటలకు రావలసిన బస్సు 9:15 నిమిషాలకి బస్సు వస్తుందని ఊహించని గురుకుల పాఠశాల సిబ్బంది ప్రధానోపాధ్యాయురాలు రాణి ఆందోళనకి గురయ్యారు. ఎస్ఎస్సి పరీక్షల టైం 9:30 గంటలకు పరీక్షలకు ప్రారంభం అవుతూ ఉంటాయి. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు అర్ధగంట ముందే చేరుకోవాల్సిన నిబంధన లు ఉన్నాయి. ఆర్టీసీ నిర్లక్ష్యం సిబ్బంది తప్పిదం వలన బస్సు రాకను ప్రయత్నాన్ని ఉపసంహరించుకొని, గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాణి ఆటో రిక్షాలను మాట్లాడుకుని విద్యార్థులను హుటాహుటిన పరీక్ష కేంద్రాలకు తరలించింది. అప్పటికే సమయం తొమ్మిది గంటలు 25 నిమిషాలు అయినట్లు ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు. మరో ఐదు నిమిషాలు ఆలస్యం జరిగి ఉంటే 42 మంది విద్యార్థులు ఎస్ఎస్సి పరీక్షలకు హాజరు కాకుండా ఉండేవారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. సమయపాలనకు పంచివాలిటీకి పెట్టింది పేరుగా ఆర్టీసీ అందిస్తున్న సేవలు గుర్తించి ఆర్టీసీ బస్సును కాంట్రాక్టు గా తీసుకోవడం జరిగినట్లు ప్రధాన ఉపాధ్యాయురాలు పేర్కొన్నారు. ఆర్టీసీ సిబ్బంది ఇంత పెద్ద ఎత్తులో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన విద్యార్థులకు పరీక్ష గండం తప్పిందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని ప్రధానుపాధ్యాయురాలు స్థానిక డిపో మేనేజర్ ని సంప్రదింపులు జరుపగా, జరిగిన విషయానికి చింతిస్తూ ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకుంటున్నట్లు డిపో మేనేజరు అన్నట్లు ఆమె పేర్కొన్నారు. మీకు ఆటోలకైనా చార్జీ డబ్బులు మా సిబ్బంది ద్వారా ఇప్పిస్తామని డిపో మేనేజర్ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ సిబ్బంది అధికారులు నిర్లక్ష్యం వలన మా పాఠశాలలో 42 మంది విద్యార్థులు భవిష్యత్తు ఎస్ఎస్సి పరీక్షల్లో అంధకారం అయ్యే పరిస్థితిలో ఆసన్నమైనట్లు ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ సిబ్బంది వల్ల జరిగిన నిర్లక్ష్యం విద్యార్థులు పరీక్షా కేంద్రాల్లోకి వెళ్లకుండా ఉంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉండేదని దీనికి ఎవరు బాధ్యత వహించాలని ఆమె ఆర్టీసీ అధికారులను ప్రశ్నిస్తుంది. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులను తరలించేటప్పుడు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టకపోవడం వలన ఇటువంటి పరిస్థితులు దాపరించినట్లు ఆమె తీవ్రంగా విమర్శించారు. ఇటువంటి సంఘటనలతో ఆర్టీసీ ఇమేజ్ కూడా దెబ్బతినే ప్రమాదం ఉన్నట్లు పాఠశాల సిబ్బంది విమర్శిస్తున్నారు. మణుగూరు డిపో మేనేజర్ వివరణ కోరగా పాఠశాలలో విద్యార్థులను తరలించేందుకు బస్సును కాంట్రాక్టు తీసుకున్న విషయం వాస్తవమేనని ఆయన అంగీకరించారు. శనివారం రోజు వారికి ఇచ్చిన టైం కంటే 15 నిమిషాలే ఆలస్యం అయినట్లు ఆయన పేర్కొన్నారు. ఆలస్యానికి కారణమైన బస్సు డ్రైవరు డిపో సూపర్వైజర్ అసిస్టెంట్ మేనేజర్ పై చార్జిషీట్ దాఖలు చేసి వివరణ కోరినట్టు ఆయన పేర్కొన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నట్లు మణుగూరు డిపో మేనేజర్ శ్యామసుందర్ పేర్కొన్నారు.

## సన్న బియ్యం పంపిణీతో
# రేషన్ దందాకు చెక్

- మట్టపల్లి లక్ష్మీ నరసింహ స్వామి సాక్షిగా.. ఉగాది నుండి పంపిణీ



**కోదాడ, నినాదం:** కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సంవత్సరకాలం అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది.ఉగాది పండుగ రోజున సూర్యాపేట జిల్లాలోని మట్టపల్లి ఆలయంలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ సన్న బియ్యం పథకం ప్రారంభం కానుంది.ఈ పథకం ద్వారా ప్రతి నేల దాదాపు 2 కోట్ల మందికి పైగా లబ్దిదారులు.. ఒక్కొక్కరికి 6 కేజీల సన్నబియ్యం అందుకోనున్నారు. ఈ నెల 30 ఉగాది రోజు సీఎం ప్రారంభించగా.. ఏప్రిల్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని రేషన్ షాపుల్లో.. రేషన్ కార్డు ఉన్న లబ్దిదారులకు ఈ సన్నబియ్యం ఇవ్వనున్నారు. దీంతో పేద ప్రజల ఆకలి బాధలు తీర్చనున్నారు.

నిత్యవసర ధరలు పెరగటంతో సామాన్యులకు బతుకు గడవటం కష్టమవుతుంది...రెండేళ్ల కిందట మార్కెట్ లో కనీసం రూ.40 పైన,సన్న బియ్యం కనీసం రూ.60 చేరింది. పేద, మధ్యతరగతి ప్రజలు కొనలేని పరిస్థితి నెలకొంది. చాలా మంది చౌకధరల దుకాణం పంపిణీ చేసే దొడ్డు రకాలను వ్యాపారులకు విక్రయించి అధిక ధరలు వెచ్చించి బహిరంగ మార్కెట్ లో సన్న రకాలను కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం నిర్ణయం వారికి మేలు చేసేలా ఉంది.

**ఒక్కొక్కరికి 6 కిలోలు....**
సూర్యాపేట జిల్లాలో మొత్తం 609 రేషన్ దుకాణాలు ఉన్నాయి. 3,15,180 రేషన్‌కార్డులు ఉన్నాయి. అందులో 2,96,359 ఆహారభద్రత కార్డులు కాగా, 18,773 అంత్యోదయ కార్డులు, 48 అన్నపూర్ణ కార్డులు ఉన్నాయి. వీరికి ప్రభుత్వం నెలకు 59,527.79 క్వింటాళ్ల బియ్యాన్ని పంపిణీ చేస్తోంది. ప్రభుత్వం కొత్త కార్డులు మంజూరుచేస్తే లబ్ధిదారుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేసేందుకు సిద్ధమైన తరుణంలో కొత్త రేషన్ కార్డులు వస్తే బాగుంటుందని జిల్లా వ్యాప్తంగా చాలామంది ఆశగా ఎదురుచూస్తున్నారు.ప్రభుత్వం ఇప్పటికే అంగన్వాడీ కేంద్రాలకు పాఠశాలలకు వసతి గృహాలకు సన్న బియ్యం ను అందిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్కో లబ్ధిదారుడు కి కేంద్రం 5 కిలోలు రాష్ట్ర సర్కార్ కిలో కలిపి ఉచితంగా అందించారు. దొడ్డు రకం వాటిని మధ్య తరగతి ప్రజలు తినటానికి ఇష్టపడటం లేదు. నిరుపేదలు మాత్రమే వినియోగిస్తున్నారు. తినని వారు రేషన్ దందా చేసే వ్యాపారులకు కిలో కు రూ.10 చొప్పున విక్రయిస్తున్నారు. దందా చేసే వ్యాపారులు ఇతర రాష్ట్రాలకు లిక్కర్ తయారీ కి, కోళ్ల దాణా కు విక్రయిస్తూ.. సొమ్ము చేసుకుంటున్నారు.

**నాణ్యత లేకుంటే... ప్రయోజనం సున్నా...**
వసతి గృహాలలో భోజనం నాణ్యత లేదంటూ విమర్శలు వస్తున్నాయి. వాటిలో కలపాల్సిన పోషక విలువలు సరైన మోతాదులో కలపటంలేదని తెలిసింది. ఇది పక్కాగా జరగాలి. గత ప్రభుత్వం హాయంలో పంపిణీ చేసిన సన్న బియ్యం అనుభవాలు చూస్తే నాణ్యత పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరముంది. కొన్ని చోట్ల నూకలు, తౌడు రావ టంతో వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. కొన్ని సార్లు నాణ్యత లేకపోవటంతో లబ్దిదారులు తినటానికి ఆసక్తి చూపటం లేదు. నాణ్యతగా పంపిణీ చేసిన ప్రాంతాలలో అధికమంది వాడుకుంటున్నారు.

**రేషన్ దందా కు చెక్....**
రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయడంతో బ్లాక్ మార్కెట్కు వెళ్తున్న రేషన్ బియ్యానికి చెక్ పడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. దొడ్డు రకం బియ్యం పంపిణీ చేయడంతో ఆ బియ్యాన్ని తినలేక పది రూపాయలకు కిలో చొప్పున బయటికి అమ్ముకోవడం అధికారులు వాటిని నిఘా పెట్టి సిజ్ చేయడం కేసులు బుక్ చేయడం సర్వసాధారణంగా జరుగుతుంది. సన్న బియ్యం పంపిణీ ద్వారా ప్రతి ఒక్కరు ఇంట్లో తినడానికి ఇష్టపడతారని లబ్దిదారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం మార్కెట్లో నాణ్యమైన బియ్యం రూ.60 నుంచి 70 రూపాయల వరకు ధర పలుకుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో సైతం పండించిన కొత్తవి సన్నబియ్యం క్వింటాల్ రూ.5వేల నుండి రూ6వేల వరకు ధర పలుకుతుంది. ఉచితంగా రేషన్ కార్డు ద్వారా బియ్యం పంపిణీ చేస్తే మధ్యతరగతి కుటుంబాలకు డబ్బును ఆదా చేసినవారవుతారని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**
SHRIRAM Finance
రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్‌ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్: 6వ అంతస్తు (లెవెల్-2), బిల్డింగ్ నెం. Q2, ఆరమ్ Q పార్క్, జెన్ 4/1, టిటిసి, థానె, బేలాపూర్ రోడ్, ఘన్‌సోలి, నవీ ముంబయి-400710.

**లాంఛనప్రాయ స్వాధీనతా నోటీసు**

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (సదరు చట్టము) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 (సదరు రూల్స్)లోని రూల్ 3తో చదవబడు సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ వారితో విలీనమై, తదుపరిగా శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ లిమిటెడ్ పేరు ఇన్‌కార్పొరేషన్ సర్టిఫికెట్ తేది: 13.11.2022 ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా మార్చబడినది), భారత కంపెనీల చట్టము 1956 ప్రకారం ఒక కంపెనీగా రిజిస్టర్డ్ చేయబడి, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న సదరు సంస్థ యొక్క నమోదిత కార్యాలయము: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032 మరియు పరిపాలన కార్యాలయం: 6వ అంతస్తు (లెవెల్ 2), బిల్డింగ్ నెం. క్యూ2, ఆరమ్ క్యూ పార్క్, జెన్ 4/1, టిటిసి, థానె-బేలాపూర్ రోడ్, ఘన్‌సోలి, నవీ, ముంబయి-400710 వారి దిగువ సంతకము చేసిన అధీకృత అధికారి జారీ చేసిన డిమాండ్ నోటీసులలోని దిగువ పట్టికలో తెలిపిన రుణ మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా రుణగ్రహీతలను కోరియున్నారు. కానీ సదరు రుణగ్రహీతలు రుణ మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదువబడు సదరు చట్టములోని సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారములను వినియోగించుకొనుచూ దిగువ సంతకముదారు దిగువ వివరించబడిన ఆస్తిని **22 మార్చి, 2025న లాంఛనముగా స్వాధీనము** చేసుకోవడమైనదని రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

| రుణగ్రహీత పేరు మరియు చిరునామా | డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం |
|---|---|
| **1) వరుణ్ చౌదరి గోగినేని, తండ్రి: కృపాచంద్ గోగినేని,** వయస్సు: 27 సంవత్సరాలు, వృత్తి: స్వయం ఉద్యోగి, నివాసం: ఫ్లాట్ నెం: 297, రోడ్ నెం: 18, ఆలివ్ మౌంట్ స్కూల్ దగ్గర, నలంద నగర్, అత్తాపూర్ (గ్రా॥), రాజేంద్ర నగర్, (మం॥), ఎజి కాలనీ, హైదర్‌గూడ, కెవి రంగారెడ్డి-500048, బి/ఓ. చిరునామా-1, "వరుణ్ ఎంటర్‌టైన్‌మెంట్స్" యొక్క భాగస్వామి, నెం. పైన తెలిపిన నివాస చిరునామా వద్ద, బి/ఓ. చిరునామా-2: "ఎవర్‌గ్రీన్ క్రియేషన్స్" యొక్క భాగస్వామి, నెం. 45004, జనప్రియ ఉటోపియా, హైదర్‌గూడ, రాజేంద్ర నగర్, హైదరాబాద్-500048, 9515881909. **2) ఆశా జ్యోతి గోగినేని, భర్త: గోగినేని కృపాచంద్,** వయస్సు: 46 సంవత్సరాలు. వృత్తి: స్వయం ఉద్యోగి, నివాసం: ఫ్లాట్ నెం. 297, రోడ్ నెం: 18, ఆలివ్ మౌంట్ స్కూల్ దగ్గర, నలంద నగర్, అత్తాపూర్, హైదర్‌గూడ, కెవి రంగారెడ్డి-500048, బి/ఓ. "ఎవర్‌గ్రీన్ క్రియేషన్స్" యొక్క భాగస్వామి, నెం. 45004, జనప్రియ ఉటోపియా, హైదర్‌గూడ, రాజేంద్ర నగర్, హైదరాబాద్-500048, 9440877089. **3) గోగినేని కృపాచంద్, తండ్రి: ఎం పి గోగినేని @ అలియాస్ గోగినేని మధుసూధన ప్రసాద్,** వయస్సు: 54 సంవత్సరాలు, వృత్తి: స్వయం ఉద్యోగి, నివాసం: ఫ్లాట్ నెం: 297, రోడ్ నెం: 18, ఆలివ్ మౌంట్ స్కూల్ దగ్గర, నలంద నగర్, అత్తాపూర్, ఎజి కాలనీ, కెవి రంగారెడ్డి-500048, బి/ఓ: "వరుణ్ ఎంటర్‌టైన్‌మెంట్స్" యొక్క భాగస్వామి, పైన తెలిపిన నివాస చిరునామా వద్ద, 9440058050. **4) ఈశ్వర్ రావ్ నలమోతు, తండ్రి: రామనాథం నలమోతు @ అలియాస్ నలమోతు రామనాథం @ అలియాస్ నలమోతు రామానందం,** వయస్సు: 62 సంవత్సరాలు, వృత్తి: స్వయం ఉద్యోగి, నివాసం: ఇం.నెం. 3-6-200, ఫ్లాట్ నెం. 303, అరుణోదయ అపార్ట్‌మెంట్స్, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029, బి/ఓ. "అడ్వకేట్", సెల్ నెం: 9440683874. **5) జ్ఞాన జ్యోతి ఈశ్వర్ నలమోతు, భర్త: ఈశ్వరరావ్ నలమోతు:** వయస్సు: 56 సంవత్సరాలు, వృత్తి: గృహిణి, నివాసం: ఇం.నెం. 3-6-200, ఫ్లాట్ నెం. 303, అరుణోదయ అపార్ట్‌మెంట్స్, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029, 9640992079. ........రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీత/హామీదారులు/చట్టబద్ధవారసులు | **రూ. 24,86,132/-** (రూపాయలు ఇరవై నాలుగు లక్షల ఎనభై ఆరు వేల నూట ముప్పై రెండు మాత్రమే) |

**స్థిరాస్తి యొక్క వివరణ: HMYTHTF2211300002 -** స్థిరాస్తి యొక్క వివరణ: ఆస్తి యజమాని పేరు: **శ్రీమతి జ్ఞాన జ్యోతి ఈశ్వర్ నలమోతు,** తనఖాపెట్టబడిన దస్తావేజు తేది: 01.12.2022, తనఖాపెట్టిన రిజిస్టర్ డాక్యుమెంట్ నెం. 3635/2022, **హైదరాబాద్ (ఆర్.ఓ.)** సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయములో రిజిస్టర్ చేయబడింది. **ఐటం నెం. 1:** హైదరాబాద్, హిమాయత్‌నగర్ వద్ద 231.0 చ॥గ॥ల విస్తీర్ణములోని మున్సిపల్ నెం. 3-6-521/1 యావదాస్తి. **సరిహద్దులు: తూర్పు వైపు:** కామన్ ప్యాసేజ్, **పడమర వైపు:** పొరుగువారి ఆస్తి ఇం.నెం. 3-6-538 & 534, **ఉత్తరం వైపు:** శ్రీ సత్య అపార్ట్‌మెంట్స్‌లోని నెం. 3-6-521/2, **దక్షిణం వైపు:** నెం. 3-6-521/ఎ నవనీత్ గ్రామము. **ఐటం నెం. 2:** హైదరాబాద్, హిమాయత్‌నగర్ వద్ద జి.హెచ్.ఎం.సి. నెం. 3-6-521/1 ప్రాంగణంలో ఉన్న "ఘరోండా సూర్యోదయ అపార్ట్‌మెంట్స్"లో 231.0 చ॥గ॥ల నుండి 32.67 చ॥గ॥లు అనగా 14.14% అవిభాజ్యవాటా కలిగిన 2వ అంతస్తులో 747.0 చ॥అ॥ల ప్లింత్ ఏరియా విస్తీర్ణము గల ఫ్లాట్ నెం. 201, జి.హెచ్.ఎం.సి. నెం. 3-6-521/1/201, పిటిఐఎన్ నెం. 1090316954 యావదాస్తి. **సరిహద్దులు: తూర్పు వైపు:** ఖాళీ ప్రదేశం, **పడమర వైపు:** ఖాళీ ప్రదేశం, **ఉత్తరం వైపు:** స్టెయిర్‌కేస్/ఫ్లాట్ నెం. 202, **దక్షిణం వైపు:** పొరుగువారి ఆస్తి.

ఈ నోటీసు ద్వారా సాధారణ ప్రజానీకాన్ని హెచ్చరించడమేమనగా ఎస్ఎఫ్ఎల్ వారి అధీకృత అధికారి పైన తెలిపిన స్థిరాస్తిని చట్టపరముగా లాంఛనముగా స్వాధీనం చేసుకున్నారు మరియు ఈ నోటీసు స్వీకరణ తరువాత ఎస్ఎఫ్ఎల్ వారి వ్రాతపూర్వక ముందస్తు అనుమతి లేకుండా ఈ నోటీసులో రెఫర్ చేయబడిన పైన తెలిపిన సెక్యూర్డ్ ఆస్తులను అమ్మకము ద్వారా బదిలీ చేయుట, లీజు ఇచ్చుట మరియు ఇతరత్రా లావాదేవీలు నిర్వహించుట/అన్యాక్రాంతం చేయుట నుండి రుణగ్రహీతలు లేదా ఎవరైన వ్యక్తులు నిషేధించబడినారు.

ప్రదేశం: హిమాయత్‌నగర్ — సం/- అధీకృత అధికారి
తేది: 24.03.2025 — శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

**PUBLIC NOTICE**

NOTICE are hereby given that the below mentioned Authorised Person are no longer affiliated as Authorised Person of Kotak Securities Limited.

| Authorised Person Name | Trade Name | Exchange Registration Numbers of Authorised Person | Address of Authorised Person |
|---|---|---|---|
| SANA SIVA KUMAR | SANA SIVA KUMAR | NSE - AP0291115891<br>BSE - AP01067301125000<br>MCX - 147162 | 24 150, Kummari Street, Narasannapeta, Srikakulam-532421 |
| GURUTHEJA MEKALA | GURUTHEJA MEKALA | NSE - AP0291565081<br>BSE - AP01067301160578 | 12 1 319 Anand Nagar, Bandlaguda Rangareddi, Hyderabad Andhra Pradesh, Hyderabad-500068 |
| SOURABH LUNIYA | SOURABH LUNIYA | NSE - AP0291563591<br>BSE - AP01067301157639 | 2 4 515 Patny, Building Ramgopal, Secunderabad, Hyderabad-500003 |
| RAVI KUMAR PARUPALLY | RAVI KUMAR PARUPALLY | NSE - AP0291092801 | 5-5-43/509 Prashanth Nagar Colony, Opposite To Ss Heavens Apartment Vanastalipuram, K V Rangareddy Ranga Reddy-500070 |
| J VENUGOPAL RAO | J VENUGOPAL RAO | NSE - AP0291114461<br>BSE - AP01067301122259<br>MCX - 145144<br>NCDEX - 124388 | 12 521 2 GM Plaza, 1st Floor CB Road, Tadipatri Anantapur, Tadipatri-515411 |
| NIRMALA DEVI AGARWAL | NIRMALA DEVI AGARWAL | NSE - AP0865004281<br>BSE - AP0106730132546<br>MCX - 56292 | No: 3-2-370 Beside Ramakrishna Hospital, Lane Nimboliadda Kachiguda, Station Road Hyderabad, Hyderabad-500027 |
| SHEETAL ANAND SHAH | SHEETAL ANAND SHAH | NSE - AP0865004601<br>BSE - AP0106730136597 | No; 4-3-275, Kothi Bank Street, Sulthan Bazar, Hyderabad, Hyderabad-500095 |
| JONNALA ANUSHA | JONNALA ANUSHA | NSE - AP0291562781 | Flat No 203 2nd Floor, Sri Sai Laxmi Residency Nagar, Buddha Nagar Boduppal, Hyderabad-500098 |
| VASAVI KOTHA | VASAVI KOTHA | NSE - AP0291561791<br>BSE - AP01067301158333<br>MCX - 161862 | Plot No 105 Akshara Sai Nilayam, Ground Flr Sri Sai Nagar, Kphb Colony Near Sai Baba Temple Behind JNTU, Hyderabad-500085 |
| NALLA RAJESH | NALLA RAJESH | NSE - AP086502881<br>BSE - AP01067301118356 | No: 4-2-332 Sri Sangameshwara Complex, Opp: Bus Deport Bodhan Nizamabad, Nizamabad-503185 |

Please note that above mention Authorised Person (AP) are no longer associated with us. Any person henceforth dealing with above mention AP should do so, at their own risk. Kotak Securities Ltd. shall not be liable for any such dealing. In case of any queries for the transactions till date, Investors are requested to inform Kotak Securities Ltd. within 15 days from the date of this notification, failing which it shall be deemed that there exists no queries against the above mentioned AP.

kotak Kotak Securities Kotak Securities Limited. Registered Office: 27 BKC, C 27, G Block, Bandra Kurla Complex, Bandra (E), Mumbai 400051. CIN: U99999MH1994PLC134051, Telephone No.: +22 43360000, Fax No.: +22 67132430. Website: www.kotak.com / www.kotaksecurities.com. Correspondence Address: Infinity IT Park, Bldg. No 21, Opp. Film City Road, A K Vaidya Marg, Malad (East), Mumbai 400097. Telephone No: 42856825. SEBI Registration No: INZ000200137(Member of NSE, BSE, MSE, MCX & NCDEX) , AMFI ARN 0164, PMS INP000000258 and Research Analyst INH000000586. NSDL/CDSL: : IN-DP-629-2021. Compliance Officer Details: Mr. Hiren Thakkar Call: 022 - 4285 8484, or Email: ks.compliance@kotak.com

## అన్నా క్యాంటీన్‌కి భారీ విరాళం..
### - సీఎం చంద్రబాబు స్పెషల్ ట్వీట్



**అనంతపురం, మార్చి 23(నినాదం న్యూస్) :** ప్రముఖ పారిశ్రామిక వేత్త నార్నే రంగారావు సతీమణి డాక్టర్ నార్నే శాంతారావు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా ఆమె.. అన్నా క్యాంటీన్ కు భారీ విరాళం అందజేశారు. దీనికి సంబంధించిన చెక్కును సీఎం చంద్రబాబుకు అందించారు. అన్నా క్యాంటీన్ కు విరాళం ఇవ్వడంలో చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి తనకు స్ఫూర్తి అని నార్నే శాంతారావు అన్నారు. దీనిపై చంద్రబాబు నాయుడు ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ.. పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన.. ప్రముఖ పారిశ్రామిక వేత్త, ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ ఫౌండర్, చైర్మన్ నార్నే రంగారావు జ్ఞాపకార్థం.. ఆయన సతీమణి డాక్టర్ శాంతారావు నార్నే 'అన్న క్యాంటీన్'కు రూ.1,00,01,016 విరాళంగా అందజేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక 'అన్న క్యాంటీన్' తిరిగి ప్రారంభించిన సమయంలో నారా భువనేశ్వరి రూ. 1 కోటి విరాళంగా ఇచ్చి తనకు స్ఫూర్తి నింపారని డాక్టర్ శాంతారావు అన్నారని తెలిపారు. అనారోగ్యం కారణంగా చనిపోవడానికి ఒకరోజు ముందు రూ. 1 కోటి విరాళం అందించే విషయాన్ని నార్నే రంగారావు.. డాక్టర్ శాంతారావు గారికి గుర్తుచేశారని చెప్పారు.దీంతో ఆయన మరణానంతరం తన కుమార్తె, నార్నె ఎస్టేట్స్ డైరెక్టర్ (%ఛీుతీఅవ జుర్ఘ్‌వం ఱఅఱతీవషశీతీ%) అడుసుమిల్లి దీప (%ూఎబంబఎఅశ్రీఱ ఱవవజుఖ%), వైట్ ఫీల్డ్ బయో ఎండీ అడుసుమిల్లి నరేష్ కుమార్‌తో కలిసి వచ్చి శాంతారావు ఈ విరాళాన్ని సీఈవో నార్నె గోకుల్ తోడ్పాటుతో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశారని వెల్లడించారు. పేదలకు రూ. 5 లకే అన్నం పెట్టాలనే ఆలోచనకు.. ఇలాంటి వారి మంచి మనసు ఎంతో దోహదం చేస్తుందని చంద్రబాబు అన్నారు. ఎంతో నిజాయితీగా, ఆదర్శంగా జీవితాన్ని గడిపిన నార్నే రంగారావు కాలం చేయడానికి ఒక రోజు ముందు కూడా అన్న క్యాంటీన్ విరాళం గురించి భార్యకు గుర్తు చేయడం వారి గొప్ప మనసుకు నిదర్శనమని కొనియాడారు. రియల్ ఎస్టేట్ రంగంలో ఆయన చేసిన సేవలు స్మరించుకుంటూ.. అన్న క్యాంటీన్ కు విరాళం ఇచ్చిన వారి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు, అభినందనలు తెలుపుతున్నానని టీడీపీ

# ప్రమాదకరమైన అంటువ్యాధి క్షయ !

"మైకోబ్యాక్టీరియమ్ ట్యుబర్క్యులోసిస్" బ్యాక్టీరియా గాలి ద్వారా ఊపిరితిత్తులకు సోకడంతో కలిగే ప్రమాదకర అంటువ్యాధిని "క్షయ" లేదా "ట్యుబర్క్యులోసిస్ (టిబీ)" వ్యాధిగా పిలుస్తున్నాం. క్షయ రోగులు దగ్గడం, తుమ్మడం, చీమిడి తీయడం, ఉమ్మి వేయడం లాంటి కారణాలతో ఈ వ్యాధి ఇతరులకు వ్యాపిస్తుంది. ప్రపంచ మానవాళి ఎదుర్కొంటున్న వ్యాధుల్లో అత్యంత ప్రమాదకరమైనదిగా గుర్తింపు పొందిన క్షయ వ్యాధిని నయం చేయడానికి, నివారించడానికి వీలు ఉన్నప్పటికీ అవగాహన లోపంతో ప్రపంచవ్యాప్తంగా అనేక నిండు ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. ఇలాంటి తీవ్ర పరిణామాలకు కారణమవుతున్న క్షయ పట్ల పూర్తి అవగాహన కల్పించటానికి 1982 నుంచి ప్రతి ఏట 24 మార్చిన "ప్రపంచ క్షయ దినం" నిర్వహించడం ఆనవాయితీగా మారింది. 2025 ప్రపంచ టిబీ దినం ఇతివృత్తంగా "అవును ! టిబీని అంతం చేయవచ్చు : అంకితభావం, పెట్టుబడులు, కార్యాచరణ" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతోంది. టిబీ నివారణకు ఔషధ-నిరోధకత కూడా అడ్డుపడుతున్నది.

**ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల టిబీ రోగులు:**

అంతర్జాతీయ స్థాయిలో టిబీ నివారణకు నిధుల కొరత వల్ల 2030 వరకు ఈ అంటువ్యాధి అంతానికి విఘాతం ఏర్పడుతున్నది. క్షయ రోగంతో ప్రాణ నష్టం, ఆర్థిక ఇబ్బందులు, సామాజిక ప్రతికూల పరిణామాలు జనిస్తున్నాయి. ప్రపంచ జనాభాలో 170 కోట్ల మంది టిబీ బారిన పడ్డట్లు గణాంకాలు హెచ్చరిస్తున్నాయి. భారత్‌లో 2.6 మిలియన్ల టిబీ రోగులు ఉండగా, ప్రతి లక్ష జనాభాలో 188 మంది చనిపోవడం కూడా జరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా 25 శాతం మంది టిబీ బారిన పడినట్లు కూడా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. నేటికీ అత్యధిక ప్రాణాలు తీస్తున్న టిబీ వ్యాధికి చికిత్స, నివారణ మార్గాలు ఉన్నాయని గమనించాలి.

**టిబీ వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలు:**

క్షయ వ్యాధిగ్రస్తుల్లో దగ్గు, ఛాతి నొప్పి, బరువు తగ్గడం, అలసట, జ్వరం, రాత్రి చెమట పట్టడం, అతి వణుకు లాంటి లక్షణాలు కనిపిస్తాయి. క్షయ నివారణ మార్గాల్లో వ్యాధి సోకిన వ్యక్తులు దగ్గినపుడు నోటిని కండువా కప్పుకోవడం, చేతులను తరుచుగా శుభ్రం చేసుకోవడం, ఆరోగ్యకర జీవనశైలి పాటించడం, సరైన వైద్య చికిత్స పొందడం, పోషకాహారం తీసుకోవడం, సరిగ్గా నిద్ర పోవడం లాంటి జాగ్రత్తలు తీసుకోవాలి. ఇలాంటి ప్రమాదకర వ్యాధికి సరైన చికిత్స ఉందని, నివారణ మార్గాలు పాటించాలని తెలుసు కోవాలి. అనాదిగా మానవాళిని పట్టి పీడుస్తున్న టిబీ వ్యాధిని అశ్రద్ధ చేస్తే ప్రాణాలు పోతాయని గమనిస్తూ, రేగులకు సరైన చికిత్సతో పాటు ఇతరులకు సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడం, అవగాహన గొడుగుతో క్షయకు చరమగీతం పాడడం సత్వరమే జరగాలి. ఈ చర్యలను తీసుకున్నపుడు తప్పకుండా క్షయ నివారణ సుసాధ్యం అవుతుందని, వ్యాధి కట్టడికి తగు నిధులు కేటాయించాలని, నివారణ చర్యలను నిర్థిష్టంగా తీసుకోవాలని, ఈ యజ్ఞంలో మనందరం మానవహారంగా పట్టడానికి సిద్ధంగా ఉందాం. క్షయ కానరాని ప్రపంచాన్ని నిర్మించుకుందాం.

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# కాలం నుదిటిపై మెరిసే సింధూరం

**- రాంపల్లి రమేష్**



**డోర్నకల్/మరిపెడ మార్చి 23(నినాదం న్యూస్) :** "మనకు సోషలిస్టు విప్లవం కావాలి. దానికి ముందు రాజకీయ విప్లవం రావాలి. రాజకీయ విప్లవమంటే ప్రభుత్వం బ్రిటీష్ పాలకుల నుండి భారతీయుల చేతుల్లోకి మారడం మాత్రమే కాదు. విశాల ప్రజా మద్దతుతో విప్లవ పార్టీ చేతుల్లోకి అధికారం రావాలి. ఆ తర్వాత సోషలిస్టు ప్రాతిపదికపై మొత్తం సమాజ పునర్నిర్మాణానికి పూనుకోవాలి" స్వాతంత్ర్యానంతర భారతదేశ నిర్మాణంపట్ల భగత్‌సింగ్ భావనలివి. తనను ఉరితీయడానికి కొద్దిరోజుల ముందు%ా% 1931 ఫిబ్రవరి 2న జైలు నుండి వెల్లడించిన ఓ వ్యాసంలోని ఈ వ్యాఖ్యలు ఆయన లోతైన ఆలోచనలకు ప్రతీకలు. భగత్‌సింగ్‌ను కేవలం ఓ స్వాతంత్ర్య సమరయోధుడిగా, బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన సాహసిగా మాత్రమే చూస్తే అది అసమగ్రమేనని ఈ వ్యాఖ్యలు తెలియజేస్తున్నాయి. చరిత్రలో ఏ వ్యక్తినైనా పరిశీలించేందుకు, అందునా భగత్‌సింగ్ లాంటి ఆలోచనాపరుడిని, విప్లవకారుడిని అంచనా వేయడానికి లోతైన పరిశీలన అవసరం. మౌలికంగా ఆ వ్యక్తి ఆలోచనా విధానం, దాని వికాసం తెలుసుకోకుండా పరిశీలిస్తే వాస్తవాలకు దూరంగా ఉండిపోతాం. పాక్షిక సత్యాలకే పరిమితమవుతాం. భగత్‌సింగ్ విషయంలో అదే జరిగింది. అందుకు కారణం వలసపాలకులు సరిగ్గా నమోదు చేయని అధికారిక రికార్డులు కావొచ్చు, ఆయన ఆలోచనల విస్తృతిని నివారించాలన్న స్వాతంత్ర్యానంతర పాలకవర్గాల ఉద్దేశాలు కావొచ్చు, మితవాద శక్తుల కుతంత్రాలు కావొచ్చు. ఇలా కారణాలేమైనప్పటికీ మనం భగత్‌సింగ్‌ను పూర్తిగా తెలుసుకోవడంలో వెనుకబడి పోయాం. ఫలితంగా ఆయన కేవలం గొప్ప దేశభక్తుడిగా, పోరాట యోధుడిగా, త్యాగధనుడిగానే మనలో చాలామందికి గుర్తుండిపోయాడు. బ్రిటీష్ పాలన నుంచి విముక్తి సాధించడమే ఆయన ఏకైక రాజకీయ లక్ష్యంగా ప్రచారంలో ఉండిపోయింది. కానీ అంతకు మించిన ఆయన సైద్ధాంతిక పునాది గురించి, ప్రాపంచిక దృక్పథం గురించి ఎంతమందికి తెలుసు? అది తెలుసుకోవడం ఇప్పుడు దేశానికి చాలా అవసరం. నేడు దేశంలో నిజం నిందలు మోస్తున్నది. అబద్ధం అందలమెక్కి ఊరేగుతున్నది. మనుషులు మనుషులుగా కొనసాగే పరిస్థితులు సన్నగిల్లిపోతున్నాయి. మోసం ద్వేషం ప్రజల మెదళ్లలోకి చొప్పించబడుతున్నది. అనేకానేక ఆధిపత్యాల నుంచి, అజ్ఞానపూరిత మూఢనమ్మకాల నుంచి దేశాన్ని కాపాడవలసిన పాలకులు, శాస్త్రీయతను పెంపొందించాల్సిన ప్రభుత్వాలే పౌరులను తిరోగమనంలో ముంచెత్తుతున్న వర్తమానమిది. ప్రశ్నిస్తే పౌరస్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని నిర్బంధంలోకి నెట్టేస్తున్న కాలమిది. మతాన్ని రాజ్యంతో విడదీయలేనంతగా కలిపేసి, మత ప్రాతిపదికన రాజకీయ సమీకరణలకు పాల్పడుతున్న రోజులివి. విశ్వాసం విద్వేషంగా మారి మన రాజ్యాంగ స్ఫూర్తికే సవాలు విసురుతోంది. మన ప్రజాస్వామ్యం మునుపెన్నడూ లేనంతగా ప్రమాదంలో పడింది. సమాజంలో సామరస్యం బీటలువారుతున్నది. ప్రజాజీవితంలో భయం రాజ్యమేలుతున్నది. ఒక అభద్రతాభావం వెంటాడుతున్నది. అబద్ధాల పునాదుల మీద మిథ్యా చరిత్రని నిర్మించే మిత- మతవాద రాజకీయాలు సమాజాన్ని తప్పుదారి పట్టిస్తున్నాయి. దీన్ని ప్రశ్నించాల్సిన పౌరసమాజం మౌనంగా వీక్షిస్తున్నది. ఈ మొత్తం సందర్భాన్ని మనం ఎలా చూడాలి ఎలా ఎదుర్కోవాలి లౌకిక, ప్రజాస్వా మిక శక్తుల పాత్ర ఎలా వుండాలి ఈ ప్రశ్నలన్నిటికీ సమాధానమివ్వగలిగిన మేధోసంపత్తిని మనకు వారసత్వంగా అందించి పోయాడు భగత్‌సింగ్. పూర్తిగా ఆచరణాత్మకమైనదీ, సైద్ధాంతికమైనది. అందువల్ల భగత్‌సింగ్‌ను అధ్యయనం చేయటం నేటి తరానికి అత్యంత అవసరం. "మతమౌఢ్యం, మతోన్మాదం మన పురోగతికి పెద్ద అడ్డుగోడలు. అవి దారిలో అనేక ఆటం కాలు సృష్టిస్తాయి. మనం వాటిని పక్కకు నెట్టుకుంటూ ముందు కెళ్లాలి. మతాలన్నింటిలో కనిపించే మూఢవిశ్వాసాలు, ఛాందసవాదం, సంకుచిత ధోరణుల వల్లే మనుషులు దోపిడీకి గురవుతున్నారు" అంటాడు భగత్‌సింగ్. మతం దోపిడీదారుల చేతుల్లోని ఒక సాధనమని ఆయన ఆనాడే గ్రహించాడు. కాబట్టే 1924లో తన పదిహేడేళ్ల వయసులోనే "విశ్వ మానవ సౌభ్రాతత్వం" అనే అద్భుతమైన రచన చేశాడాయన. అందులో "ప్రపంచంలోని మానవు లందరూ ఒకటే.. ఎవరూ మరెవరికీ పరాయి కాదు" అంటాడు. "నలుపు-తెలుపు, నాగరికులు-అనాగరికులు, పాలకులు-పాలితులు, ధనిక -పేద, అగ్రవర్ణాలు-అంటరాని వర్గాలు అనేవి ఉనికిలో ఉన్నంత కాలం విశ్వమానవ సౌభ్రాతత్వం ఎలా సాధ్యమవుతుంద"ని ప్రశ్నించాడు. ఇవి సర్వమానవ సౌభ్రాతృత్వానికి అవరోధాలని చెప్పాడు. ఆ వయసులో ఎవరైనా అంతటి ఆలోచనాపరులై ఉంటారని ఊహించగలమా? కానీ ఆయన అలాంటి ఆలోచనలు కలిగి ఉండటమే కాదు, వాటి ఆచరణకు జీవితాన్నే ధారపోశాడు. మనిషి అసలు గుణం ప్రేమ. సహజీవన సౌందర్యం. అంతే కానీ కులమూ మతమూ కాదు అని చెప్పదలచుకొన్నాడు భగత్‌సింగ్. జనజీవితంలో అత్యంత సహజమైనవిగా ఉన్న లౌకిక విలువల పట్ల అచంచలమైన విశ్వాసాన్ని ప్రకటించాడు. 1926లో "నౌజవాన్ భారత సభ" స్థాపన ద్వారా భగత్‌సింగ్ తన ఆలోచనలకు నిర్మాణ రూపమిచ్చాడు. ప్రజలకోసం ప్రజల చేత విప్లవం సాధించడం సభ లక్ష్యంగా ప్రకటించాడు. ఈ లక్ష్యసాధనలో మతం మన పురోగతికి అతిపెద్ద ఆటంకమని సభ ప్రణాళికలో నిర్థిష్టంగా పేర్కొన్నాడు. విభేదాలు పక్కనపెట్టి ఒక ఉమ్మడి అజెండాతో లౌకిక, ప్రజాస్వామిక ప్రాతిపదిక మీద కలసి పనిచేయడం ద్వారానే మనం పురోగమించగలమని చెప్పాడు. మతాన్ని రాజకీయాల నుండి విడదీయ గలిగితేనే మనం ప్రజలను ఐక్యంగా ఉంచగలమని స్పష్టం చేశాడు. భారతదేశ అభ్యున్నతిని కోరేవారెవరైనా దీన్నే అనుసరిస్తారని చెప్పాడు. భారత దేశానిది సమ్మిళిత సహజీవన సంస్కృతి అని నినదించాడు. నిజమే కదా..! 'భారతదేశం నా మాతృభూమి. భారతీయులందరూ నా సహోదరులు. సుసంపన్నమైన బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణం' అని నిత్యం ప్రతిజ్ఞ చేస్తున్నాం మనం. శతాబ్దాలుగా దేశం సంతరించుకున్న ఈ విలువలను కాపాడుకోవడం, సమున్నతంగా నిలబెట్టు కోవడం ఇప్పుడు కాలం మన ముందు నిలిపిన అతిపెద్ద సవాలు. ఈ సవాలును ఎదుర్కోవడానికి మనకిపుడు భగత్‌సింగ్ కావాలి. ఆయన భావజాలం కావాలి. భగత్‌సింగ్‌ను అర్థం చేసుకోవాలంటే ఆయన రచనలు చదవాలి. ముఖ్యంగా జైలు నోట్‌బుక్ మనకు ప్రధాన వనరు. ఆయన సాధించిన సైద్ధాంతిక పరిణితిని తెలుసుకోవడానికి అది చాలా ఉపయోగపడుతుంది. మిగతా రాజకీయ ఖైదీల్లా ఆయన జైలులో ఉండి ఆత్మకథలు రాసుకోలేదు. ఈ ప్రపంచాన్ని అధ్యయనం చేశాడు. గాయాలపాలైన ఈ నేల విముక్తికి మార్గాలను అన్వేషిం చాడు. మహామహులనేకమంది రచనలను, రాజకీయ సిద్ధాంతాలను లోతుగా పరిశీలించాడు. ఆ తరువాత మార్క్సిజం వెలుగులో భారతదేశ భవిష్యత్తును దర్శించాడు. నిస్తేజంగా పడివున్న ఈ నేలకు జవసత్వాలు కూడగట్టేందుకు అవసరమైన భావజాలాన్ని అభివృద్ధి చేశాడు. "దోపిడీ పీడనలు, అసమానతలు లేని సమాజ స్థాపన కోసం మన ప్రజలను సిద్ధం చేయాలి. ఈ విప్లవ బీజాలను నాటడానికి ఇప్పుడున్న పంటలన్నిటినీ ధ్వంసం చేయాలి. ఇందుకు అడ్డుగా ఉన్న కులమతాల గోడల్ని కూలగొ ట్టాలి" అని నిర్దేశించాడు. ఈ లక్ష్య సాధనకు ఏంచే యాలో కూడా వివరించాడు. "ప్రజలు తమలో తాము పోట్లాడుకోకుండా వారిలో వర్గ ధృక్పథాన్ని కల్పించాలి. కార్మికులకు, రైతులకు వారి మొదటి శత్రువు పెట్టుబడిదారుడని చెప్పాలి. వారు సృష్టించే కులమతాల ఉచ్చుల్లో పడవద్దని వివరించాలి. మనుషులు ఏ కులం వారైనా, ఏ మతం వారైనా, ఏ జాతి వారైనా ఒకే విధమైన హక్కులు కలిగి ఉంటారని తెలియజేయాలి. ఆ హక్కులు వారి ఐక్యతలో ఉన్నాయని, వారి సంక్షేమం అధికారాన్ని తమ చేతుల్లోకి లాక్కోవడంలో ఉందని అర్థం చేయించాలి" అన్నాడు. పెట్టుబడిదారీ ప్రభుత్వాలేవి ప్రజలను చైతన్యవంతులను చేసే కృషిని సమ్మతించవు. పైగా నిర్దయగా అణచివేస్తాయి. కనుక ఈ స్థితిని రూపుమాపాలంటే విప్లవం ద్వారా మనం అధికారాన్ని చేతుల్లోకి లాక్కోవాలంటాడు భగత్‌సింగ్. విప్లవమంటే రక్తపాతంతో కూడిన ఘర్షణలుకావు. అది బాంబులు, తుపాకుల పూజ కాదు. కొన్ని సందర్భాల్లో అవి కూడా లక్ష్యాన్ని సాధించే సాధనాలు కావొచ్చు. అంతే తప్ప అదే విప్లవమని చెప్పలేం. విప్లవమంటే నిజమైన అర్థం మెరుగైన మార్పు కోసం జరిగే పోరాటం. పాత నుండి కొత్తకు ప్రయాణించడం. మానవ చైతన్యం తిరోగమన శక్తుల్ని తొక్కుకుంటూ పురోగమించడం అంటూ విప్లవానికి నిర్వచనం చెప్పాడు భగత్‌సింగ్. "ఇప్పుడు ఈ తిరోగమన శక్తుల మూలంగా దేశం దయనీయ స్థితిని ఎదుర్కొంటోంది. ఒక మతస్తుడికి మరో మతస్తుడు శత్రువు అన్నట్టుగా ఉంది పరిస్థితి. ఎదుటి వ్యక్తి ముస్లిం అయితే చాలు.. అతడిని చంపడానికి హిందువులకు వేరే కారణం అక్కర్లేదు. ఎదుటివాడు హిందువైతే చాలు.. అతడిని చంపటానికి ముస్లింలకూ కారణమవసరం లేదు. అలాగే సిక్కులు కూడా. ఈ స్థితి మనుషులను ముక్కలు చేయడం తప్ప ఒక్కటిగా ముందుకు నడిపించగలదా? దీన్ని అడ్డుకోవడం, అధిగమించడం విప్లవకారుల కర్తవ్యం" అంటాడు భగత్‌సింగ్. నాడు లాహోర్‌లో చెలరేగిన మతకల్లోల నేపథ్యంలో ఆయన రాసిన "మతకల్లోలాలు వాటి పరిష్కారాలు" అనే వ్యాసంలో ఈ విషయాలన్ని సమగ్రంగా వివరించాడు. సరిగ్గా వందేళ్ల తర్వాత అవే పరిస్థితులు ఇప్పుడు దేశంలో కొనసాగుతున్నాయి. పైగా మతతత్వం అధికారంలోకి వచ్చి కూర్చుంది. దేశమంతటా విభజన, విద్వేష రాజకీయాలు మనుషుల్ని చీలికలు పేలికలు చేస్తున్నాయి. శాంతినీ సామరస్యాన్నీ ధ్వంసం చేస్తున్నాయి. మనువాదం మనిషిని తిరిగి మధ్యయుగాలకు మళ్లించజూస్తోంది. దారిలో ముండ్లు కనబడితే ఎత్తిపారేసే మనిషి, రాళ్లూ రప్పలూ ఎదురైతే తొలగించి నడిచే మనిషి ఇప్పుడు అచేతన జీవిలా మారిపోతున్నాడు. మనిషి మనిషిగా జీవించడానికి కావాల్సిన సహజమైన ఆవరణమే లేకుండాపోతోంది. ఈ ఆవరణాన్ని కమ్ముకుంటున్న చీకటిని ఛేదించే టార్చ్‌బేరర్ భగత్‌సింగ్. అందుకే మనకు భగత్‌సింగ్ కావాలిప్పుడు. ఈ స్థితిని అర్థం చేసుకోవడానికీ అధిగమించడానికి కావాల్సినంత అవగాహననూ చేతననూ మనకందించి పోయాడు భగత్‌సింగ్. వాటిని అందిపుచ్చుకోవాలి. విద్వేషం వీధివీధినా పారుతున్న వేళ.. ప్రేమను గడపగడపకూ పంచిపెట్టాలి. రక్తసిక్తమైన హృదయాలకు లేపనాలు పూయాలి.. మతమౌఢ్యం మనకు వారసత్వంగా సంక్రమిస్తున్న ఓ పెద్ద అబద్ధమని కుండబద్ధలు కొట్టాలి. నీతికి మూలం మనిషే కావాలి తప్ప, మతం కాకూడదని నినదించాలి. భగత్‌సింగ్ ఇందుకు అవసరమైన చూపునిస్తాడు, పోరాడే బలమిస్తాడు. విధ్వంసమైన బతుకుల్ని విప్లవ కార్యాచరణకు నడిపించడమెలాగో వివరిస్తాడు. నిత్యం కాలం నుదిటిపై నిగనిగలాడే ఎర్రని సింధూరమతడు.

# కఠోర నియమాలు.. రంజాన్ దీక్షలు



పండగ, పర్వం అంటే శుభవేళ, ఉత్సాహంగా జరుపుకునే ఉత్సవ సమయం అని అర్థం. పండుగలు మానవ జీవన ప్రవంతిలో భాగమై, జాతీయతకు, సామూహిక జీవన విధానానికి, సంస్కృతి వికాసానికి దోహదపడుతున్నాయి. పండుగ అనేది ఏ మతానికి సంబంధించినది అయినా సరే, దాని వెనుక ఒక సందేశం, ఒక శాస్త్రీయత, ఒక సదాచారం దాగి ఉంటాయి. పండుగ మానవాళికి హితాన్ని బోధిస్తుంది. ముస్లిములు అత్యంత పవిత్రంగా జరుపుకునే రంజాన్ సైతం ఇదే హితాన్ని మానవాళికి అందిస్తుంది. ముస్లిములు చాంద్రమానం క్యాలెండర్ ను అనుసరిస్తారు. చాంద్రమాన అనుసరణీయ, ఇస్లామీయ క్యాలెండర్ తొమ్మిదవ నెల రంజాన్. క్రమశిక్షణ దాతృత్వం ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం. ముస్లిం సోదరులకు పరమ పవిత్రమైన రంజాన్ నెల సందర్భంగా, నెల రోజుల పాటు నిర్వహించనున్న ఉపవాస దీక్షలు... కఠోర నియమాలకు, దీక్షా దక్షతలకు ప్రబల నిదర్శనాలు. దివ్య ఖురాన్ అవతరించిన నెలలో విధిగా ఆచరించవలసిన నియమం ఉపవాస వ్రతం. ఉపవాసాన్ని "పార్సీ" భాషలో "రోజా" అంటారు. పరమ పవిత్రంగా ప్రత్యేక ప్రార్థనలతో, ఉపవాస దీక్ష కంకణులైన ధార్మికులు, భక్తి శ్రద్ధలతో అన్ని అలవాట్లకు దూరంగా ఉంటూ, నెల రోజులు దీక్షలో నిమగ్నమై ఉంటారు. "రంజాన్" పండగ పేరు కాదు. నెల పేరు. "రంజ్" అనగా కాలుట (జ్వలించుట) ఉపవాసము చేయుటచే, మను షులుచేయు పాపమును కాలి పోవునని భావము. నెల అంతయు, ఉదయం నుండి సూర్యా స్తమయం వరకు ఉపవాసం ఉండి, రోజా పాటిస్తూ రోజుకు 5 సార్లు నమాజ్ పఠిస్తూ, మసీదులలో ఎక్కువ సమయం గడుపుతారు. ఐదు సార్లు చేసే నమాజులు.....ఫజర్ (సూర్యోదయమునకు పూర్వము) జుహర్ ( మధ్యాహ్నం తర్వాత) అసర్ ( సూర్యాస్త మయానికి పూర్వము) మగరీబ్ (సూర్య సమయానికి ముందు చీకటి పడ్డాక) ఇషా (అర్ధరాత్రికి ముందు చేయాల్సిన సమాజులు. ఈ నెలలో రాత్రి చేయు ప్రత్యేక ప్రార్థనలు "తరావీహ్" అంటారు. నెలలో ఖురాన్ ను పూర్తిగా పఠిస్తారు. ముస్లి సిద్ధాంతాలను విశ్వసించి పాటిస్తారు. ఆయన దూతలను హృదయ పూర్వకంగా విశ్వసించడం, రోజు 5 సార్లు నమాజు నమాజు పఠిచడం, పూర్తిగా ఉపవాస దీక్షను పాటించడం, పేదలకు దానం చేయడం మక్కా యాత్ర చేయడం, ప్రధాన సిద్ధాంతాలు. రోజా లో ఉండగా ఉమ్మిని మింగ రాదు. బీడీ, సిగరెట్ లాంటివి కాల్చడం చేయరాదు. మద్యం సేవించ రాదు. మందులు తీసుకొనరాదు. చాడీలు చెప్పుట, ఇతరులను దుర్భాషలాడడం, అబద్ధం చెప్పుట, చెడు పనులు చేయుట నిషిద్ధాలు, వీటిని పాటించ కుంటే, అల్లాహ్ దృష్టిలో తాను చేసిన వ్రతమునకు విలువ ఉండదు. బీదలకు సహాయం చేసి, వారి నుం దీవెనలు పొందాలి. సూర్యోదయానికి ముందు తినే ఆహారాన్ని "సహరీ" అంటారు. సూర్యాస్తమయం తర్వాత ఖర్జూరపు పండు గాని ఇతర ఫలాలను తీసుకోవడాన్ని "ఆఫ్తారీ" అంటారు. రంజాన్ మాసంలో మరొక విశేషం అత్యధిక దానధర్మాలు చేయడం. సంపాదనాపరులు, సంపన్నులైన వారు. రంజాన్ నెలలో పేదలను ఆదుకోవాలని ఖురాన్ బోధిస్తోంది. ఆస్తిలో నుంచి, నిర్ణీత మొత్తాన్ని, పేదలకు దానం చేయడాన్ని "జకాత్" అంటారు. దీనిని పేదల "ఆర్థిక హక్కు"గా పేర్కొంటారు. దీని ప్రకారం. ప్రతి సంవత్సరాంతంలో మిగిలిన, తన సంపద నుండి 30 శాతం చొప్పున ధన, వస్తు, కనకాది ఏవైనా, నిరుపేదలకు దానం ఇస్తారు. పేద వారు కూడా అందరితో పాటు పండుగను. జరుపుకోవడానికి, సంతోషంగా పాలుపంచుకునేందుకు "జకాత్" ఎంతగానో ఉపయోగ పడుతుంది.

**ఈద్ అసలు పేరు "ఈద్ - ఉద్- ఫితర్". ఫితర్ అంటే దానము.**

జకాత్ తో పాటు 'ఫిత్రా దానానికి" రంజాన్ నెలలో ఎంతో ప్రాముఖ్యత ఉంది. మూడు పూటలా తిండికి, ఒంటినిండా బట్టకు నోచుకోని పేదవారు, అభాగ్యులకు, పండగ సందర్భంలో దానం చేయాలని, ఇస్లాం మతం బోధిస్తోంది. "ఫిత్రా దానం" అని పిలుస్తారు. ఉపవాస వ్రతాలు విజయవంతం కావడానికి, దేవుని పట్ల కృతజ్ఞతగా, పేదలకు ఫిత్రా దానం చేయడం. ఫిత్రా దానాన్ని విధిగా నియ మించడానికి కారణం, ఉపవాస వ్రత నియమాన్ని పాటించే సమయంలో హృదయంలో కలిగే చెడు భావనలు, తలంపులు, ఆలోచనలు, నోటి నుండి వెలువడే అసత్యాలు, అనాలోచిత పొరపాటు, అన్నీ క్షమించ బడతాయని, మహమ్మద్ అనుచరుడు అబ్దుల్లా బిన్ మసూద్ ఉవాచ. రంజాన్ మాసంలో జరుపుకునే ఇస్తార్ విందులో, ఆత్మీయ స్వభావాలు ప్రస్ఫుటం అయితాయి. సామూహిక జీవన విధానానికి, విశాల ఆలోచన దృక్పథానికి, ఇఫ్తార్ విందులు నిదర్శనాలు. పవిత్ర ఆరాధనలకు, ధార్మిక చింతనకు, దైవభక్తికి, క్రమశిక్షణకు, ఇంద్రియ నిగ్రహమునకు, స్వీయ నియంత్రణకు దాతృత్వానికి, ఆలవాలమైన రంజాన్ మాంసం, మనిషి సత్ ప్రవర్తన దిశలో సాగడానికి, మార్గాన్ని సుగమం చేస్తుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# అసమాన వాగ్గేకారుడు ముత్తుస్వామి



వాతాపి గణపతిం భజే అన్న కీర్తన వినని వారుండరంటే అది అతిశయోక్తి కాదేమో. వాతాపి తోనే చాలామంది విద్వాంసులు తమ సంగీత కచేరీలను ప్రాంభించడం చూస్తాం. అయితే ఈ కీర్తన ముత్తుస్వామి దీక్షితుల విరచితమని చాలామంది సంగీత ప్రియులకు తెలియక పోవచ్చు. ముత్తుస్వామి దీక్షితర్ (1775 - 1835) కర్ణాటక సంగీత త్రయంలో ఒకరైన వాగ్గేయకారుడు. దీక్షితార్, త్యాగరాజ (1767 - 1847), శ్యామ శాస్త్రి (1762 - 1827) లను సంగీత త్రిమూర్తులుగా పిలుస్తారు. కర్ణాటక సంగీతంలో దీక్షితార్ కుటుంబానికొక ప్రత్యేక స్థానం వుంది. సంగీత త్రిమూర్తుల్లో ఒకరుగా చెప్పుకుంటున్న ముత్తుస్వామి దీక్షితార్ తండ్రి రామస్వామి దీక్షితార్ ప్రముఖ సంగీత విద్వాంసుడు. ఈయన 'అష్టోత్తర శత రాగ రత్నమాలిక' అనే అతి పెద్ద కృతిని స్వరకల్పన చేసాడు. ఇది రాగయుక్తంగా ఆలాపనలతో పాడడానికి ఓ రోజు పైగా పడుతుందని అంటారు. అటువంటి సంగీత విద్వాంసుడింట, వార్షిక వసంతోత్సవ సమయం అయిన ఫాల్గుణ మాసంలో, రామ స్వామి దీక్షితర్, సుబ్బలక్ష్మి అంబాళ్ పుణ్య దంపతుల సంతానంగా మార్చి 24, 1775లో పుట్టాడు. ముద్దు కుమారస్వామి దయవలన జన్మించిన ఆయనకు ముద్దుస్వామి దీక్షితర్ అని ఇతని తల్లిదండ్రులు పేరు పెట్టారు. ముద్దుస్వామి దీక్షితర్ కాలక్రమేణా ముత్తుస్వామి దీక్షితర్‌గా పిలువ బడ్డాడు. సంగీత, వ్యాకరణ, జ్యోతిష, వాస్తు, మాంత్రిక, వైద్య విద్యలలో ఆరితేరిన పండితుడు. మొత్తం 500లకు పైగా కీర్తనలు రాసాడు. కర్ణాటక సంగీతంలో ఏడు ప్రాథమిక తాళాల్లో కృతులు చేసిన ఏకైక స్వరకర్త. వీరు డెబ్బై రెండు మేళకర్త రాగాలలో(ఇవి వేరే డెబ్బై రెండు మేళకర్త రాగాలు) కృతులు రచించారు. ఆయన ఈస్ట్ ఇండియా కంపెనీ కలనల్ బ్రౌన్ సూచన మేరకు దీక్షితార్ ఇంగ్లీష్ బాణీలకు సంస్కృతంలో వచనాన్ని రాసిన ప్రతిభాశాలి. హైదరాలీ అకృత్యాలతో తంజావూరు చుట్టుపక్కల వూళ్ళన్నీ ధ్వంసమయి పోతే, రామస్వామి దీక్షితార్ స్వస్థలమైన విరించిపురం వదిలి తిరువద మర్దూరు మకాం మార్చారు. అక్కడ నుండి తిరువారూర్ వచ్చి స్థిరపడ్డారు. ముత్తుస్వామి దీక్షితార్ పుట్టింది తిరువారూర్లోనే. ముత్తుస్వామి వీణా విద్వాంసుడు. వీణా విద్వాంసుడు కావడం చేత గమకాల యొక్క గొప్పతనం దీక్షితార్ కూర్పులలో అద్భుతంగా కనిపిస్తుంది. ఆయన కృతులు తెలుగు కంటే ఎక్కువగా సంస్కృతంలో రాయబడ్డాయి. కొన్ని కృతులు మణి ప్రవాలం (తమిళము, సంస్కృతాల సమ్మేళనం)లో కూడా రాయబడ్డాయి. "గురు గుహ" అనేది అయన మకుటం. భక్తి శ్రద్ధలుగల గుణగణాలను బాల్యంలోనే అయన ప్రదర్శించాడు. తన తండ్రి వద్ద తెలుగు, సంస్కృతంతో పాటు శాస్త్రీయ సంగీతాన్ని కూడా ఆయన అభ్యసించాడు. సంగీతంపై వెలువడిన "వెంకటాముఖి" సుప్రసిద్ధ గ్రంథం "చతుర్థండి ప్రకాశికై" ను అధ్యయనం చేశాడు. కావలసిన మేరకు మన ధర్మ గ్రంథాల పరమైన జ్ఞానాన్ని కూడా సంపాదించ గలిగాడు. ముత్తుస్వామికి మద్రాసులోని ఈస్ట్ ఇండియా కంపెనీ వారి ఫోర్ట్ సెయింట్ జార్జ్లో పాశ్చాత్య సంగీత కళాకారులతో పరిచయం ఏర్పడింది. చిదంబరనాథ యోగి ముత్తుస్వామి దీక్షితర్‌ను కాశీకి తీసుకెళ్ళాడు. అక్కడ ఉపాసనా మార్గంలో ఉన్నపుడు, ముత్తుస్వామి ఉత్తరదేశపు సంగీతమైన హిందూస్తానీ కూడా నేర్చుకున్నాడు. "శ్రీనాధాధి గరు గుహోజయతి" అనే మాటలతో ప్రారంభమయ్యే తొలి కీర్తనను ఇతడు ప్రథమావిభక్త్యంతంగా సంస్కృతంలో రచించి రాగం కూర్చాడు. తిరుత్తణిలో వెలసిన శివుడి కుమారుడైన మురుగ భగవానుడి భక్తిపారవశ్యంలో లీనమైనప్పుడు పై సంకీర్తనను అతడు రచించాడు. కాశీ లో గడిపిన కాలంలో హిందుస్తానీ సంగీతం ఆయన సృజనాత్మకత పై తీవ్ర ప్రభావాన్ని చూపింది, ఇది హిందూస్థానీ రాగాల నిర్వహణలో మాత్రమే కాకుండా, సాధారణంగా రాగాల చిత్రణలో కూడా స్పష్టంగా కనిపిస్తుంది. తరువాత ప్రథమా విభక్తి మొదలుకొని సంబోధనా విభక్తి వరకు కల ఏడు విభక్తులతో ఏడు కీర్తనలు రచించాడు. ఆయన కృతులలో నవగ్రహ కృతులు చాల ప్రసిద్ధి పొందాయి. ఈ కృతులను శ్రీ చక్ర ఆరాధనకు అంకితమిచ్చినప్పటికీ, వాటిని కమలంబ నవవర్ణ కీర్తనలు అంటారు. తిరువారూర్ మూల విరాట్టు దేవేరి అయిన కమలాంబని దీక్షితార్ జగజ్జననిగా కొలిచేవాడు. నవగ్రహ కీర్తనలు, నవవర్ణ కీర్తనలు ఆయన ప్రసిద్ధ సమూహ కూర్పులు. దీక్షితార్ రాగాలకు మాత్రమే కాకుండా తాళాలలో కూడా ప్రావీణ్యం కలవాడు. సంగీతం నుండి వీరు కర్ణాటక సంప్రదాయానికి ఆయన తెచ్చిన రాగాలు సారంగ, ద్విజావంతి మొదలైనవి. ఈయన యమునా కళ్యాణి (హిందూస్థానీ సంగీతానికి చెందిన యమన్) లో అనేక కీర్తనలను స్వరపరిచారు. వాటిలో రాగభావం, వైభవాల గొప్పతనం కోసం జంబుపతే మామ్ పాహి కీర్తన ఉదాహరణ. రాగముద్ర, రాజముద్ర, వాగ్గేయకార ముద్ర మొదలైన అష్టాదశ ముద్రలు ఆయన కృతులలో కనిపిస్తాయి. వాతాపి గణపతిం భజే, మహా గణపతిం, శ్రీనాథాది గురుగుహో, అక్షయలింగ విభో, బాలగోపాల, అఖిలాండేశ్వరి, రామచంద్రం భావయామి, చేత: శ్రీబాలకృష్ణం, శ్రీ వరలక్ష్మి, సిద్ధి వినాయకం, త్యాగరాజ యోగవైభవం, హిరణ్మయీం, అన్నపూర్ణే, అరుణాచలనాథం, ఆనందా మృతకర్షిణి, మామవ మీనాక్షి, మీనాక్షి మే ముదం దేహి, నీలకంఠం భజే, స్వామినాథ, శ్రీ సుబ్రహ్మణ్యాయ, పరిమళ రంగనాథం, మొదలైనవి ఆయన ప్రముఖ రచనలు. మదురై మీనాక్షి అమ్మన్ ఆలయాన్ని దర్శించాడు. అక్కడే అతడు "మీనాక్షి మేముదం దేహి, మామన మీనాక్షి" అన్న కీర్తనలను వరుసగా పూర్వీ కళ్యాణి, వరాళి రాగాలలో ఆలపించారు. ధ్యాన యోగం, జ్యోతిష శాస్త్రం, మంత్ర యోగం, పురాణాల సారం మొదలైనవి దీక్షితుల కృతులలోని ప్రత్యేకతలు. శక్తి ఉపాసనలోని సూక్ష్మాలను వివరిస్తూ శ్రీ విద్యా తత్వ రహస్యంపై అయన ఎన్నో కీర్తనలను రచించాడు. అక్టోబర్ 21, 1835 న ఈ లోకాన్ని వదిలి వెళ్లాడు. ఎంతో జాగ్రత్తగా ఎన్నుకుని తన కృతులను నేర్పగా, వారు ఆయన సాంప్రదాయాన్ని కొన సాగించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# జ్ఞానపీఠంపై నిలిచిన 'శుక్లా'





భారతదేశ అత్యున్నత సాహిత్య పురస్కారమైన జ్ఞానపీఠ్ అవార్డును సాహిత్యం, సృజనాత్మకత, విలక్షణమైన రచనా శైలిలో అద్భుతమైన చేసిన కృషికి గాను ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన చిన్న కథా రచయిత, కవి, వ్యాసకర్త, సమకాలీన రచయితలలో ఒకరైన ప్రముఖ హిందీ రచయిత వినోద్ కుమార్ శుక్లా 59వ గ్రహీతగా ఎంపికయ్యారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి ఈ అత్యున్నత సాహిత్య పురస్కారాన్ని అందుకున్న తొలి రచయితగా వినోద్ కుమార్ శుక్లా నిలిచారు. ఈ అవార్డుకు ఎంపికైన 12వ హిందీ రచయితగా శుక్లా గుర్తింపు పొందారు. జ్ఞానపీఠ్ అవార్డు ఎంపిక సందర్భంగా వినోద్ కుమార్ శుక్లా మాట్లాడుతూ 'ఇది ఒక పెద్ద అవార్డు అని, ఈ అవార్డు తన బాధ్యతను కూడా గుర్తిస్తుందని', తనకు ఇలాంటి గుర్తింపు లభిస్తుందని ఎప్పుడూ ఊహించలేదంటూ శుక్లా ఆనందం వ్యక్తం చేశారు. "నేను జీవితంలో చాలా చూశాను, చాలా విన్నాను, చాలా అనుభవించాను. కానీ నేను కొంచెం మాత్రమే రాయగలిగాను. నేను ఎంత రాయాలో ఆలోచించినప్పుడు చాలా మిగిలి ఉన్నట్లు అనిపిస్తుంది. నేను సజీవంగా ఉన్నంత వరకు, నా మిగిలిన రచనలను పూర్తి చేయాలనుకుంటున్నాను కానీ నా పనిని పూర్తి చేయలేకపోవచ్చు ! దీని కారణంగా నేను చాలా సందిగ్ధంలో ఉన్నాను. నా రచన ద్వారా నా జీవితాన్ని కొనసాగించాలనుకుంటున్నాను. కానీ నా జీవితం వేగంగా ముగింపుకు చేరుకుంటోంది, మరి అంత త్వరగా ఎలా రాయాలో నాకు తెలియదు కాబట్టి నేను కొంచెం విచారంగా ఉన్నాను" 88 ఏళ్ల ఆయన అన్నారు. ఈ గుర్తింపును ఒక బాధ్యతగా అభివర్ణించారు.

**వ్యవసాయంలో పట్టా:**

శుక్లా 1 జనవరి 1937న ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్‌నంద్‌గావ్‌లో జన్మించారు. జబల్‌పూర్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ కృషి విశ్వ విద్యాలయం నుండి వ్యవసాయంలో యం.యస్సీ పూర్తి చేశారు. ఆ తర్వాత రాయ్‌పూర్‌లోని వ్యవసాయ కళాశాలలో లెక్చరర్‌గా చేరారు. ఆయన కవి ముక్తిబోధ్ చేత చాలా ప్రేరణ పొందారు. ఆయన అప్పట్లో రాజ్‌నందగావ్‌లోని దిగ్విజయ్ కళాశాలలో హిందీ లెక్చరర్‌గా పనిచేశారు.

**ప్రయోగాత్మక రచనలు:**

ఆయన మొదటి కవితా సంకలనం, "లగ్‌భగ్ జై హింద్", 1971లో ప్రచురించబడింది. "వాహ్ ఆద్మీ చలా గయా నయా గరం కోట్ పెహంకర్ విచార్ కీ తరాహ్" ఆయన రెండవ కవితా సంకలనం. చిన్న కథల సంకలనం పెడ్ పర్ క్రమా (రూమ్ ఆన్ ది ట్రీ), సబ్ కుచ్ హోనా బచా రహేగా, "మహావిద్యాలయ" లాంటివి ఇతర కవితా సంకలనాలు. "ఆకాశ్ ధరీ కో ఖటక్తా హై" "కవితా సే లంబీ కవితా" లు అతని కవితలు. శుక్లా పిల్లల కోసం పుస్తకాలు కూడా రాశారు. వినోద్ కుమార్ శుక్లా కవితలు విస్తృతంగా అనువదించబడ్డాయి. 2015లో ఢిల్లీకి చెందిన రచయిత అఖిల్ కత్యాల్ శుక్ల 'హతాషా సే ఏక్ వ్యక్తి బైత్ గయా'ని ఆంగ్లంలోకి అనువదించారు.

**అవార్డులు:**

1999లో ఉత్తమ హిందీ రచనగా సాహిత్య అకాడమీ అవార్డును గెలుచుకున్న దీవార్ మే ఏక్ ఖిర్కీ రహతి థి ( ఒక విండో నివసించిన గోడ ) ఉన్నాయి. ఈ నవలను నాటక దర్శకుడు మోహన్ మహర్షి రంగస్థల నాటకంగా రూపొందించారు. ఆయన అనేక ప్రతిష్టాత్మక ప్రశంసలను, ఎన్నో అవార్డులు అందుకున్నారు. వీటిలో గజానన్ మాధవ్ ముక్తిబోధ్ ఫెలోషిప్, రజా అవార్డు ఉన్నాయి. ఆయన రచనలలో నౌకర్ కీ కమీజ్ . దీనిని మణి కౌల్ అదే పేరుతో సినిమాగా రూపొందించారు.

**అత్యున్నత పురస్కారం:**

భారతదేశపు సాహితీ పురస్కారాల్లో జ్ఞానపీఠ పురస్కారం అత్యున్నతమైంది. దీన్ని టైమ్స్ ఆఫ్ ఇండియా వార్తా పత్రిక వ్యవస్థాపకులైన సాహు జైన్ కుటుంబం ఏర్పాటు చేసిన భారతీయ జ్ఞానపీఠం వారు ప్రదానం చేస్తారు. వాగ్దేవి కాంస్య ప్రతిమ, పురస్కార పత్రం, పదకొండు లక్షల రూపాయల నగదు ఈ పురస్కారంలో భాగం.1964లో నెలకొల్పబడిన ఈ పురస్కారం మొదటిసారిగా " ఓడక్కుళల్ ( ది వెదురు వేణువు )" కవితా సంకలనంకు గాను మలయాళ రచయిత జి శంకర కురుప్‌కు 1965లో వచ్చింది. 1976లో బెంగాలీ రచయిత్రి ఆశాపూర్ణ దేవి ఈ బహుమతిని గెలుచుకున్న మొదటి మహిళగా నిలిచారు. 2019 లో, అమితవ్ ఘోష్ ఈ అవార్డును అందుకున్న మొదటి ఆంగ్ల రచయిత అయ్యారు. 1982 నుండి ఈ పురస్కారాన్ని ఒక నిర్దిష్ట రచనకు కాకుండా, సాహిత్యానికి రచయిత చేసిన మొత్తం కృషికి ఇస్తున్నారు. ఒక భాషకు ఒకసారి అవార్డు లభించిన తర్వాత, ఆ భాష తదుపరి రెండు సంవత్సరాల వరకు అవార్డుకు అర్హత పొందదు. ఈ అవార్డు భారత రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూల్‌లో చేర్చబడిన భారతీయ భాషలలో, ఆంగ్లంలో వ్రాసే భారతీయ రచయితలకు మాత్రమే ఇవ్వబడుతుంది. మరణానంతరం ఎటువంటి ప్రధానం ఉండదు.

జనక మోహన రావు దుంగ
ఫోన్: 8247045230

# కృష్ణ భారతి మృతి తీరని లోటు..

**•గాంధేయవాది మృతి పట్ల చంద్రబాబు విచారం**



**అమరావతి, మార్చి 23 (నినాదం న్యూస్):** ప్రముఖ గాంధేయ వాది పసల కృష్ణ భారతి మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు ట్విట్టర్ వేదికగా స్పందించిన ఆయన.. పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అలాంటి వారు మన మధ్య లేకపోవడం తీరని లోటు అని భావోద్వేగానికి లోనయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు.. గాంధేయ వాది, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబానికి చెందిన పసల కృష్ణభారతి (92) ఆదివారం తెల్లవారుజామున హైదరాబాద్ స్వగృహంలో తుది శ్వాస విడిచారని తెలిసి ఎంతో బాధ పడ్డానని చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు పసల కృష్ణమూర్తి- అంజలక్ష్మి దంపతుల కుమార్తె అయిన కృష్ణ భారతి జీవితాంతం గాంధేయవాదిగా ఉన్నారని తెలియజేశారు. గాంధీజీ బోధించిన విలువలను పాటించారని, అట్టడుగు వర్గాల్లో విద్యావ్యాప్తికి కృషి చేశారని కొనియాడారు. విద్యాసంస్థలు, గోశాలలకు విరాళాలు సమకూర్చారని, అలాంటి వారు మన మధ్య లేకుండా పోవడం తీరని లోటు అని వ్యాఖ్యానించారు. ఇక వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని కోరుకుంటున్నాను అని సీఎం రాసుకొచ్చారు. కాగా ప్రముఖ గాంధేయవాదిగా ఉన్న పసల కృష్ణ భారతి హైదరాబాద్ స్నేహపురి కాలనీలోని ఆమె స్వగృహంలో కన్ను మూశారు. గతంలో ప్రధాని నరేంద్ర మోడీ ఆంధ్రప్రదేశ్ లోని భీమవరాన్ని సందర్శించినప్పుడు కృష్ణ భారతిని కలిసి ఆమెకు సత్కారం చేశారు. అంతేగాక ఆమె పాదాలకు నమస్కరించి, ఆశీర్వచనం తీసుకున్నారు.

# ఈ రోజు ఆ అదృష్టం కలిగింది

**•మంత్రి నారా లోకేశ్**



**అమరావతి, మార్చి 23 (నినాదం న్యూస్):** మంత్రి నారా లోకేశ్ అమృత్‌సర్‌లో పర్యటించారు. సతీమణి నారా బ్రాహ్మిణి, కుమారుడు దేవాన్ష్‌తో కలిసి అక్కడకు వెళ్లిన ఆయన ప్రఖ్యాత స్వర్ణ దేవాలయాన్ని సందర్శించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పవిత్రమైన శ్రీ హర్మందిర్ సాహిబ్‌ను సందర్శించుకుని ప్రతి ఒక్కరికీ సుఖశాంతులు కలగాలని కోరుకున్నారు. అయితే ఈ పర్యటనపై లోకేశ్ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. స్వర్ణ దేవాలయం వద్ద దిగిన ఫొటోలను షేర్ చేశారు. ఈ రోజు అమృత్‌సర్‌లోని పవిత్రమైన హర్మందిర్ సాహిబ్‌ను సందర్శించే అదృష్టం కలిగిందని మంత్రి చెప్పారు. శాంతి, అందరి శ్రేయస్సు కోసం ప్రార్థించానని తెలిపారు. స్వర్ణ దేవాలయం ప్రశాంతతకు స్ఫూర్తిదాయకమన్నారు. వాహెగురు ఆశీస్సులు మార్గనిర్దేశం చేస్తాయని లోకేశ్ పేర్కొన్నారు.

# పార్లమెంట్‌లో అరకు కాఫీ..

**•నేడే రెండు స్టాల్స్ ప్రారంభం**



**అమరావతి, మార్చి 23 (నినాదం న్యూస్):** అరకు కాఫీకి విస్తృత ప్రచారం కల్పించేందుకు లోక్‌సభ స్పీకర్ అవకాశం ఇచ్చారు. ఈ నేపథ్యంలో పార్లమెంట్ ఆవరణలో సోమవారం నుంచి అరకు కాఫీ స్టాల్స్ ప్రారంభం కానున్నాయి. సభాపతి ఆదేశమేరకు రెండు కాఫీ స్టాల్స్ ఏర్పాటు చేసుకోవాలని లోకసభ భవనాల డైరెక్టర్ కుల్ మోహన్ సింగ్ అరోరా ఉత్తర్వులు జారీచేశారు. సంగం 1, 2 కోర్ట్ యార్డ్ వద్ద ఈ స్టాల్స్ ఏర్పాటు చేసేందుకు లోకసభ సచివాలయం అనుమతిచ్చింది. కాఫీ స్టాల్స్ ప్రారంభం కోసం గిరిజన కోఆపరేటివ్ సొసైటీ అధికారులు ఇప్పటికే ఢిల్లీకి వెళ్లారు. ఇవాళ సాయంత్రం ఏపీ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కూడా ఢిల్లీకి చేరుకోనున్నారు. సోమవారం నుంచి మార్చి 28 వరకు పార్లమెంట్‌లో ఈ కాఫీ స్టాల్స్ అందుబాటులో ఉండనున్నాయి. పార్లమెంట్ భవన్‌లో సోమవారం అరకు కాఫీ స్టాల్స్ ప్రారంభమవుతాయని ఏపీ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. అరకు కాఫీకి ఈ స్థాయి గుర్తింపు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

# వైసీపీలో వలసలు..

**•రంగంలోకి ట్రబుల్ షూటర్**



**విశాఖపట్నం, మార్చి 23 (నినాదం న్యూస్):** విశాఖలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. జీవీఎంసీ మేయర్ పీఠాన్ని దక్కించేందుకు టీడీపీ చేస్తున్న ప్రయత్నాలకు వైసీపీ చెక్ పెట్టాలని యోచిస్తోంది. ఇందులో భాగంగా మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్య నారాయణను ఆ పార్టీ అధిష్టానం రంగంలోకి దింపింది. దీంతో వైసీపీ కార్పొరేటర్లతో ఆయన భేటీ అయ్యారు. ఇటీవల పార్టీని వీడిన కార్పొరేటర్లతో సైతం బొత్స టచ్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. వైసీపీ మేయర్‌పై టీడీపీ, జనసేన కార్పొరేటర్లు పెడుతున్న అవిశ్వాసం నెగ్గకుండా ఉండేందుకు శత విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. వైసీపీ వలసలను నిలిపేందుకు అవసరమైతే వైసీపీ కార్పొరేటర్లను క్యాంపుకు తరలించాలని భావిస్తున్నారు. మేయర్‌పై అవిశ్వాసం పరీక్ష రోజు మళ్లీ విశాఖకు తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నారు. మరోవైపు కూటమి నాయకులు సైతం విశాఖ పీఠాన్ని దక్కించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. వైసీపీ కార్పొరేటర్లను ఆకర్షిస్తూ ఇప్పటికే బలాన్ని పెంచుతున్నారు. మేయర్ పీఠం దక్కించుకనేందుకు సరిపడా కార్పొరేటర్ల తమ వైపు ఉన్నారని చెబుతున్నారు. ఇందులో భాగంగానే మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెడుతూ కలెక్టర్‌కు లేఖలు అందజేశారు. మరి మేయర్ పీఠం ఎవరికి దక్కుందో చూడాలి.

# నేడు పలు రైళ్లు తాత్కాలికంగా రద్దు




**సామర్లకోట, మార్చి 23 (నినాదం న్యూస్):** కాకినాడ జిల్లా పెద్దాపురం నియోజకవర్గం పరిధిలోని సామర్లకోట రైల్వే ఇంజనీరింగ్ సెక్షన్ పరిధిలో సామర్లకోట, పిఠాపురం, గొల్లప్రోలు, రావికంపాడు స్టేషన్ల మధ్య సిగ్నలింగ్ ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా నేడు పలు రైళ్లను రద్దయినట్లు స్టేషన్ మాస్టర్ రమేష్ తెలిపారు. ఉదయ్, సింహాద్రి ఎక్స్ప్రెస్ తాత్కాలికంగా రద్దు చేసినట్లు రైల్వే పీఆర్వో కార్యాలయం తెలిపిందన్నారు. గుంటూరు నుంచి విశాఖ వెళ్లే సింహాద్రి ఎక్స్ప్రెస్, కాకినాడ విశాఖపట్నం, రాజమండ్రి విశాఖపట్నం మధ్య నడిచే మరో నాలుగు రైళ్లు సింహాద్రి, ఉదయ్ ఎక్స్ప్రెస్ రైళ్లు ఈనెల 24 తేదీన రెండువైపులా రద్దు చేశారని, ప్రయాణికులు గమనించాలని స్టేషన్ మేనేజర్ రమేష్ తెలిపారు.

# రుషికొండ బీచ్‌కు.. బ్లూఫ్లాగ్ పునరుద్ధరణ.!

**రుషికొండ, మార్చి 23 (నినాదం న్యూస్):** రుషికొండ బీచ్‌కు బ్లూ ఫ్లాగ్ ధ్రువీకరణ పునరుద్ధరించారు. బీచ్‌పై విధించిన బ్లూ ఫ్లాగ్ తాత్కాలిక ఉపసంహరణ ఆదేశాలను ఎత్తివేస్తున్నట్లు బ్లూఫ్లాగ్ ఇండియా అధికారులు ప్రకటించారు. ఈ మేరకు కలెక్టర్‌ను కలిసిన బ్లూ ఫ్లాగ్ ఇండియా ప్రతినిధుల బృందం.. లాంఛనంగా బ్లూ ఫ్లాగ్‌ను అందజేశారు. గత నెల ఉపసంహరించుకున్న గుర్తింపును పునరుద్ధరిస్తూ నిర్ణయం తీసుకున్నారు బ్లూ ఫ్లాగ్ ఇండియా ప్రతినిధులు.. భద్రత, పర్యావరణ నిర్వహణ, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ, గ్రే వాటర్ నిర్వహణ వంటివి ప్రణాళికాబద్ధంగా కొనసాగించాలని సూచించినట్టు జిల్లా పర్యాటక శాఖాధికారి సుగుణ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. బీచ్‌లో నిర్వహణ సరిగా లేదనే ఆరోపణలపై డెన్మార్కు కు చెందిన ఫౌండేషన్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ బ్లూ ఫ్లాగ్ హోదాను తాత్కాలికంగా రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకొని ఋషికొండ బీచ్‌లో పునరుద్ధరణ చర్యలు ప్రారంభించింది. బీచ్ క్లీనింగ్‌తో పాటు, సందర్శకులకు మౌలిక సదుపాయాలు కల్పనపై ప్రత్యేకంగా అధికారుల దృష్టి సారించి ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో పరిస్థితిని సమీక్షించడానికి న్యూఢిల్లీ నుండి బ్లూ ఫ్లాగ్ ఇండియా ప్రతినిధుల బృందం శుక్రవారం సాయంత్రం రుషికొండ బీచ్‌ను సందర్శించింది. అక్కడి సదుపాయాలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ రుషికొండ బీచ్‌కు బ్లూఫ్లాగ్ ధ్రువీకరణను పునరుద్ధరించారు. కలెక్టర్ ను కలిసిన బ్లూ ఫ్లాగ్ ఇండియా ప్రతినిధులు.. తాత్కాలిక సస్పెన్షన్ ను ఎత్తివేస్తున్నట్టు ప్రకటించారు. అందుకు సంబంధించిన బ్లూ ఫ్లాగ్ సర్టిఫికేషన్‌ను కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు అందజేశారు.






**బ్లూ ఫ్లాగ్ హోదా ఎందుకు ఇస్తారు..**

సరిగ్గా ఐదేళ్ల క్రితం .. 2020లో విశాఖలోని రుషికొండ బీచ్ ప్రతిష్టాత్మక బ్లూ ఫ్లాగ్ సర్టిఫికేషన్ పొందింది. బీచ్లో మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత, పారిశుద్ధ్యం, భద్రతా చర్యలు, ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని 2020లో డెన్మార్క్ కు చెందిన ఫౌండేషన్ ఫర్ ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్ %-% ఎస్ఈఈ సంస్థ ఈ రుషికొండ బీచ్ 600 మీటర్ల మేర కు ప్రతిష్టాత్మక బ్లూ ఫ్లాగ్ సర్టిఫికేషన్ ఇచ్చింది. దీంతో ఈ బీచ్‌కు మరింత గుర్తింపు, పేరు ప్రఖ్యాతులు వచ్చాయి. వాస్తవానికి.. బ్లూ ఫ్లాగ్ సర్టిఫికేషన్ పొందిన బీచ్లో నీలి రంగు జెండాను ఎగుర వేస్తారు. ఈ జెండా ఉన్న బీచ్ లు పర్యావరణ హితంగాను, పరిశుభ్రంగాను, ఆహ్లాదకరంగాను, మౌలిక సదుపాయాలు కలిగి ఉంటాయని అర్థం. అలా విశాఖలోని ఈ రుషికొండ బీచ్లోనూ 2020లో బ్లూ ఫ్లాగ్ జెండాను ఏర్పాటు చేశారు. దానికి ఒకవైపు భారత జాతీయ జెండా, మరో వైపు కాషాయ వర్ణం కలిగిన మరో జెండాను అమర్చారు. అప్పట్నుంచి బ్లూ ఫ్లాగ్ గురించి ఇటు వైజాగ్ వాసులు గాని, అటు రాష్ట్ర ప్రభుత్వం గాని ఎంతో గొప్పగాను, సగర్వంగానూ చెప్పుకుంటున్నారు.

**ఆ తర్వాత ఏం జరిగింది..**

అప్పట్లో ఈ ఘనత దేశవ్యాప్తంగా పాకింది. ఆ తర్వాత పాలకుల నిర్లక్ష్యం, పర్యాటక శాఖ అధికారుల అలసత్వం, బాధ్యతా రాహిత్యంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఉండే రుషికొండ బీచ్ అధ్వానంగా మారింది. దీంతో బ్లూ ఫ్లాగ్ హోదా తాత్కాలికంగా ఉపసంహరణకు గురైంది. బ్లూ ఫ్లాగ్ సర్టిఫికేషన్ తాత్కాలిక ఉపసంహరణకు అనేక కారణాలు ఉన్నాయి. కొద్ది నెలలుగా ఈ బీచ్‌లో వీధి కుక్కల స్వైరవిహారం, సీసీ కెమెరాలు పనిచేయక పోవడం, చెత్త, చెదారాలు పేరుకుపోవడం, మరుగుదొడ్ల నిర్వహణ అస్తవ్యస్థంగా మారడం, నడక దారులు ధ్వంసం కావడం, ఎక్కడ చూసినా అపరిశుభ్ర వాతావరణం, దుర్గంధం, ట్రాఫిక్ నియంత్రణ లేకపోవడం వంటివి నిత్యకృత్యమయ్యాయి. రుషికొండ బీచ్లో నెలకొన్న ఈ దుర్భర పరిస్థితులను చూసిన పర్యాటకులు.. బ్లూ ఫ్లాగ్ గుర్తింపునిచ్చిన డెన్మార్క్ ఎఫ్ఎ సంస్థకు ఫోటోలు, వీడియోలు తీసి పంపారు. వాటిపై స్పందించిన డెన్మార్క్‌కు చెందిన ఫౌండేషన్ ఫర్ ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్ - FEE జనవరిలో బ్లూ ఫ్లాగ్ ఇండియా నేషనల్ ఆపరేటర్ ద్వారా బ్లూ ఫ్లాగ్ గుర్తింపునకు అనుగుణంగా బీచ్‌లో చర్యలు చేపట్టాలని సూచించింది. అనంతరం ఫిబ్రవరి 13న ఈ రుషికొండ బ్లూ ఫ్లాగ్ సర్టిఫికెట్‌ను తాత్కాలికంగా రద్దు చేసింది.

**సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం..**
**శరవేగంగా బీచ్‌లో దిద్దుబాటు చర్యలు..**

రుషికొండ బీచ్ లో బ్లూ ఫ్లాగ్ తాత్కాలిక ఉపసంహరణ తర్వాత.. ఉలిక్కిపడిన జిల్లా యంత్రాంగం నష్ట నివారణ చర్యలకు ఉపక్రమించింది. మరోవైపు ప్రభుత్వం కూడా ఈ అంశాన్ని సీరియస్‌గానే పరిగణలోకి తీసుకుంది. విశాఖ జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్.. జీవీఎంసీ, వీఎంఆర్డీఏ, పోలీస్, పర్యాటక, అటవీ శాఖాధికారులతో సమావేశం నిర్వహించి రుషికొండ బీచ్‌కు పూర్వవైభవాన్ని తీసుకురావాలని ఆదేశించారు. అప్పట్నుంచి అధికారులు ఈ బీచ్లో నెలకొన్న అస్తవ్యస్థ పరిస్థితులను సరి చేసే పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్వయంగా ఈ పనులను పర్యవేక్షించారు. సాధ్యమైనంత త్వరగా మళ్లీ ఋషికొండకు పుర వైభవం తీసుకొచ్చి బ్లూ ఫ్లాగ్ హోదా వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు కలెక్టర్ హరేందిర ప్రసాద్. అందుకు తగ్గట్టుగానే ఋషికొండ బీచ్ లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించ్చారు. ఇటీవల ఈ పరిస్థితులను సమీక్షించేందుకు వచ్చిన బ్లూ ఫ్లాగ్ ఇండియా ప్రతినిధుల బృందం.. బీచ్ లో సదుపాయాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ ను కలిసి బ్లూ ఫ్లాగ్ ను పునరుద్ధరిస్తున్నట్టు ప్రకటించారు.

# గుక్కెడు నీటికోసం.. కిలోమీటర్లు నడవాలా.?



**పాచిపెంట, మార్చి 23 (నినాదం న్యూస్):** వేసవి వస్తుందంటేనే మన్యం జిల్లాలో పలు గ్రామాల గిరిజనులు వణికిపోతున్నారు. ఇంకా నిండు వేసవి ప్రారంభం కాక ముందే జిల్లాలో గిరిజనులకు త్రాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. నీటి ఎద్దడితో పలు గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. కిలోమీటర్ల మేర కాలినడకన వెళ్లి ఊట బావులను ఆశ్రయిస్తున్నారు గిరిజనులు. గుక్కెడు నీరు ఇప్పించండి మహాప్రభో అని అధికారులను వేడుకుంటున్న ఫలితం మాత్రం లేదు. సాధారణ రోజుల్లో కొంతవరకు నీటి సమస్య లేకపోయినా ఎండాకాలం వచ్చిందంటే ఇక్కడ నీటి సమస్య తాండవిస్తుంది. స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని దశాబ్దాలుగా స్థానిక గిరిజనులు ప్రభుత్వాలను వేడుకుంటున్నా నేటికీ ఆ సమస్య పలు గ్రామాలకు తీరడం లేదు. కనీస మౌలిక సదుపాయాలైన త్రాగునీరు, విద్య, వైద్యం, రహదారి వంటి సదుపాయాలు కల్పించాలని గిరిజన సంఘ నాయకులు అనేక ఉద్యమాలు చేసినా ఎలాంటి ప్రయోజనం ఉండటం లేదు. ముఖ్యంగా గిరిశిఖర గ్రామాల్లో ఈ పరిస్థితి మరింత దుర్భరంగా ఉంటుంది. త్రాగునీరు లేక అల్లాడి పోతుంటారు గిరిజనులు. రోజువారీ కూలీ చేసుకొని జీవించే గిరిజనులు సైతం తమ పనులన్నీ పక్కనపెట్టి కిలోమీటర్ల కొద్దీ కాలినడకన వెళ్లి ఊట బావులు, చలమలు లేక గెడ్డ నీటిని బిందెలతో తీసుకురావలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇంటిల్లిపాది వెళ్లి కిలోమీటర్ల దూరం నడిచి నీరు తెచ్చుకున్నప్పటికి శుభ్రమైన నీరు దొరక్క అవస్థలు పడాల్సిన పరిస్థితి దాపురిస్తుంది. పాచిపెంట మండలానికి చెందిన కుమ్మరివలస గ్రామంలో నివాసం ఉంటున్న గిరిజనులు నీటి కోసం నానా పాట్లు పడుతున్నారు. మద్దువలస రిజర్వాయర్ నిర్వాసిత గ్రామమైన ఇక్కడ గత సంవత్సరంలో బోరు రిపేర్ అయ్యింది. అయితే అధికారులు ఆ బోరు మరమ్మత్తు చేయకపోవడంతో అప్పటి నుండి నీటి కోసం ఇబ్బంది పడుతూనే ఉన్నారు గ్రామస్తులు. రెండు కిలోమీటర్ల మేర కాలినడకన వెళ్లి బిందెలతో నీరు తెచ్చుకుంటున్నారు. అలా తెచ్చిన నీరు కూడా చాలక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ సమస్య పరిష్కరించాలని జిల్లా అధికారులను కలిసి ఎన్నిసార్లు విన్నవించుకున్నా ప్రయోజనం లేదు. అయితే గిరిజనులు ఊట బావులు, చలమల నీటిని ఆశ్రయించడం వల్ల అనారోగ్యం బారిన పడుతున్న సందర్భాలు ఉన్నాయి. ఎండాకాలం కావడంతో అవి కూడా గణనీయంగా ఇంకిపోయి అడుగంటి అపరిశుభ్రంగా మారుతున్నాయి. అయినా తప్పనిసరి పరిస్థితుల్లో ఆ అపరిశుభ్ర నీటినే వాడి రోగాల బారిన పడుతున్నారు. అంతేకాకుండా మరోవైపు చలమల వద్ద తిష్ట వేసుండే దోమలు కూడా విజృంభిస్తున్నాయి. నీటి కోసం గిరిజనులు చలమల వద్దకు వెళ్ళగానే అక్కడ ఉన్న దోమలు దండెత్తుతున్నాయి. అలా దోమల దోమకాటుకు గురై మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాల బారిన పడుతున్నారు. ఏజెన్సీలో గుక్కెడు నీరు దొరక్క అనేక రకాల అవస్థలు పడుతూ కాలం వెళ్లదీస్తున్నారు మన్యం వాసులు. ఇప్పటికైనా ఏజెన్సీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు గిరిజనులు.

# కేటీఆర్ సూచనతో నేను ఏకీభవిస్తున్నా..

**•డీలిమిటేషన్‌పై**
**మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి**



**అమరావతి, మార్చి 23 (నినాదం న్యూస్):** దేశవ్యాప్తంగా పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన కోసం కేంద్రం తీసుకొస్తానంటున్న డీలిమిటేషన్ అంశం గత కొద్ది రోజులుగా తీవ్ర దుమారం రేగుతోంది. దీనికి వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టేందుకు పార్టీల మద్దతు కోరుతూ శనివారం తమిళనాడు సీఎం స్టాలిన్ అఖిల పక్ష సమావేశం కూడా ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలోనే డీలిమిటేషన్ పై మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి ఆసక్తికర ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా డీలిమిటేషన్ పై తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దీనిపై మాజీ ఎంపీ.. కేవలం జనాభాపై ఆధారపడిన డీలిమిటేషన్ మనకు నష్టం కలిగిస్తుందని, దక్షిణ భారత రాష్ట్రాల ఆందోళనలతో అంగీకరిస్తున్నానని అన్నారు. అలాగే ఆందోళనలు న్యాయమే అయినప్పటికీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా.. దక్షిణ భారతదేశంలోని ఏ రాష్ట్రమూ సీట్లు కోల్పోదని, న్యాయమైన పెంపుదల జరుగుతుందని కూడా భరోసా ఇస్తున్నారని తెలిపారు. అంతేగాక ఎమ్‌కే స్టాలిన్ నేతృత్వంలోని జేఏసీ దక్షిణ భారతదేశం కోసం పోరాడేందుకు ముందుకు వచ్చినందుకు ప్రశంసించబడుతోందని చెప్పారు. ఇక ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ లో 4.6 శాతం లోక్‌సభ స్థానాలు, ఉత్తరప్రదేశ్‌లో 14.7 శాతం లోక్ సభ స్థానాలు ఉన్నాయని, వీటిలో ఏదైనా పెరుగుదల జరిగితే కొత్త లోక్ సభలో కూడా అదే శాతాన్ని కొనసాగించాలని సూచించారు. కోట్లాది మంది భారతీయులు తమ రాష్ట్రం వెలుపల నివసిస్తున్నారని, అందువల్ల కేవలం జనాభాపై ఆధారపడటం సాధ్యం కాదు కాబట్టి మరో పరిష్కారం దిశగా అడుగులు వేయాలన్నారు. ఇక ప్రజలకు పాలనను మరింత చేరువ చేసేందుకు రాష్ట్రాలలో ఎమ్మెల్యే సీట్లు కూడా పెరగాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన సూచనతో తాను కూడా ఏకీభవిన్నానని విజయసాయి రెడ్డి వెల్లడించారు.

# శ్రీశైలం ఘాట్‌లో భారీగా ట్రాఫిక్ జాం..



**శ్రీశైలం, మార్చి 23 (నినాదం న్యూస్):** శ్రీశైలం ఘాట్ రోడ్డులో భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఆదివారం కావడంతో శ్రీశైలం పుణ్యక్షేత్రానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రాగా ఘాట్ రోడ్డులో తీవ్రమైన ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వరుస సెలవులు రావడంతో ఏపీ, తెలంగాణ, కర్ణాటక నుంచే కాక ఇతర రాష్ట్రాల నుండి కూడా లక్షలాది భక్తులు తరలి వచ్చారు. దీంతో శ్రీశైలం టోల్ గేట్ నుండి సాక్షి గణపతి ముఖద్వారం వరకు సుమారు 5 కిమీ మేర వాహనాలు నిలిచిపోయాయి. స్థానిక పోలీసులు, అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం, ముందస్తు ట్రాఫిక్ నియంత్రణ ప్రణాళికలు లేకపోవడం వలన భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడిందని పలువురు భక్తులు ఆరోపించారు. అయితే ఘట్ రోడ్డులో ఓవర్‌లోడ్ ఇసుక లారీ ఓ మలుపు వద్ద నిలిచిపోవడం వల్ల ఈ సమస్య ఏర్పడినట్టు అధికారులు చెబుతున్నారు. ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం కోసం అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘాట్ రోడ్డు సింగిల్ రోడ్డుగా ఉండటం వల్ల ఇరువైపులా వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని, రోడ్డు విస్తరణ లేదా ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం వంటి చర్యలు అవసరమని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కాగా గతేడాది నవంబర్లో కూడా ఇలాంటి ట్రాఫిక్ జామ్ సమస్య ఏర్పడి 5 కిలోమీటర్లకు పైగా వాహనాలు నిలిచిపోయి భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

# తిరుమలలో అక్రమంగా నివసిస్తున్న వారిపై కొరడా..



**తిరుమల, మార్చి 23 (నినాదం న్యూస్):** తిరుమలలో అనధికారికంగా నివసిస్తున్న వారిపై పోలీసులు కొరడా ఝుళిపించారు. రెండు రోజుల క్రితం తిరుమలలో కొందరు యువకులు మద్యం మత్తులో వీరంగం సృష్టించిన విషయం తెలిసిందే. గత నెలలో తిరుమల లోని ఓ హోటల్ లో పని చేస్తున్న యువకుల మధ్య గొడవ కత్తిపోట్లు దారితీసింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. అనధికారికంగా, సరైన పత్రాలు లేకుండా తిరుమలలో ఉంటున్న వారిని గుర్తించి, వారిని వాహనాల్లో తిరుపతికి తరలించారు. తిరుమలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్టు పోలీసులు తెలిపారు.

# ప్రజలకు మంత్రి నాదెండ్ల మనోహర్ కీలకపిలుపు



**గుంటూరు, మార్చి 23 (నినాదం న్యూస్):** గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గం కొల్లిపర మండలం పాల కేంద్రం వద్ద ఫినిక్స్ ఫౌండేషన్ మరియు శంకర కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని స్వచ్ఛంద సంస్థలు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయం అన్నారు. నెలరోజుల కృషితో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. 'ఇప్పుడే ఎన్నికలు లేవు, కాబట్టి రాజకీయాలకు తావు లేకుండా అందరం కలిసికట్టుగా అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుదాం' అని నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. తెనాలిలో ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందించేందుకు రూ.30 కోట్ల వ్యయంతో క్రిటికల్ కేర్ ఆస్పత్రి నిర్మాణాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ప్రజల రవాణా సౌకర్యాన్ని మెరుగుపరిచేందుకు రూ.5 కోట్ల రూపాయలతో వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ వేసవికాలంలో నియోజక వర్గంలోని డొంక రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో డొంక రోడ్ల నిర్మాణానికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రూ.10 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. రైతులకు మేలు చేసేందుకు కూటమి ప్రభుత్వం పాటుపడుతుందని, ప్రజలకు ఏ అవసరం వచ్చినా అధికార యంత్రాంగం ఎప్పుడూ అందుబాటులో ఉంటుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

# 25న తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు



**తిరుమల, మార్చి 23 (నినాదం న్యూస్):** తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో మార్చి 30న ఉగాది ఆస్థానాన్ని టీటీడీ వైభవంగా నిర్వహించనుంది. ఈ సందర్భంగా మార్చి 25న మంగళవారం ఉదయం 6 నుంచి11 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని అర్చకులు ఆగమోక్తంగా నిర్వహించనున్నారు. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని టీటీడీ అధికారులు వివరించారు. . ఆనందనిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప ఆలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుభ్రం చేస్తారని వివరించారు. ఈ సమయంలో స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పి, శుద్ధి అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేస్తారని టీటీడీ అధికారులు వివరించారు. అనంతరం ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించి , భక్తులకు దర్శనానికి అనుమతిస్తారని చెప్పారు. ఈ కారణంగా మార్చి 25న వీఐపీ బ్రేక్ దర్శనాలు, అష్టదళ పాదపద్మారాధన సేవను రద్దు చేసినట్టు వెల్లడించారు. 24న ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించబడవని స్పష్టం చేశారు.

## పోచమ్మ తల్లి... మమ్మల్ని చల్లంగా చూడమ్మా



**భూపాలపల్లి, మార్చి 23 (నినాదం న్యూస్):** తెలంగాణ సాంస్కృతిలో భాగంగా గ్రామ దేవతలకు ఉగాది పర్వదినానికి ముందు మొక్కుల పరంపర కొనసాగుతూనే ఉంది. మొన్నటి వరకు ఎల్లమ్మ బోనాలు మొక్కులు విరివిగా కొనసాగగా, ప్రస్తుతం పోచమ్మ బోనాలు మొక్కుల సందడి జోరుగా నడుస్తుంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సైతం ఆదివారం ఆడపడుచులు పోచమ్మకు బోనాలు సమర్పించడం, కోళ్లు మేకల బలిని నైవేద్యంగా పెట్టడం వంటి కార్యక్రమం ఎంతో సందడిగా జరిగింది. జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌరస్తా సమీపంలో ప్రధాన రహదారిపై ఉన్న పోచమ్మకు ఆడపడుచులు ఉత్సాహంగా బోనాలను సమర్పించారు. ఆదివారం సెలవు దినం కావడంతో కార్మిక వాడలైన ఎల్బీనగర్, రెడ్డికాలనీ, లక్ష్మీనగర్ తదితర కాలనీల కుటుంబాలు పోచమ్మకు భారీ ఎత్తున మొక్కులు సమర్పించారు.

## డిలిమిటేషన్ పై ప్రతిపక్షాలది అనవసర రాద్ధాంతం

- సమస్యలపై ప్రజల దృష్టి మళ్లించడానికి డిలిమిటేషన్ రగడ
- హైకోర్టు న్యాయవాది మద్దిరాల విష్ణువర్ధన్ రెడ్డి



**వనపర్తి ప్రతినిధి, మార్చి 23 (నినాదం న్యూస్) :** డిలిమిటేషన్ పేరుతో ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని, అధికారంలో ఉన్న పార్టీలు సమస్యలపై ప్రజల దృష్టి మళ్లించడానికి డీ లిమిటేషన్ రగడ పెట్టాయని హైకోర్టు న్యాయవాది మద్దిరాల విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని, కొత్త ఎత్తుగడలతో ప్రజా సమస్యల నుండి దృష్టి మళ్లించడానికి ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. నియోజకవర్గాల పునర్విభజన పేరుతో దక్షిణాది రాష్ట్రాలు తమ రాజకీయ ఉనికి కాపాడుకోవడానికి తప్పుడు ప్రచారం చేస్తున్నాయని చెప్పారు. రాబోయే రోజుల్లో బిజెపిని ఎదుర్కోవడానికి ఊహాజనిత సమస్యలపై లేని సమస్యలను ఉన్నట్లు ఊహించుకొని తప్పించుకుంటున్నాయని ఆయన విమర్శించారు. పునర్విభజనతో దక్షిణాదికి అన్యాయం అంటూ గగ్గోలు పెట్టడం ఎంతవరకు సబబు అని, ఎన్నో సమస్యలు చుట్టూ ఉన్న ఏ ఒక్కటి సంపూర్ణంగా పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ తో కలిసి స్టాలిన్ తో తమిళనాడులో దక్షిణాది రాష్ట్రాల సమావేశంలో పాల్గొనడం తెలంగాణ ప్రజలకు ఏ విధమైన సంకేతం ఇవ్వదలుచుకున్నారో సమాధానం చెప్పాలని ఆయన ప్రశ్నించారు. ఒకే వేదికపై బీఆర్ఎస్ కాంగ్రెస్ కలిసి పోరాటం చేయడం రాబోయే రోజుల్లో బిజెపిని దక్షిణాది రాష్ట్రాలలో అధికారంలోకి రాకుండా ఎదుర్కోవడానికి సంకేతమేనని అన్నారు. ఎత్తుగడలతో రాజకీయ లబ్ధి పొందాలనుకునే పార్టీలకు రాబోయే రోజుల్లో ప్రజలు గుణపాఠం చెబుతారని ఆయన హితవు పలికారు

## దళిత బడుగు బలహీన వర్గాల చూపు బీజేపీ వైపు



**నర్సంపేట, మార్చి 23 (నినాదం ):** నర్సంపేట నియోజకవర్గంలో దళిత బడుగు బలహీన వర్గాల చూపు బీజేపీ వైపు చూస్తున్నారని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి గోగుల రాణా ప్రతాప్ రెడ్డి అన్నారు.నల్లబెల్లి బీజేపీ మండల అధ్యక్షులు తడుక వినయ్ గౌడ్ గారి అధ్యక్షతన ముచ్చింపుల గ్రామ పార్టీ అధ్యక్షులు ఊటుకూరి చిరంజీవి గౌడ్ ఆధ్వర్యంలో ముచ్చింపుల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గ్రామ ఎస్సీ సంఘం మాజీ అధ్యక్షులు బోట్ల రవి గారు,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పసుల సారయ్య రాణా ప్రతాప్ రెడ్డి ఆదివారం సమక్షంలో బీజేపీలో చేరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు ధర్మారం క్రాంతి కుమార్ గారు, మురికి మనోహర్ గారు, దికొండ సునీల్ పాల్గొన్నారు.

## వేతనాలు లేక నలుగుతున్న పారిశుద్ధ్య కార్మికులు



**నూతనకల్ మార్చి 23 (నినాదం న్యూస్):** సూర్యుడు పొడవకముందే ఇంటింట తిరుగుతూ చెత్త బండి వచ్చిందమ్మా తడి చెత్త వేరు చేసి ఇవ్వండి అమ్మ... అంటూ గ్రామంలో తిరుగుతూ ఊరును శుభ్రం చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు జీతాలు రాక అష్ట కష్టాలు పడుతున్నారు.... నాలుగు నెలలుగా జీతాలు అందడం లేదు. దీంతో కుటుంబ పోషణ కోసం బదులు పైసలు తెచ్చుకుంటు ఉండడంతో అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారు. అందరూ ఉద్యోగులకు ఇచ్చినట్లే మాకు కూడా ప్రతి నెల చెల్లించాలని ప్రభుత్వాని వేడుకుంటున్నారు. ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామపంచాయతీలను నడపడం పంచాయతీ కార్యదర్శులకు పెను మీద సవాలుగా మారింది.ఇప్పటికే పలు గ్రామపంచాయతీలో కార్యదర్శులు అప్పు తెచ్చి మరీ పరిపాలన సాగిస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా గ్రామపంచాయతీలకు నెల నెల నిధులు కేటాయించి గ్రామపంచాయతీలోని సమస్యలు పరిష్కరించడం, గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికుల జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి కార్మికులు కోరుతున్నారు.

**మా మొర ఆలకించండి..**

మాకు నాలుగు నెలలుగా జీతాలు రావడం లేదు. ఎప్పుడు అడిగినా వస్తుంది.ఇస్తాం అంటుర్రు కానీ అందించడం లేదు. ఒక్క నెల రాకుంటే ఎలాగో గడుపుతాం కానీ, నాలుగైదు నెలలుగా అందకుంటే కుటుంబం ఎలా నడపాలి మావి పూట గడవని బతుకులు సర్కారు అర్థం చేసుకోవాలి. పండుగలు, ఇంట్లో పరిస్థితులు అనారోగ్య సమస్యలు తలెత్తిన మళ్లీ అప్పు చేయవలసి వస్తుంది. అధికారులు వెంటనే మా జీతాలు ఇవ్వాలి.

## స్వచ్ఛంద సేవలకు అవార్డు

**- వేముల శంకర్‌ను వరించిన డాక్టరేట్ అవార్డు**



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మిరాకిల్ వాలంటరీ ఆర్గనైజషన్ ద్వారా వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న ఐటీ మాస్టర్ డైరెక్టర్ వేముల శంకర్‌కు డాక్టరేట్ ఆవార్డు వరించింది. ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ, ఇంటర్నేషనల్ అక్రిడిటేషన్ ఆర్గనైజేషన్ ఆయనను గౌరవ డాక్టరేట్‌కు ఎంపిక చేసింది. ఏప్రిల్ 17న హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో ప్రతిష్టాత్మక డాక్టరేట్ అవార్డును వేముల శంకర్‌కు అందించనున్నారు. జిల్లా కేంద్రంలో గత 11 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం 350%-%400 యూనిట్ల రక్తాన్ని ఎంజీఎం ఆస్పత్రికి అందిస్తూ, వేలాది మందికి ప్రాణదాతగా నిలిచారు. అవయవదానం అవశ్యకతపై విద్యా సంస్థలలో అవగహన కార్యక్రమాలు, ప్రచార యాత్రలు నిర్వహించారు. హరితహారం కార్యక్రమాల్లో పాల్గొని 5వేల మొక్కలను నాటించారు.అలాగే 8,900 మందికి ఉచిత కంప్యూటర్ శిక్షణ, 4వేల మందికి వివిధ రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించారు. వివిధ సేవా కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషించిన వేముల శంకర్ ఈ అవార్డుకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు.

## మయన్మార్ బాధితులను వెనక్కి తీసుకురావాలి

**- బీజేపీ మండల అధ్యక్షుడు మేడిపల్లి పూర్ణచందర్**



**మహాముత్తారం, మార్చి 23(నినాదం న్యూస్):** ఉపాధి కోసం మయూన్మార్‌కు వెళ్లి అక్కడే చిక్కుకుపోయిన యువకులను వెంటనే వెనక్కి తీసుకురావాలని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు మేడిపల్లి పూర్ణచందర్ కోరారు. ఈ మేరకు కరీంనగర్‌లో కేంద్ర హోం సహాయక మంత్రి బండి సంజయ్‌ని బాధిత కుటుంసభ్యులతో కలిసి విన్నవించాడు. కొన్ని నెలల క్రితం మహాముత్తారం మండలం నిమ్మగూడెం, దొబ్బలపాడ్ గ్రామాల నుండి ఇద్దరు యువకులు ఉపాధి కోసం మాయన్మార్ కి వెళ్లి చిక్కుకున్నట్లు మంత్రికి వివరించారు. మయున్మార్‌లో చిక్కుకున్న యువకుల పూర్తి వివరాలు తెలుసుకొన్న మంత్రి కుటుంబ సభ్యులకు దైర్యం చెప్పి, వారిని తీసుకొని వచ్చే బాధ్యత తనదేనని భరోసా ఇచ్చినట్లు పూర్ణచందర్ తెలిపారు.

# కాంగ్రెస్ సర్వ మతాలకు ప్రాధాన్యం ఇస్తుంది

- మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది



**కోదాడ,మార్చి 23(నినాదం న్యూస్):** కాంగ్రెస్ పార్టీ సర్వ మతాలకు సమానమని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు.సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ వైస్ ఛైర్మన్ జబ్బార్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి కోదాడ మైనారిటీ సోదరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ...ముస్లిం సోదరులు రంజాన్ మాసం అంతా భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు పాటిస్తారన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరించే ముస్లిం సోదరులకు ఇచ్చే ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. రంజాన్ పండుగ వారి జీవితాలలో సుఖసంతోషాలను నింపాలని ఆ అల్లాహ్ ను కోరుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. కేంద్రంలో ఉన్న బిజెపి పార్టీ పార్లమెంటులో వక్ఫ్ బోర్డు యమన్ మెంట్ యాక్ట్ తేవాలని ప్రయత్నిస్తుందని కాంగ్రెస్ ఎంపీలంతా ఈ యాక్ట్ కు వ్యతిరేకంగా పోరాడుతున్నారన్నారు. కర్ణాటక ప్రభుత్వంలో మాదిరిగా తెలంగాణ రాష్ట్రం సహితం ముస్లిం మైనార్టీలకు రక్షణగా ఈ యాక్ట్ అమలు కాకుండా ముఖ్యమంత్రి మంత్రులతో చర్చించి కృషి చేస్తానన్నారు గత రెండు దశాబ్దాలుగా కోదాడ హుజూర్నగర్ ముస్లిం మైనార్టీలతో ఎంతో ఆత్మీయత తనకు ఉందన్నారు ఉత్తంకుమార్ ఆప్కా భాయ్ అంటూ ఉర్దూలో ప్రసంగించి ఆకట్టుకున్నారు హుజూర్నగర్ లో షాదీ ఖానా కోదాడలో ఈద్గా అభివృద్ధికి నిధులు మంజూరు చేయించాను అన్నారు.ముస్లిం సోదరులకు ప్రతి ఏడాది జబ్బర్ భాయ్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతి మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్రావు, టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ లక్ష్మీనారాయణ రెడ్డి, మాజీ సర్పంచులు ఎర్నేని బాబు ,పారా సీతయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బషీర్, టిపిసిసి ప్రచార కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ కేఎల్ఎన్ ప్రసాద్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ కోటేశ్వరరావు , మైనార్టీ నాయకులు అల్తాఫ్ హుస్సేన్ ,బాజాన్ బాగ్దాద్, ఎజాజుద్దీన్, మునావర్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు పలు హొదాలో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది



**నర్సంపేట, మార్చి 23(నినాదం న్యూస్):** ఖానాపురం మండలం ధర్మారావుపేట గ్రామంలో భగత్ సింగ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భగత్ ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ (ఎప్ పి ఓ ) కమ్యూనిటీ హాల్ భవనాన్ని మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి శనివారం ప్రారంభించారు. భగత్ సింగ్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన భగత్ సింగ్ 94 వ వర్ధంతి కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మాజీ ఎమ్మెల్యే పెద్ది మాట్లాడారు.ప్రముఖ స్వతంత్ర సమరయోధులు యువత కు స్ఫూర్తి ప్రదాత భగత్ సింగ్ స్ఫూర్తితో ధర్మ రావు పేటలో ఏర్పాటుచేసిన భగత్ సింగ్ యూత్ క్లబ్ అభివృద్ధికి ఐక్యతకు నిదర్శనంగా పనిచేస్తుందన్నారు.భగత్ సింగ్ యూత్ క్లబ్ సభ్యులు ఐక్యమత్యంతో కలిసి గ్రామ అభివృద్ధికి చేస్తున్న కృషి నన్ను ఎంతగానో ఆకర్షించిందన్నారు.నేను శాసనసభ్యునిగా ఉన్నప్పుడు వీరి అభివృద్ధికి సహకరించాలనే ఉద్దేశంతో ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ పి ఓ ) 2020 సంవత్సరం లో మంజూరు చేయడం జరిగిందన్నారు.131 మంది సభ్యులు క్రమశిక్షణతో ఐక్యతతో ఎఫ్పిఓ ను అభివృద్ధి చేస్తున్న వీరికి ధాన్యం కొనుగోలు కేంద్రం (పీపీసీ ) కేంద్రాన్ని కూడా ఇవ్వడం జరిగిందన్నారు.గత 4 సంవత్సరాలుగా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాన్ని నిర్వహించి ఆర్థికంగా నిలబడినందుకు నాకు చాలా సంతోషంగా ఉందన్నారు.ఆధునికమైన శాస్త్రీయ వ్యవసాయ విధానాలతో పాటు మార్కెటింగ్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి , రైతులు సమైక్య0గా అభివృద్ధి చెందాలన్నారు. ఇదే స్ఫూర్తితో నర్సంపేట నియోజకవర్గం లో ఏర్పాటు చేసిన ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలబడడం మనకు ఎంతో గర్వకారణమన్నారు. జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన ఎప్ పి ఓ లకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు నాబార్డ్ నుండి నిధులను తీసుకు వచ్చి ఫామ్ మేకనైజేషన్ ,సీడ్స్ ప్లాంటును అందివ్వడం జరిగిందని వివరించారు. భగత్ సింగ్ యూత్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులతో పాటు ఒడిసిఎంఎస్ చైర్మన్, మండల పార్టీ అధ్యక్షులు, మాజీ జెడ్పిటిసి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, యూత్ క్లబ్ సభ్యులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

## నేరాల నిర్మూలన, శాంతి భద్రతల పరిరక్షణకు కార్డెన్ సెర్చ్

- వనపర్తి డిఎస్పీ వెంకటేశ్వరావు వెల్లడి



**వనపర్తి ప్రతినిధి, మార్చి 23 (నినాదం న్యూస్) :** అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపైన చర్యలు తప్పవని, కాలనీలలో కొత్త వ్యక్తుల కదలికను పోలీసులకు సమాచారం ఇవ్వాలని వనపర్తి డిఎస్పీ వెంకటేశ్వరరావు కోరారు. ఆదివారం వనపర్తి పట్టణంలోని రామ్ నగర్ కాలనీలో పోలీసులు ఆకస్మికంగా కార్డెన్ అండ్ సెర్చ్ తనిఖీలు నిర్వహించి సుమారు 300 ఇళ్లను సోదాలు చేశారు. ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశాల మేరకు వనపర్తి సీఐ ఎం.క్రిష్ణ, పట్టణ ఎస్సై హరిప్రసాద్ ల ఆధ్వర్యంలో సీఐలు ఇద్దరు, ఎస్సైలు 12 మంది మొత్తం 88 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి తనిఖీల్లో పాల్గొన్నారు. పత్రాలు సరిగా లేని, నెంబర్ ప్లేట్ లేని 1 కారు, 3 ఆటోలు,62 ద్విచక్రవాహనాలుమొత్తం 66 వాహనాలు అదుపులోకి తీసుకొని సీజ్ చేసి వనపర్తి టౌన్ పోలీస్టేషన్ కు తరలించారు. సంబంధిత వాహనాల యజమానులు తమ వాహనాల పత్రాలను చూపించి వాహనాలను తీసుకువెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ నేరాల నిర్మూలన కొరకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందని, ప్రజల రక్షణ, ప్రజలకు భద్రత భావం, సెన్సాఫ్ సెక్యూరిటీ కల్పించడం గురించి ఎవరైనా కొత్త వ్యక్తులు గాని నేరస్తులు గాని వచ్చి షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయం కూడా తెలుస్తుందని ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రభుత్వ పాలసీకి వ్యతిరేకంగా నిషేధిత గుట్కాల, గుడుంబా తయారీ, గంజాయిని విక్రహించడం, పీడీస్ రైస్ అక్రమ రవాణా, కలప అక్రమ రవాణా వంటి చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గుడుంబా,గుట్కా,గంజాయి లాంటి అక్రమ వ్యాపారం, చట్ట వ్యతిరేకమైన కార్యాకలాపాలకు పాల్పడకూడదన్నారు.వాహనాలు నడిపే టప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ అందరు కలిగి ఉండాలని అన్నారు. చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు. వాహనాల సంబందించిన ధ్రువపత్రాలు రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ కలిగి ఉండాలన్నారు.

## ఉపాధ్యాయులకు ఆసుపత్రిలో హెల్త్ కార్డులు అమలు చేయాలి



**వనపర్తి ప్రతినిధి, మార్చి 23 (నినాదం న్యూస్):** ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు అన్ని ఆసుపత్రిలో అమలుపరిచే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్ జి టి యు వనపర్తి జిల్లా అధ్యక్షుడు రామ్మూర్తి కోరారు. ఆదివారం మెదక్ జిల్లా తూప్రాన్ లో ఎస్ జి టి యు రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్జిటిలకు ఎమ్మెల్సీ ఓటు హక్కు కావాలని, పి ఆర్ సి ని త్వరగా అమలయ్యే విధంగా రాష్ట్ర శాఖ కృషి చేయాలని కోరారు. ఆర్థిక సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు 5 సీసీఎల్ మంజూరు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ జి టి యు నాయకులు నరేందర్ రెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మత యుద్ధోన్మాదాలకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం

- ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్



**వరంగల్ మార్చి 23( నినాదం న్యూస్ ) :** స్వేచ్ఛ స్వాతంత్రం ప్రజాస్వామ్య పరిరక్షణకై వినాశనకర దోపిడి మతోన్మాద యుద్ధోన్మాద విధానాల పాలనను వ్యతిరేకిస్తూ సమ సమాజ స్థాపనకు ప్రజా ఉద్యమాలను ఉధృతం చేయడమే ఏకైక ప్రత్యామ్నాయమని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అన్నారు.వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని కారల్ మార్క్స్ కాలనీలో బైరబోయిన నరసయ్య అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పెద్దారపు రమేష్ మాట్లాడుతూ అమెరికన్ సామ్రాజ్యవాదం పెచ్చరిల్లిపోతూ పాలస్తీనా ఇజ్రాయిల్ లాటిన్ అమెరికా లాంటి తదితర దేశాలలో యుద్ధాలను రెచ్చగొడుతూ వేలాది మంది ప్రాణాలను బలి తీసుకుంటుందన్నారు. ట్రంపు చర్యలు అభివృద్ధి చెందుతున్న దేశాలకు వెనుకబడిన దేశాల అభివృద్ధికి పెను ప్రమాదంగా మారిందని అలాంటి అమెరికా ట్రంపు చర్యలకు మోడీ ప్రభుత్వం వత్తాసు పలకడం సిగ్గుచేటు అని అన్నారు. ఒకే దేశం ఒకే అంటూ జమిలి ఎన్నికల విధానానికి తెరలేపి నియోజకవర్గాల పునర్విభజన పేరుతో దక్షిణాది రాష్ట్రాలను నియంతృత్వంగా తమ స్వాధీనంలోకి తెచ్చుకునేందుకు మోడీ ప్రభుత్వం తాపత్రయపడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగం దారిద్ర్యం ఆకలి చావులు విపరీతంగా పెరిగి విద్యా వైద్యం కనీస వసతులు తగ్గిపోతున్నాయని ఇందుకు మోడీ ప్రభుత్వ వినాశనకర విధానాలే కారణమన్నారు. ప్రజల్లో వ్యతిరేకత రాకుండా మతం భాష ప్రాంతం లను ముందు పెట్టి రెచ్చగొట్టి తమ పబ్బం గడుపుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆశాజనకమైన హామీలను విస్మరించి తమ ఇష్టానుసారంగా పాలన కొనసాగిస్తున్నారని ఇలాంటి పరిస్థితుల్లో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాజకీయాలకు అతీతంగా ప్రజలందరిని సమీకరించి ఉద్యమించడమే ఏకైక ప్రత్యామ్నాయమని పిలుపునిచ్చారు.

**ఘనంగా భగత్ సింగ్ వర్ధంతి :**

విప్లవ వీర కిశోరాలు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ లా 94వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు ఎంసిపిఐ(యు) అద్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చిరుప్రాయంలోనే దేశం కోసం ప్రాణాలను త్రుణప్రాయంగా వదిలిన భగత్ సింగ్ రాజ్ గురు దేవ్ జీవితాలు నేటి యువతకు ఎంతో ఆదర్శమని వారి అడుగుజాడల్లో ప్రమాదంలో ఉన్న దేశ సమైక్యత సమగ్రతను లౌకికత్వాన్ని కాపాడడానికి నడుం బిగించాలని పిలుపునిచ్చారు.

## మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

**- కలెక్టర్ రాహుల్ శర్మ**



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం న్యూస్):** మత సామరస్యాలకు ప్రతీక ఇఫ్తార్ విందు కార్యక్రమం అని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని భారత్ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ముస్లింలు రంజాన్ మాసాన్ని భక్తిశ్రద్ధలతో కఠోర ఉపవాసాలతో నిర్వహిస్తారన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ఆచరించే ఉపవాస దీక్షలు ముస్లిం సోదరులకు ఇచ్చే ఇఫ్తార్ విందు లాంటి కార్యక్రమాలు ప్రజలలో సోదర భావాన్ని పెంపొందిస్తాయని ఈ సందర్భంగా రంజాన్ మాస విశిష్టతను కొనియాడారు. అన్ని మతాల సారాంశం ప్రజలందరూ సోదర భావంతో జీవించాలని అన్నారు. సామూహిక నమాజ్ అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలకు ఫలహారాలు తినిపించి ఉపవాస దీక్ష విడిపించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరంలో పండ్ల పంపిణీ




**కోదాడ,మార్చి 23(నినాదం న్యూస్):** సినీ నటుడు రామ్ చరణ్ పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకొని ఆదివారం రాంచరణ్ అభిమాన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కుడుమల శివ ఆధ్వర్యంలో పట్టణంలో రక్తదాన శిబిరం నిర్వహించబడింది. ఈ శిబిరంలో రక్తదాతలకు సూర్యాపేట జిల్లా ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో పండ్లు, బ్రెడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు గరినే ఉమామహేశ్వరి శ్రీధర్ మాట్లాడుతూ రక్తదానం అన్ని దానాల కెల్లా గొప్ప దానం అన్నారు. రక్తదానంతో మరొకరి ప్రాణాన్ని నిలబెట్టడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు రక్తదాన కార్యక్రమాలలో పాల్గొనాలని ఆమే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి ఓరుగంటి విజయలక్ష్మి పాండు, దోగుపర్తి హైమావతి, ఓరుగంటి స్వాతి, పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి పందిరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో విద్యార్థి, యువతరం ఉద్యమించాలి




**కోదాడ,మార్చి 23(నినాదం న్యూస్):** బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, పరాయి పాలనను ఎదిరిస్తూ నవ యవ్వన ప్రాయంలో దేశ స్వాతంత్ర్యం, సమానత్వంకై ఉరికంభమెక్కిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 94వ వర్ధంతి సందర్భంగా పి డి ఎస్ యు, పివైఎల్ ఆధ్వర్యంలో కెఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముఖద్వారం వద్ద ఉన్న భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పివైఎల్ రాష్ట్ర కోశాధికారి దారవత్ రవి, పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం చందర్ రావు మాట్లాడుతూ భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్ గురు మరణం దేశ ప్రజలను ఎంతో చైతన్యపరిచి విప్లవ తిరుగుబాటుతోనే దేశానికి స్వాతంత్రం వస్తుందని రుజువు చేశారు. వారు ఇచ్చిన నినాదం ఇంక్విలాబ్ జిందాబాద్ ఇప్పటికీ, ఎప్పటికీ విద్యార్థులు యువకులు విప్లవ పోరాటాలు నిర్మించడానికి వెలుగు రేఖై నిలుస్తుంది. మనదేశంలో భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో నేటి విద్యార్థి, యువతరం పోరాడాల్సిన కర్తవ్యం మరింత పెరుగుతూ వస్తున్నది.

# రాజ్యాంగాన్ని అణగతొక్కుతున్న బీజేపీ

- రాజ్యాంగ పరిరక్షణకు ప్రతిఒక్కరూ నడుం బిగించాలి
- నీలం మధు ముదిరాజ్
- సంగారెడ్డిలో జై బాపు - జై భీమ్- జై సంవిధాన్ సమావేశం

**జిన్నారం/పటాన్‌చెరు, మార్చి 23 (నినాదం న్యూస్):** స్వాతంత్ర సమరయోధులను అవమానిస్తూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అవమానించేలా కేంద్రంలోని బిజెపి సర్కార్ ప్రవర్తిస్తుందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ తెలిపారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కుందన్ బాంక్వెట్ హాల్ లో డిసిసి అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "జై బాపు - జై భీమ్ - జై సంవిధాన్ సమావేశానికి నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ రెడ్డి,స్పోర్ట్స్ అథారిటీ



చైర్మన్ శివసేనరెడ్డి,ఫిషరీస్ సొసైటీస్ చైర్మన్ మెట్టు సాయి కుమార్,ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీంతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ.... అహింస పద్ధతిలో పోరాటం చేస్తూ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచి స్వాతంత్రం సిద్ధింప చేసిన మహాత్మా గాంధీతో పాటు ప్రజల స్వేచ్ఛ సమానత్వం కోసం రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్ లను బిజెపి ఆర్ఎస్ఎస్ అవమాన పరుస్తున్నాయని మండిపడ్డారు. పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అంబేద్కర్ కు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం అన్నారు. మహనీయుల ఆశయాలను కాపాడడంతోపాటు ప్రజలకు స్వేచ్ఛను ప్రసాదించిన రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి కాంగ్రెస్ పార్టీ అగ్రనేత లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా "జై బాపు - జై భీమ్ - జై సంవిధాన్" అభియాన్ ర్యాలీ నిర్వహిస్తున్నారని తెలిపారు.రాజ్యాంగ విలువలను కాపాడడానికి ప్రజల హక్కులను పరిరక్షించడానికి దేశవ్యాప్తంగా అన్ని పట్టణాలు గ్రామాలలో సామాజిక న్యాయం, ఐక్యత కల్పించే ప్రధాన ఉద్దేశ్యంతో సంవిధాన్ బచావో రాష్ట్రీయ పాదయాత్ర చేయాలని ఏఐసీసీ నిర్ణయించిందన్నారు, కావున గ్రామ గ్రామాన ఈ పాదయాత్ర చేయాలి అని సమావేశంలో పిలుపునిచ్చారు, ఈ పాదయాత్ర ద్వారా రాజ్యాంగ గొప్పతనాన్ని ప్రజలకు తెలియజేయడంతో పాటు మహనీయులను స్మరించేందుకు వారు చేసిన సేవలను నేటి తరానికి తెలియపరిచే ఉద్దేశంతో ఈ బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త బిజెపి పార్టీ చేస్తున్న అరాచక పాలనను రాజ్యాంగ వ్యతిరేక చర్యలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## ప్రమోషన్లలో అవకతవకలు

- తెలంగాణ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆరోపణ

**మహేశ్వరం, మార్చి 23 (నినాదం న్యూస్):** తెలంగాణ ఉద్యాన శాఖలో ఆడిషనల్ డైరెక్టర్ ప్రమోషన్ల విషయంలో ఎస్టీ (షెడ్యూల్డ్ ట్రైబ్) అధికారులపై వివక్ష జరుగుతోందని, ప్రమోషన్లలో అవకతవకలు జరుగుతున్నాయని తెలంగాణ ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాంచందర్ నాయక్ ఆరోపించారు. 2010-11 సంవత్సరం నుంచి ఉద్యాన శాఖలో ప్రమోషన్ల విషయంలో అవకతవకలు జరుగుతు న్నాయని, కొంతమంది అధికారులపై అభియోగా లున్నప్పటికీ వారికి ప్రమోషన్లు ఇస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. 2004లో రావాల్సిన ప్రమోషన్లను నీరుగార్చి- ఏపీఎంఐ పీలో ఫారెస్ట్ అధికారులను పీడీలుగా కొనసాగిం చారని, 2003లో నియమించిన జేడీహెచ్లను పలు శాఖల్లో ఓఎస్టీలుగా నియమించారని వెల్ల డించారు. ఎస్టీ రోస్టర్ పాయింట్ ప్రకారం అర్హత ఉన్న ఎస్టీ అధికారులకు ప్రమోషన్లు ఇవ్వ కుండా వారిని కింది స్థాయిలోనే కొనసాగిస్తున్నారని ఆరోపణలొచ్చాయన్నారు. నిబంధనల ప్రకారం, ఎస్టీ అధికారికి అర్హత లేకపోతే రిలాక్సే షన్ ఇచ్చి, క్యారీ ఫార్వర్డ్ స్థానాన్ని ఎస్టీ అధికారికి కేటాయించి, ఆ తర్వాత ప్రమోషన్లు చేపట్టాలని రాంచందర్ పేర్కొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం అభినందనీయం

- బొల్లారం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి

**జిన్నారం/పటాన్‌చెరు, మార్చి 23 (నినాదం న్యూస్):** బొల్లారం పారిశ్రామిక వాడలోని పేద ప్రజలకు అత్యధిక స్థాయిలో కార్పొరేట్ వైద్య సేవలను అందించడం అభినందనీయమని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి అన్నారు.



శ్రీ జగన్నాథ్ ఉత్కల్ సంస్కృతి సంఘం తెలంగాణ ఒడిశా డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక వైయస్సార్ కాలనీ లోని పూరి జగన్నాథ్ ఆలయం వద్ద ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మాజీ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి గారికి వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పేద మధ్యతరగతి వలస కార్మిక కుటుంబాలకు ఒడిశా డాక్టర్స్ అసోసియేషన్ తరపున అన్ని రకాలైన వైద్య సేవలను ఉచితంగా కార్పోరేట్ స్థాయిలో అందజేయడం అభినందనీయమన్నారు. ఆయా విభాగాలకు చెందిన వైద్య నిపుణులు శిబిరంలో రోగులకు రక్త పరీక్షలు, సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తారని తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించే శిబిరంలో పారిశ్రామిక వాడ ప్రజలు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మాజీ ప్రజా ప్రతినిధులను, వైద్య బృందాన్ని స్థానికులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు గోపాలమ్మ , చంద్రయ్య, స్థానిక నాయకులు సంపత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజు, దిననాథ్ , రాజారామ్ , చక్రపాణి, మాజీ వార్డ్ మెంబర్ భాస్కర్, నరేందర్, శేఖర్, నర్సింహ్లు, శ్రీను, జగన్, నవీన్, ఒడిశా వైద్య బృందం భీమల్ పాండే, అమిత్ మొహం తీ, రాకేష్ పండా, దేబరాజు రెడ్డి, లలతెందు కుమార్, సునీల్ కుమార్ , భరత్ విజయ్ పురోహిత్, నిహార్ రంజన్ ప్రధాన్, అనురాధ పండా నివేదిత, శ్రీ జగన్నాథ్ ఉత్కల్ సంస్కృతి సంఘం సభ్యులు గిరి , శ్రీను , పద్మ , స్థానికులు, రోగులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత



**అల్వాల్, మార్చి 23 (నినాదం న్యూస్):** అల్వాల్ సర్కిల్ 133 డివిజన్ మచ్చ బొల్లారం వాసులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంకు వెళ్లి డ్రైనేజ్ అవుట్లెట్ సమస్యల వల్ల కాలనీవాసులు తీవ్ర పడుతున్న ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఉత్తమ సేవా రత్న అవార్డు గ్రహీత బిఆర్ఎస్ సీనియర్ నాయకులు నర్ల సురేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు డివిజన్లోని మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నామని సమస్యలేమున్న తెలిపితే ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సానుకూలంగా స్పందించి సమస్యను వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలకు వెంటనే పరిష్కారం చూపుతానని అన్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్, శ్రీనివాస్, శ్రీరాములు, అంజిరెడ్డి, సాత్విక్, రోహిత్, అభిలాష్, అర్జున్, బి ఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## శ్రీరామ కోటయ్యకు ఘన సన్మానం



**మహేశ్వరం, మార్చి 23 (నినాదం న్యూస్):** వేములవాడలో రాజరాజేశ్వర స్వామి దేవాలయం సన్నిధిలో హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ తొమ్మిదవ కార్యవర్గ సమావేశం నిర్వహించడమైనది ఈ కార్యక్రమంలో సరాబు లక్ష్మణ్ గుప్త ని హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా మరో పర్యాయం మీరే కొనసాగాలని మాజీ అధ్యక్షులు శ్రీ రెడ్డిశెట్టి చంద్రశేఖర రావు ప్రతిపాదించగా మాజీ అధ్యక్షులు కాశెట్టి పాండు, ఐపిపి మ్యాడం దయాకర్ గుప్త బలపరిచారు. రాబోయే రెండు సంవత్సరాల కు హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా సరాబు లక్ష్మణ్ గుప్త ని సభలో పాల్గొన్న కార్యవర్గం మొత్తం ముక్తకంఠంతో ఆమోదించడమైనది ఈ నాటి కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ పరిధిలోని లాల్ దర్వాజా గౌలిపుర మండల ఆర్యవైశ్య సంఘానికి మార్చి 20వ తేదీన సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికైన శ్రీరామ్ కోటయ్య ని హైదరాబాద్ జిల్లా ఆర్య వైశ్య మహాసభ లో అధ్యక్షునిగా ప్రకటించడమైనది అయినది.

## చాకలి ఐలమ్మ తెగువ చిరస్మరణీయం

- టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్



**జవహర్‌నగర్, మార్చి 23 (నినాదం న్యూస్):** వీరనారి చాకలి ఐలమ్మ తెగువ చిరస్మరణీయమని ఆమె పోరాట స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని టిపిసిసి ఉపాధ్యక్షుడు కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్చార్జ్ తోటకూర వజ్రేశ్ యాదవ్ అన్నారు. జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మడేలయ్య రజక సంఘం అధ్యక్షుడు నరసింహ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయగా ఆదివారం వజ్రేష్ యాదవ్ సమక్షంలో ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు, రజక సంఘం నాయకులు భాస్కర్, రమేష్, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సబ్బండవర్గాలకు సముచితస్థానం





- జవహర్‌నగర్‌లో శ్రీకాంత్ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ

**జవహర్‌నగర్, మార్చి 23 (నినాదం న్యూస్) :** రేవంత్ రెడ్డి పాలనలో అన్ని వర్గాలకు సముచిత గౌరవం దక్కిందని దేశంలోనే మొదటిసారిగా బీసీ కులగన చేపట్టిన మొట్టమొదటి ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని ఎస్సీల వర్గీకరణ భారత దేశ చరిత్రలోనే చారిత్రక నిర్ణయం అని సంక్షేమ అభివృద్ధి పథకాల్లో తెలంగాణ ప్రపంచంతో పరుగులు తీస్తుందని టీ పిసిసి ఉపాధ్యక్షుడు మేడ్చల్ ఇన్చార్జి తోటకూర వజ్రేష్ తెలిపారు. ఆదివారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రోజ్ గార్డెన్ నుండి బాలాజీ నగర్ అంబేద్కర్ విగ్రహం వరకు జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో బిసి రిజర్వేషన్ల బిల్లు, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన సందర్భంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తోటకూర వజ్రేష్ యాదవ్ పాల్గొని మహనీయుల విగ్రహాలతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేతల ప్రభుత్వమని అభివృద్ధి సంక్షేమ పథకాల్లో దేశంలోనే నెంబర్ వన్ గా నిలుస్తుందని, భారతదేశంలో మొదటిసారిగా బీసీ కులగలన చేపట్టిన సత్తా గల ప్రభుత్వమని కొని ఆడారు. ఎస్సీల వర్గీకరణ చారిత్రక నిర్ణయం అని బడుగు బలహీన వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతగానో పాటుపడుతుందని, ఆరు గ్యారెంటీ పథకాలతో తెలంగాణ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. 30 ఏళ్లుగా సాధ్యం కానీ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సీఎం రేవంత్ రెడ్డి తోనే సాధ్యమైందని బీసీలకు విద్య ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసిన ఘనత కూడా సీఎం రేవంత్ రెడ్డికే దక్కుతుందని తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిసి రిజర్వేషన్లు 42% ఈ రెండు చారిత్రకమైన బిల్లులకు ఆమోదం తెలపడం పట్ల హర్షిస్తూ బొమ్మ మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుల ఆశీర్వాదంతో విజయోత్సవాలు నిర్వహించడం గర్వంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్ ,మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్, గోనె మహేందర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు శంకర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినయ్ కుమార్, మహిళా అధ్యక్షురాలు విజయ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కల్లేపల్లి సదానంద్ ,మాజీ కార్పొరేటర్లు, నిహారిక గౌడ్, సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ ఆశయాలను సాధిద్దాం

- సిపిఐ మహేశ్వరం నియోజకవర్గ కార్యదర్శి దత్తునాయక్



**మహేశ్వరం, మార్చి 23 (నినాదం న్యూస్):** మృతవీరుల దినోత్సవం. ఈ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం లో భగత్ సింగ్ బుక్ ప్రతి ఒక్కరు చదవాలని వారి ఆశీస్సులు సాధించాలని బుక్కులు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా బి.దత్తు నాయక్ మాట్లాడుతూ సరిగ్గా 94 ఏళ్ల క్రితం షహీద్ భగత్ సింగ్,రాజగురు, సుఖదేవ్ లను బ్రిటీష్ ప్రభుత్వం ఉరి తీసింది.ఆ యోధులు రగిల్చిన జాతీయోద్యమ స్ఫూర్తి నిప్పు కణంలానేటికీ కోట్లాదిమంది గుండెల్లో వెలుగుతూనే ఉంది. యువత ఎలా వుండాలి? తమ జీవితాలు ఎలా మల్చుకోవాలి? దేశం కోసం, ప్రజల కోసం ఎలా పని చేయాలి? అన్న దానిపై తన స్వీయ అధ్యయనం, ఆచరణ ద్వారా నేటికీ ఆదర్శప్రాయంగా నిలిచినందుకు సుఖలాలస కోసమే జీవితం కాదు, లక్ష్య సాధనకు అంకితం కావాలని సందేశమిచ్చినందుకు,జలయన్ వాలా బాగ్ లో వందలాది అమాయకుల నెత్తుటి తో తడిసిన మట్టిని తన జేబులో పెట్టుకుని,ఆ ప్రేరణ తో విప్లవ యోధుని గా,తిరుగులేని దేశ భక్తునిగా మారారు. భరత మాత అందరి తల్లి అని,ఆవిడ సంకెళ్ళ తో ఉంటే నాకు పెళ్లి,వేడుకలు వద్దని తిరస్కరించారు.వందేమాతరం, అహింస, సత్యాగ్రహం వంటి మాటలే వినిపిస్తున్న రోజున 'ఇంక్విలాబ్ జిందాబాద్' యువతను స్వతంత్ర ఉద్యమాలు ముందుకు తీసుకెళ్లారు విద్యార్థులను చైతన్యపరిచారని చేసిన సేవ దేశ ప్రజలు మరువలేరని అన్నారు. కర్నాటి మనోహర్ వత్తుల రఘుపతి, రఘుపతి చంద్రన్న రాజు నరసింహ రమేష్, నాయకులకు బుక్కులు అందజేశారు.

## మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం



**జిన్నారం/ పటాన్‌చెరు, మార్చి 23 (నినాదం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఇటీవల ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించడంతో, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి గుమ్మడిదల మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు నవీన్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ములు గోవర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గాల హక్కుల కోసం మందకృష్ణ మాదిగ అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. వర్గీకరణ కోసం చేసిన దీర్ఘకాల పోరాట ఫలితంగా బిల్లు ఆమోదించబడిందని, ఇది వర్గీకరణ కోసం పోరాడుతున్న ప్రజలకు విజయపథంగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కుమార్ గౌడ్, దేవాలయ కమిటీ అధ్యక్షుడు మద్దుల బాలరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు అమ్మగారి సదానంద రెడ్డి, వర్తక సంఘం అధ్యక్షుడు ఆకుల సత్యనారాయణ, యువజన నాయకుడు మంద భాస్కర్ రెడ్డి, అలాగే ఉదయ్ కుమార్, కరుణాకర్, శ్రావణ్ రెడ్డి, బొంతపల్లి సుదర్శన్, సత్యనారాయణ, తుడుం రవి తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ యువవికాస్ పథకాన్ని.. సద్వినియోగం చేసుకోవాలి

- జిన్నారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్డే కృష్ణ



**జిన్నారం/ పటాన్‌చెరు, మార్చి 23 (నినాదం న్యూస్):** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిరుద్యోగ యువత కొరకు చేపట్టిన రాజీవ్ యువ వికాస్ పథకాన్ని అర్హులైన నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని జిన్నారం మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్డే కృష్ణ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఈ పథకం ప్రారంభించారని, రాష్ట్రంలో 5 లక్షల మందికి రూ.6 వేల కోట్ల రాయితీ రుణాలు మంజూరు చేయనున్నారనిన్నారు. ఒక్కో లబ్ధిదారునికి 4 లక్షల వరకు రుణం మంజూరు చేయనున్నారు. 60 నుంచి 80 శాతం వరకు రాయితితో ఈ రుణాలు మంజూరు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక పక్క ఉద్యోగాలు కల్పిస్తున్న, కొంత యువత మాత్రం వారి కుటుంబ పరిస్థితులు బాలేకపోవడంతో చదువుకున్నప్పటికీ నిరుద్యోగులుగా మిగిలిపోయారు. వారి కోసమే రాజీవ్ యువ వికాసం పేరుతో రూ.6000 కోట్లతో తెలంగాణ రాష్ట్రంలోని ఐదు లక్షల మంది యువతకు స్వయం ఉపాధి అవకాశం కల్పించబోతున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ,ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, దామోదర్ రాజనర్సింహ కి తెలంగాణ రాష్ట్ర యువత తరపున వడ్డె కృష్ణ ధన్యవాదాలు తెలిపారు.

## అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా..

- కొలన్ హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్, మార్చి 23 (నినాదం న్యూస్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ 2వ వార్డ్ జి.పి.ఆర్ లేఔట్ లో ప్రజలకు కావలసిన మౌలిక సదుపాలయాలు సరిగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం వార్డ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వీరబాబు గౌడ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వారి సమ్యసలు పై వినతిపత్రం అందజేసి వివరాలు తెలిపారు. సమస్యలు తెలుసుకున్న అనంతరం కొలను హనుమంత రెడ్డి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ తో మాట్లాడి వీలైనంత త్వరలో సీసీ రోడ్లు, డ్రైనేజీ లను స్పెషల్ ఫండ్స్ ద్వారా వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మునిసిపల్



కార్పొరేషన్ అధ్యక్షులు కోలన్ రాజశేఖర్ రెడ్డి ,కోలన్ జీవన్ రెడ్డి ,అంబ రెడ్డి, రాకేష్ రెడ్డి ,కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి

**చేవెళ్ల, మార్చి23(నినాదం న్యూస్):** దేశ స్వాతంత్రం కోసం ఉరికంబాన్ని ముద్దాడిన విప్లవ నిప్పుకణం భగత్ సింగ్ అని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి అరుణ్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం చేవెళ్ల మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అరుణ్ కుమార్ మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం అతి చిన్న వయస్సులో ఉరికంబాన్ని ముద్దాడి దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన గొప్ప వీరుడు భగత్సింగ్ అని అన్నారు భగత్ సింగ్, సుఖ్ దేవ్,రాజగురులను బ్రిటిష్ ప్రభుత్వం దారుణంగా ఉరితీసిందని వారు మరణించిన అనంతరం యువతరం పెద్ద ఎత్తున బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారు ఈ దేశంలోని పేదల బడుగు బలహీనవర్గాల కోసం భగత్ సింగ్ సుగుదేవ్ రాజ గురులు ప్రాణాలు అర్పించారని అన్నారు తాను కలలు కన్నా స్వాతంత్రానికి విరుద్ధంగా ప్రస్తుత సమాజంలో పేదలు మరింత పేదరికంలోకి నెట్టివేయబడ్డారని ధనికులు వందల వేల కోట్లకు పడగలెత్తారని అన్నారు నాణ్యమైన విద్య వైద్యం దొరకక పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారని డబ్బులు ఉంటే తప్ప పేదలు చదువుకునే పరిస్థితి లేదని విద్య వైద్యం అంగడిలో సరుకుగా



మారిందని అన్నారు భగత్ సింగ్ కలలుగన్న సంపూర్ణ స్వరాజ్యం ఇది కాదు అని అన్నారు పేదవాడికి ఉచిత విద్య ,వైద్యం అందించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు అల్లి దేవేందర్, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల మండల అధ్యక్ష కార్యదర్శులు, సమీర్ ,చందు, మొయినాబాద్ మండల అధ్యక్షుడు చరణ్ గౌడ్, తేజ, మురారి, గాయత్రి ,శిరీష, మౌనిక, కవిత, తదితరులు పాల్గొన్నారు.

## కళాకారుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయాలి

- టికెవి వ్యవస్థాపకులు కామల్ల ఐలన్న



**జవహర్‌నగర్, మార్చి 23 (నినాదం న్యూస్):** తెలంగాణలోని కళాకారులకు ప్రత్యేక సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని తెలంగాణ కళాకారుల వేదిక టీకేవి వ్యవస్థాపక అధ్యక్షుడు ఐలన్న పిలుపునిచ్చారు. ఆదివారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉదయం 11 గంటలకు తెలంగాణ కళాకారుల వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎర్రవల్లి శ్రీనివాస్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా కామల్ల ఐలన్న హాజరై మాట్లాడుతూ కళాకారులను రాజకీయ పార్టీలు ఉద్యమ సంస్థలు మోసం చేశాయని. గత ప్రభుత్వం 500 మందికి ఉద్యోగాలు ఇచ్చి మిగతా సబ్బండ కులాల కళాకారులను రోడ్డు పాలు చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి సంవత్సరం దాటుతున్న కళాకారులను పట్టించుకున్న పాపాన పోలేదని దుయ్యబట్టారు. వృత్తిపరమైనటువంటి కళాకారులను ఆదుకొని పెన్షన్ ఏర్పాటు చేయాలని వారి కొరకు సంక్షేమ నిధులు వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించాలని వారిని అభివృద్ధి బాటలో పయనించేటట్లు నడిపించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా కళాకారులు కలిసి ఉద్యమాలు చేస్తారని హెచ్చరించారు. అనంతరం తెలంగాణ కళాకారుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు మోహన్ బై రాగి, ప్రధాన కార్యదర్శి వెంకటాచారి మాట్లాడుతూ కళాకారులు సంఘటిత ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని ప్రభుత్వం వెంటనే కల్చరల్ పాలసీని ప్రకటించాలని అన్ని శాఖలలో కల్చరల్ కోటా ఏర్పరిచి ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాచకొండ రమేష్ ,ఎర్ర మల్లేష్, నలిగంటి శరత్, విష్ణు, కిషోర్, ముఖ్య అతిథులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# చామ దుంపలను తేలిగ్గా తీసిపారేయకండి..

• **వీటితో ఎన్ని లాభాలు ఉంటాయో తెలుసా..**

మనకు అన్ని కాలాల్లోనూ దుంపలు అందుబాటులో ఉంటాయి. వీటిని కొందరు ఉడికించి తింటే కొందరు కూరగా చేసి తింటారు. ఎలా తిన్నా సరే పలు రకాల దుంపలు మనకు ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. దుంపల విషయానికి వస్తే ప్రధానంగా చెప్పుకోదగినవి చామ దుంపలు. ఇవి ఎంతో రుచిగా ఉంటాయి. వీటితో చాలా మంది పులుసు చేస్తుంటారు. టమాటాలు వేసి వండినా కూడా ఇవి రుచిగానే ఉంటాయి. చామ దుంపలను తినడం వల్ల మనకు అనేక పోషకాలు లభిస్తాయి. అనేక ఆరోగ్య ప్రయోజనాలను ఇవి అందిస్తాయి. చామ దుంపలు జిగురుగా ఉంటాయని కొందరు వీటిని తినరు. కానీ వీటిని తినకపోతే అనేక ప్రయోజనాలను కోల్పోతారు. చామ దుంపలను 100 గ్రాములు తింటే120 క్యాలరీల శక్తి లభిస్తుంది.

**బరువు తగ్గుతారు..**

కానీ ఈ దుంపల్లో పీచు పదార్థం అధికంగా ఉంటుంది. కనుక అన్ని క్యాలరీలు లభించినప్పటికీ వెంటనే అవి మనకు అందవు. ఆలస్యంగా రక్తంలో కలుస్తాయి. కనుక షుగర్ ఉన్నవారు కూడా ఈ నిర్భయంగా ఈ దుంపలను తినవచ్చు. పైగా ఈ దుంపలను తింటే షుగర్ లెవల్స్‌ను తగ్గించుకోవచ్చు. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. చామ దుంపల్లో అధికంగా ఉండే ఫైబర్ ఎక్కువ సేపు ఉన్నా కడుపు నిండిన భావనను కలిగిస్తుంది. దీంతో ఆహారం తినరు. జంక్ ఫుడ్ జోలికి వెళ్లరు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. చామ దుంపలను ఆహారంలో భాగం చేసుకుంటే బరువును సులభంగా తగ్గించుకోవచ్చు. ఈ దుంపలను తినడం వల్ల పొటాషియం అధికంగా లభిస్తుంది. ఇది రక్త ప్రసరణను పెంచుతుంది. దీంతో బీపీ నియంత్రణలో ఉంటుంది. హైబీపీ ఉన్నవారికి చామ దుంపలు ఎంతో మేలు చేస్తాయి.

**హార్ట్ ఎటాక్ రాకుండా..**

ఇతర దుంపల మాదిరిగానే చామ దుంపల్లోనూ ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. కనుక నాన్ వెజ్ తినలేని వారికి ఇవి మంచి ప్రత్యామ్నాయం అని చెప్పవచ్చు. ఈ దుంపలను తింటే ప్రోటీన్లు లభించి శరీరానికి శక్తి అందుతుంది. కండరాలు నిర్మాణం అవుతాయి. చామ దుంపల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. గుండె పోటు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. చామ దుంపలను తింటే రక్త నాళాల్లో కొవ్వు పేరుకుపోకుండా అడ్డుకోవచ్చు. ఇది హార్ట్ ఎటాక్ రాకుండా కాపాడుతుంది. చామ దుంపల్లో విటమిన్ ఇ అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తిని పెంచడమే కాకుండా చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. చామ దుంపలను తింటే పురుషుల్లో లైంగిక సామర్థ్యం పెరుగుతుంది. దీంతో శృంగారంలో చురుగ్గా పాల్గొంటారు. ఈ దుంపలు నపుంసకత్వాన్ని పోగొడతాయి.

**స్త్రీలకు మేలు చేస్తాయి..**

చామ దుంపల్లో ఉండే సమ్మేళనాలు స్త్రీలకు ఎంతో మేలు చేస్తాయి. రుతుక్రమం సరిగ్గా వచ్చేలా చేస్తాయి. దీంతో స్త్రీలలో రుతు సమస్యలు ఉండవు. చామ దుంపలను ఆహారంలో భాగం చేసుకుంటే ఇందులోని పీచు జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం అయ్యేలా చేస్తుంది. మలబద్దకాన్ని తగ్గిస్తుంది. గ్యాస్, అసిడిటీ సమస్యలు తగ్గిపోతాయి. ఇలా చామ దుంపలను తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. అయితే అలర్జీలు ఉన్నవారు చామ దుంపలకు దూరంగా ఉండాలి. వీటిని తింటే అలర్జీలు వచ్చే అవకాశం ఉంటుంది కాబట్టి వారు వీటికి దూరంగా ఉంటే మంచిది.



# ఆల్‌బుఖరా పండ్లతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు

మార్కెట్‌లో మనకు రకరకాల పండ్లు దర్శనం ఇస్తుంటాయి. వాటిల్లో ఆల్‌బుఖరా పండ్లు కూడా ఒకటి. ఇవి చూసేందుకు ఎరుపు రంగులో ఎంతో ఆకర్షణీయంగా ఉంటాయి. టేస్ట్ కూడా పుల్లగా భలేగా ఉంటుంది. ఈ పండ్లను చాలా మంది ఇష్టంగా తింటుంటారు. ఆల్‌బుఖరా పండ్లు చూసేందుకు ఆకర్షణీయంగా కనిపించడమే కాదు, అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తాయి. ఈ పండ్లను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక పోషకాలను పొందవచ్చు. పలు వ్యాధులను నయం చేసుకోవచ్చు. ఆల్‌బుఖరా పండ్లను చూడగానే చాలా మందికి నోరూరిపోతుంది. వీటిని చాలా మంది అంతగా పట్టించుకోరు. కానీ ఈ పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.



**షుగర్ లెవల్స్‌కు చెక్..**

ఆల్‌బుఖరా పండ్లలో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. కనుక బరువు తగ్గాలనుకునే వారికి ఈ పండ్లు ఎంతో మేలు చేస్తాయి. ఈ పండ్లను తింటే కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయపడుతుంది. సాధారణంగా ఇతర పండ్లను తింటే రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. కానీ ఆల్‌బుఖరా పండ్లను తింటే మాత్రం రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గుతాయి. కనుక డయాబెటిస్ ఉన్నవారికి ఈ పండ్లు ఎంతో మేలు చేస్తాయి. ఈ పండ్లను తింటే షుగర్ లెవల్స్‌ను తగ్గించుకోవచ్చు. ఆల్‌బుఖరా పండ్ల గ్లైసీమిక్ ఇండెక్స్ విలువ చాలా తక్కువ. కనుక డయాబెటిస్ ఉన్నవారికి ఈ పండ్లు ఎంతో ఉపయోగపడతాయి.

**జ్వరం తగ్గుతుంది..**

ఆల్‌బుఖరా పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. దీంతో శరీరం వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతుంది. దగ్గు, జలుబు, జ్వరం తగ్గుతాయి. జ్వరం వచ్చిన వారు ఈ పండ్లను తింటే త్వరగా కోలుకుంటారు. ఆహారం తినాలన్న ఆసక్తి పెరుగుతుంది. రుచి లేకపోవడం తగ్గుతుంది. ఆకలి పెరుగుతుంది. ఈ పండ్లను తింటే ఇన్‌ఫెక్షన్లు సైతం తగ్గిపోతాయి. ఆల్‌బుఖరా పండ్లు మనకు డ్రై ఫ్రూట్స్ రూపంలోనూ అందుబాటులో ఉన్నాయి. వీటిని ఎప్పుడంటే అప్పుడు తినవచ్చు. ఈ పండ్లలో ప్రో సైయానిడిన్, నియోక్లోరోజెనిక్ యాసిడ్, క్వెర్‌సెటిన్ తదితర ఫినోలిక్ సమ్మేళనాలు అధికంగా ఉంటాయి. ఇవి వాపులను, నొప్పులను తగ్గిస్తాయి. కనుక ఒళ్లు నొప్పులు లేదా కీళ్లు, మోకాళ్ల నొప్పులు ఉన్నవారు ఈ పండ్లను తింటే ఉపశమనం పొందవచ్చు.

**రక్తహీనత తగ్గుతుంది..**

ఆల్‌బుఖరా పండ్లను తినడం వల్ల ఫ్రీ ర్యాడికల్స్ నిర్మూలించబడతాయి. దీంతో కణాలు దెబ్బ తినకుండా ఉంటాయి. క్యాన్సర్ వంటి వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. ఈ పండ్లలో ఉండే ఫినోలిక్ సమ్మేళనాలు అనేక వ్యాధులను నయం చేస్తాయి. ఆల్‌బుఖరా పండ్లను కేవలం జ్వరం వచ్చినప్పుడు మాత్రమే కాదు, ఇతర సమయాల్లోనూ తినవచ్చు. దీంతో రోగాలు రాకుండా ముందుగానే అడ్డుకోవచ్చు. ఈ పండ్లలో ఐరన్, విటమిన్ ఎ కూడా సమృద్ధిగానే ఉంటాయి. కనుక ఈ పండ్లను తింటే రక్తం తయారవుతుంది. రక్తహీనత తగ్గుతుంది. ఈ పండ్లలో ఉండే విటమిన్ ఎ రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. కంటి చూపును మెరుగు పరుస్తుంది. ఇలా ఆల్‌బుఖరా పండ్లను తినడం వల్ల అనేక అద్భుతమైన ప్రయోజనాలను పొందవచ్చు. కనుక ఈ పండ్లు మీకు కనిపిస్తే విడిచిపెట్టకుండా తెచ్చుకుని తినండి.

నినాదం అవని 10

# నలుపు రంగు క్యారెట్లను తింటే లాభాలు ఎన్నో..

క్యారెట్లు.. ఈ పేరు చెప్పగానే సహజంగానే చాలా మందికి నారింజ రంగులో ఉండే క్యారెట్లే గుర్తుకు వస్తాయి. కానీ క్యారెట్లలోనూ అనేక వెరైటీలు ఉంటాయి. ముఖ్యంగా మనకు నలుపు రంగులో ఉండే క్యారెట్లు కూడా లభిస్తున్నాయి. ఈ క్యారెట్లలోనూ పోషకాలు అధికంగానే ఉంటాయి. వీటి రంగు కారణంగా ఈ క్యారెట్లను తినేందుకు చాలా మంది అంతగా ఇష్టపడరు. కానీ పోషక విలువలు మాత్రం సాధారణ క్యారెట్ కన్నా నల్ల రంగు క్యారెట్లోనే అధికంగా ఉంటాయి. నలుపు రంగు క్యారెట్లను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. నలుపు రంగు క్యారెట్లలో విటమిన్ ఎ అధికంగా ఉంటుంది. ఇది కంటి చూపును మెరుగు పరుస్తుంది. వయస్సు మీద పడడం వల్ల కళ్లలో వచ్చే శుక్లాలను రాకుండా అడ్డుకుంటుంది.

**రోగ నిరోధక శక్తికి..**

నలుపు రంగు క్యారెట్లలో ఉండే విటమిన్ ఎ రోగ నిరోధక శక్తిని సైతం పెంచుతుంది. చర్మాన్ని, శిరోజాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. చర్మ సమస్యలు లేదా జుట్టు సమస్యలు ఉన్నవారు నలుపు రంగు క్యారెట్లను తింటుంటే ఎంతో మేలు జరుగుతుంది. ఈ క్యారెట్లలో విటమిన్ కె సమృద్ధిగా ఉంటుంది. ఇది ఎముకలను ఆరోగ్యంగా, దృఢంగా ఉంచుతుంది. అలాగే గాయాలు అయినప్పుడు రక్తం త్వరగా గడ్డకట్టేలా చేస్తుంది. దీంతో తీవ్ర రక్త స్రావం సమస్య నుంచి బయట పడవచ్చు. నలుపు రంగు క్యారెట్లలో పొటాషియం ఎక్కువగానే ఉంటుంది. ఇది రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో బీపీ తగ్గుతుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది.



**మలబద్దకం సమస్యకు..**

నలుపు రంగు క్యారెట్లలో ఉండే ఫైబర్ సుఖ విరేచనం అయ్యేలా చేస్తుంది. దీంతో మలబద్దకం నుంచి ఉపశమనం లభిస్తుంది. ఈ క్యారెట్లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా వీటిల్లో ఉండే ఆంథో సయనిన్స్ గుండె జబ్బులు, (స్ట్రోక్స్) రాకుండా రక్షిస్తాయి. ఈ క్యారెట్లలో ఉండే బీటా కెరోటిన్ కంటి చూపును మెరుగు పరుస్తుంది. ఈ క్యారెట్లను తినడం వల్ల బీపీ నియంత్రణలో ఉంటుంది. కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. గుండె జబ్బులు వచ్చే అవకాశాలు గణనీయంగా తగ్గుతాయి. ఈ క్యారెట్లలో ఉండే ఫైబర్ షుగర్ ఉన్నవారికి ఎంతో మేలు చేస్తుంది. డయాబెటిస్ ఉన్నవారు నలుపు రంగు క్యారెట్లను తింటుంటే షుగర్ లెవల్స్‌ను అదుపులో ఉంచుకోవచ్చు.

**మెదడు పనితీరుకు..**

ఈ క్యారెట్లను తింటే రోగ నిరోధక శక్తి సైతం పెరుగుతుంది. దగ్గు, జలుబు వంటి శ్వాసకోశ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. గొంతు, ఊపిరితిత్తుల్లో ఉండే కఫం కరిగిపోతుంది. మెదడు ఆరోగ్యానికి నలుపు రంగు క్యారెట్లు ఎంతో మేలు చేస్తాయి. వీటిన తింటే మెదడు యాక్టివ్ గా పనిచేస్తుంది. చురుగ్గా ఉంటారు. బద్దకం పోతుంది. నలుపు రంగు క్యారెట్ల ద్వారా ప్రయోజనాలు పొందాలంటే వీటిని నేరుగా పచ్చిగానే తినాల్సి ఉంటుంది. దీంతో పోషకాలు కూడా అధికంగా లభిస్తాయి. ఈ క్యారెట్లతోనూ కూరలు చేసుకోవచ్చు. ఇలా నలుపు రంగు క్యారెట్ల వల్ల ఎన్నో లాభాలను పొందవచ్చు.

నినాదం మార్కెట్

NINADAM MARKET

# స్మార్ట్ పెన్షన్ ప్లాన్ ప్రకటించిన ఎల్ఐసీ

భారతదేశంలో జీవిత బీమా అంటే టక్కున గుర్తు వచ్చేది లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ). దేశంలో జీవిత బీమాకు పర్యాయపదంగా ఎల్ఐసీ ఉందంటే అతిశయోక్తి కాదు. అయితే ఇటీవల కాలంలో చాలా జీవితబీమా కంపెనీలు ఎల్ఐసీకు గట్టి పోటీనిస్తున్నాయి. ముఖ్యంగా పెన్షన్ ప్లాన్స్ విషయంలో ఈ పోటీ మరీ ఎక్కువగా ఉండడంతో ఎల్ఐసీ గత నెలలో స్మార్ట్ పెన్షన్ ప్లాన్‌ను ప్రకటించింది. ఎల్ఐసీ ప్రకటించిన తాజా పెన్షన్ ప్లాన్ గురించి మరిన్ని వివరాలను తెలుసుకుందాం. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) ఈ సంవత్సరం ఫిబ్రవరిలో ఎల్ఐసీ స్మార్ట్ పెన్షన్ ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. పొదుపు, తక్షణ యాన్యుటీ ప్లాన్‌ల కోసం నాన్-పార్, నాన్-లింక్డ్ ప్లాన్‌గా పిలువబడే ఇది అనేక రకాల యాన్యుటీ ఎంపికలు ఈ ప్లాన్ ద్వారా పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఎల్ఐసీ స్మార్ట్ పెన్షన్ ప్లాన్ మల్టీ యాన్యుటీ ఎంపికలతో పాటు ఏకమొత్తం మరణ ప్రయోజనాలతో పాటు వాయిదాల రూపంలో కూడా పొందే అవకాశాన్ని కల్పిస్తుంది. అదనపు ప్రయోజనాలతో ఎల్ఐసీ స్మార్ట్ పెన్షన్ గురించి మరిన్ని వివరాలపై ఓ లుక్కేద్దాం.

**స్మార్ట్ పెన్షన్ ప్లాన్ అంటే?**

వ్యక్తులు, గ్రూప్స్ రెండింటికీ యాన్యుటీ పరిష్కారాలను అందించే నాన్-పార్టిసిపేటింగ్, నాన్-లింక్డ్ సేవింగ్స్ ప్లాన్.

**అర్హత..** 18 నుంచి 100 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న ఎవరైనా యాన్యుటీ ఎంపిక ఆధారంగా స్మార్ట్ పెన్షన్ ప్లాన్‌ను కొనుగోలు చేయవచ్చు.

**కనీస మొత్తం**

- నెలకు రూ. 1,000
- త్రైమాసికానికి రూ. 3,000
- అర్ధ సంవత్సరానికి రూ. 6,000
- సంవత్సరానికి రూ. 12,000

**రుణ సదుపాయం**

పాలసీ జారీ చేసిన మూడు నెలల తర్వాత లేదా ఫ్రీ-లాక్ వ్యవధి పూర్తయిన తర్వాత రుణాలు పొందవచ్చు. పాలసీ కింద మంజూరు చేసే గరిష్ఠ రుణ మొత్తం, రుణంపై చెల్లించాల్సిన ప్రభావవంతమైన వార్షిక వడ్డీ మొత్తం పాలసీ కింద చెల్లించాల్సిన వార్షిక యాన్యుటీ మొత్తంలో 50 శాతానికి మించకూడదు.

**ఎన్‌పీఎస్ చందాదారులకు నిబంధనలు..** జాతీయ పెన్షన్ వ్యవస్థకు సభ్యత్వం పొందినవారు తక్షణ యాన్యుటీని పొందవచ్చు. ఇది పదవీ విరమణ ఆదాయానికి సజావుగా మారడానికి వీలు కల్పిస్తుంది.




**వైకల్యం ఉన్న వారికి ప్రయోజనాలు..**

ఈ పథకాన్ని దివ్యాంగుల ప్రయోజనం కోసం నామినీ/యాన్యుటెంట్‌గా కొనుగోలు చేయవచ్చు. యాన్యుటెంట్ (ప్రతిపాదకుడు) మరణిస్తే, నామినీగా ఉన్న దివ్యాంగుల జీవితంలో తక్షణ యాన్యుటీని కొనుగోలు చేయడానికి మరణ ప్రయోజనాన్ని తప్పనిసరిగా ఉపయోగించుకోవాలి.

**దరఖాస్తు ఇలా..** ఎల్ఐసీ స్మార్ట్ పెన్షన్ ప్లాన్‌ను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండింటిలోనూ కొనుగోలు చేయవచ్చు. ఎల్ఐసీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా నేరుగా ఆన్‌లైన్‌లో కొనుగోలు చేయవచ్చు. అయితే ఆఫ్‌లైన్ కొనుగోళ్లను ఎల్ఐసీ ఏజెంట్లు, మధ్యవర్తులు, పాయింట్ ఆఫ్ సేల్స్ పర్సన్స్, లైఫ్ ఇన్సూరెన్స్ కార్యాలయాలు, కామన్ పబ్లిక్ సర్వీస్ సెంటర్స్ ద్వారా చేయవచ్చు.

# ఎందు'లోనూ' తీసుకోకపోతే నో క్రెడిట్ స్కోర్

ప్రస్తుత రోజుల్లో పెరిగిన ఖర్చులు, అవసరాల నేపథ్యంలో అప్పు తీసుకోవడం సర్వ సాధారణమైంది. అయితే చాలా మంది అప్పుల కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించే బదులు బ్యాంకుల్లో అప్పు తీసుకోవడానికి ఇష్టపడుతున్నారు. ఈ నేపథ్యంలో బ్యాంకులు రుణం మంజూరు చేయాలంటే కచ్చితంగా క్రెడిట్ స్కోర్‌ను ప్రామాణికంగా తీసుకుంటుంది. అయితే ఇప్పటివరకు ఏ బ్యాంకులోనూ రుణం తీసుకోని వారికి క్రెడిట్ స్కోర్ ఉండదు. ఇలాంటి వారు రుణం తీసుకోవడం కష్టం అవుతుంది. ఈ నేపథ్యంలో బలమైన క్రెడిట్ స్కోర్ సృష్టించుకోవాలో? ఓసారి తెలుసుకుందాం. క్రెడిట్ స్కోర్ అనేది వ్యక్తికి సంబంధించిన క్రెడిట్ అర్హతను ప్రతిబింబించే మూడు అంకెల సంఖ్య, ఇది సకాలంలో క్రెడిట్ తిరిగి చెల్లించే అవకాశాన్ని సూచిస్తుంది. 300 నుంచి 900 వరకు ఈ స్కోర్ ఉంటుంది. అధిక స్కోరు బలమైన క్రెడిట్ ప్రొఫైల్‌ను సూచిస్తుంది. అధిక స్కోరుతో వ్యక్తులు తక్కువ వడ్డీ రేట్లతో అనుకూలమైన నిబంధనలపై రుణాలను పొందే అవకాశం ఉంటుంది. ఎందుకంటే ఇది మంచి క్రెడిట్ ప్రవర్తనతో పాటు బాధ్యతాయుతమైన ఆర్థిక నిర్వహణను ప్రదర్శిస్తుంది. ఈ స్కోరు ఒక వ్యక్తికి సంబంధించిన క్రెడిట్ సమాచారం మొత్తం విస్తృతమైన విశ్లేషణ ద్వారా బలమైన డేటా, మరియు అల్గారిథమ్‌లను ఉపయోగించి రూపొందిస్తారు. భారతదేశంలో వ్యక్తుల క్రెడిట్ స్కోర్‌ను అందించడానికి ట్రాన్స్‌యూనియన్ సిబిల్, ఎక్స్‌పీరియన్, ఈక్విఫ్యాక్స్, సీఆర్ఐఎఫ్ హై మార్క్‌లకు అనుమతి ఉంది.

**క్రెడిట్ స్కోర్ మెరుగుపర్చుకోవడం ఇలా**

క్రెడిట్ హిస్టరీ లేని వ్యక్తులకు స్థిర డిపాజిట్ లేదా చిన్న రుణం




పూచీకత్తుగా అవసరమయ్యే సెక్యూర్డ్ క్రెడిట్ కార్డు ద్వారా బలమైన క్రెడిట్ స్కోర్ పొందవచ్చు. తక్కువ నిల్వలను నిర్వహించడంతో సకాలంలో తిరిగి చెల్లింపులు చేయడం ద్వారా బాధ్యతాయుతంగా ఉపయోగించినప్పుడు ఇవి సానుకూల క్రెడిట్‌ను స్థాపించడంలో సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు.

నిరంతర ఆర్థిక క్రమశిక్షణ ద్వారా తక్కువ క్రెడిట్ స్కోర్‌ను మెరుగుపరచడం సాధ్యమేనని నిపుణులు చెబుతున్నా. తక్కువ స్కోరుకు మూలకారణాన్ని గుర్తించడం మొదటి దశ అని, మిస్డ్ పేమెంట్స్, గతంలో జరిగిన డిఫాల్ట్‌ల వల్ల క్రెడిట్ హిస్టరీ తగ్గుతుంది. అనంతరం తిరిగి చెల్లింపు ప్రవర్తనను మెరుగుపరచడం, బకాయి ఉన్న మొత్తాలను తగ్గించడంతో అధిక క్రెడిట్ వినియోగాన్ని నివారించడం అనేవి కీలక దశలుగా ఉంటాయి. ఇలా చేయడం ద్వారా క్రెడిట్ హిస్టరీ పెరుగుతుంది.

**క్రెడిట్ నివేదికలను పర్యవేక్షించడం**

క్రెడిట్ హిస్టరీ పురోగతిని పర్యవేక్షించడానికి ఏవైనా వ్యత్యాసాలు లేదా అనధికార కార్యకలాపాలను గుర్తించి సరిదిద్దడానికి క్రెడిట్ నివేదికలను క్రమం తప్పకుండా సమీక్షించడం కూడా అంతే ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. స్థిరమైన ప్రయత్నం, సమాచారంతో కూడిన ఆర్థిక పద్ధతులతో, వ్యక్తులు బలమైన క్రెడిట్ ప్రొఫైల్‌ను నిర్మించుకోవచ్చు. అలాగే అధికారిక క్రెడిట్‌కు వారి ప్రాప్యతను పెంచుకోవచ్చు.

**క్రెడిట్ స్కోర్‌ను ప్రభావితం చేసే ముఖ్య అంశాలు**

రుణం, క్రెడిట్ కార్డ్ చెల్లింపులను సకాలంలో చేయడం అత్యంత ముఖ్యమైన అంశం. ఎందుకంటే ఆలస్యం లేదా తప్పిపోయిన చెల్లింపులు ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి.

గృహ లేదా ఆటో లోన్, క్రెడిట్ కార్డ్ వంటి సెక్యూర్డ్, అన్‌సెక్యూర్డ్ రుణాల సమతుల్య మిశ్రమాన్ని నిర్వహించడం వల్ల వివిధ రకాల రుణాలను బాధ్యతాయుతంగా నిర్వహించగలరని, తెలివైన ఆర్థిక ఎంపికలు చేసుకోవచ్చు.

దీర్ఘకాలిక క్రెడిట్ హిస్టరీ రుణదాతలతో నమ్మకాన్ని పెంపొందిస్తుంది. అయితే తరచుగా తక్కువ వ్యవధిలో కొత్త క్రెడిట్ తీసుకోవడం సమస్యలను కలిగిస్తుంది. అలాగే స్కోరును ప్రభావితం చేస్తుంది.

## ముందస్తు పన్ను చెల్లింపులకు ముగిసిన గడువు..

**- జరిమానా బాదుడు తప్పదంతే..!**




భారతదేశంలోని పౌరులు నిర్ణీత ఆదాయం దాటాక ఆదాయపు పన్ను చెల్లించడం తప్పనిసరి. అయితే కొంత మంది వ్యాపారస్తులు తమ వ్యాపార టర్నోవర్‌కు అనుగుణంగా ముందస్తు పన్ను చెల్లింపులు చేస్తూ ఉంటారు. కానీ ముందస్తు పన్ను చెల్లింపు గడువు మార్చి 15, 2025తో ముగిసింది. ముందస్తు పన్ను గడువు ముగియడంతో పన్ను చెల్లింపుదారులు జరిమానాలు చెల్లించాల్సి ఉంటుంది. ముందస్తు పన్ను అనేది పన్ను చెల్లింపుదారులు తమ ప్రస్తుత ఆదాయాన్ని అంచనా వేసి వారి పన్ను బాధ్యత ఒక నిర్దిష్ట పరిమితిని మించి ఉంటే ఆర్థిక సంవత్సరం అంతటా వాయిదాల రూపంలో పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ముందస్తు పన్ను గడువును పన్ను చెల్లింపుదారులు దాటితే తక్కువ చెల్లింపు లేదా గడువు తేదీలోపు ముందస్తు పన్ను వాయిదాలను చెల్లించకపోతే సెక్షన్ 234సీ కింద నెలకు 1 శాతం సాధారణ వడ్డీని చెల్లించాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అదనంగా పన్ను చెల్లింపుదారుడు ఆర్థిక సంవత్సరం చివరి నాటికి (అంటే మార్చి 31) మొత్తం పన్ను బాధ్యతలో కనీసం 90 శాతం చెల్లించడంలో విఫలమైతే వారు సెక్షన్ 234బీ కింద నెలకు మరో 1 శాతం లేదా నెలలో కొంత భాగాన్ని సాధారణ వడ్డీగా చెల్లించాల్సి ఉంటుందని చెబుతున్నారు.

**జరిమానా బాదుడు నుంచి రక్షణ ఇలా**

సెక్షన్ 234బీ, 234 సీ కింద వడ్డీని తగ్గించడానికి పన్ను చెల్లింపుదారులు ఏదైనా బకాయి ఉన్న పన్నును వీలైనంత త్వరగా చెల్లించాలని నిపుణులు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో పన్ను అధికారుల ఆమోదానికి లోబడి చెల్లుబాటు అయ్యే, సహేతుకమైన కారణం ఉంటే వారు వడ్డీ మాఫీ కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంటున్నారు. మార్చి 31, 2025 కి ముందు ఒకేసారి ఒకేసారి చెల్లించడం వల్ల సెక్షన్ 234బీ కింద వడ్డీని నివారించవచ్చని పేర్కొంటున్నారు. ఇలా చేస్తే ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు మొత్తం పన్ను బాధ్యతలో 90 శాతం చెల్లించినట్లే అని పేర్కొంటున్నారు. అయితే మిస్డ్ పేమెంట్ వాయిదా, వాస్తవ చెల్లింపు తేదీ మధ్య కాలానికి వడ్డీ ఇప్పటికీ వర్తిస్తుంది. పన్ను చెల్లింపుదారులు ముందస్తు పన్ను గడువును కోల్పోతే వారు సెక్షన్ 234 బీ, 234సీ కింద వడ్డీని పూర్తిగా తప్పించుకోలేరు. కానీ కొన్ని టిప్స్ తీసుకుంటే బాధ్యతను తగ్గించడంలో సహాయపడతాయి. మార్చి 31 తర్వాత సెక్షన్ 234బీ కింద వడ్డీ నెలకు 1 శాతం లేదా దానిలో కొంత భాగాన్ని వసూలు చేస్తారు. కాబట్టి బకాయి ఉన్న పన్ను మొత్తాన్ని వెంటనే చెల్లించడం వల్ల వడ్డీ బాధ్యతను తగ్గించవచ్చు. ఆదాయపు పన్ను రిటర్న్ (ఐటీఆర్) దాఖలు చేయడానికి ముందు సెక్షన్ 140ఏ కింద స్వీయ-అంచనా పన్ను చెల్లించడం వల్ల సెక్షన్ 234బీ కింద వడ్డీని మరింత పరిమితం చేయవచ్చు. సరైన టీడీఎస్ తగ్గింపులు భవిష్యత్తు ముందస్తు పన్ను వాయిదాలను సకాలంలో చెల్లించడం వల్ల సెక్షన్లు 234బీ, 234సీ కింద భవిష్యత్తులో వడ్డీని నివారించవచ్చు. సెక్షన్లు 234బీ, 234సీ కింద వడ్డీ తప్పనిసరి అయినప్పటికీ సహేతుకమైన కారణం ఉన్న సందర్భాల్లో పన్ను చెల్లింపుదారులు సెక్షన్ 119(2)(ఏ) కింద అసెస్సింగ్ ఆఫీసర్ (ఏఓ)కి వడ్డీ మాఫీ లేదా తగ్గింపు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

## ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరి ప్రీతమ్ జన్మదిన వేడుకలు



**పెద్దపల్లి రూరల్ మార్చి 23(నినాదం):** పెద్దపల్లిలోని స్ఫూర్తి మానసిక వికలాంగుల ఆశ్రమంలో టీ.పీ.సీ.సీ, ఎస్సీసెల్ కన్వీనర్ పెర్క సంతోష్ ఆధ్వర్యంలో తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం కే.క్ కట్ చేసి,వికలాంగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐ.ఎన్.టి.యు.సి,జిల్లా ఉపాధ్యక్షులు మేకల సతీష్,బీసీ సంఘం మండల అధ్యక్షులు కలవేన రవి,కలవేన ఓదెలు,జోగు రాజయ్య ,సది తదితరులు పాల్గొన్నారు.

## ఫొటోగ్రాఫర్లకు ఆర్థిక చేయూత



**గోదావరిఖని మార్చి 23 (నినాదం న్యూస్):** గోదావరిఖని పట్టణ ఫోటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు మూడు నెలల క్రితం అనారోగ్యంతో బాధపడుతున్న చిలుముల వేణు, ప్రమాదానికి గురైన మంద రవికుమార్ లకు తెలంగాణ రాష్ట్ర ఫోటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం సహకారంతో పెద్దపల్లి జిల్లా ఫోటో వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గోదావరిఖని ఫోటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ సమక్షంలో స్థానిక ఫోటో భవన్ లో ఇరువురికి చెరో 5000/- రూపాయల చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆర్థిక సహాయానికి సహకరించిన పెద్దపల్లి జిల్లా,తెలంగాణ రాష్ట్ర ఫోటో వీడియో గ్రాఫర్ సంక్షేమ సంఘానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పోగుల విజయ్ కుమార్ , రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లెర్ల ఉదయ్ గౌడ్, ,జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఇర్ఫాన్, కుటుంబ భరోసా ఇంచార్జ్ గుబ్బాల సుబ్రహ్మణ్యం,గోదావరిఖని అసోసియేషన్ అధ్యక్షులు రెడ్డి భాస్కర్, ప్రధాన కార్యదర్శి శనిగరపు మల్లేష్,కోశాధికారి బండారి ప్రసాద్, రెడ్డి శ్యాం ప్రసాద్, గజ్జల కృష్ణ, కొత్తూరు సదయ్య గౌడ్, , చుక్క సాయి ప్రదీప్, కప్పల మహేష్. మోర విక్రం తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

- చిన్నకల్వల సింగిల్ విండో అభివృద్ధికి కృషి చేస్తా
- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు



**సుల్తానాబాద్, మార్చి 23 (నినాదం న్యూస్):** రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్ర భుత్వం పెద్దపీట వేస్తుందని, చిన్నకల్వల సింగిల్ విండో అభివృద్ధికి కృషి చేస్తానని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు హామీ ఇచ్చారు. సుల్తానాబాద్ మండలంలోని చిన్న కల్వల ప్రాథమిక వ్యవసా య సహ కార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 130 వ మహాజనసభ కార్యక్రమంలో ముఖ్య అతి థిగా హాజరై,మాట్లాడుతూ,రూ.2 లక్షల లోపు రుణమాఫీ చేసి దేశానికే రాష్ట్రం ఆదర్శంగా నిలి చిందన్నారు. సన్నవడ్ల కు రూ.5 వందల బోనస్ చెల్లించి రైతాంగాన్ని ఆదుకుంటుందన్నారు. రైతు భరోసా కింద రైతులకు నగదు సహాయాన్ని కూడా పెంచడం జరిగిందని చెప్పారు. ఇటీవల కురిసిన వడగళ్ల వానకు నష్టపోయిన రైతులను ఆదుకుం టామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం లోని పెద్దలు అక్రమ అర్జనకే అధిక ప్రాధాన్యత ఇ చ్చి రైతులను, ప్రజా సంక్షేమాన్ని విస్మరించారని ఎమ్మెల్యే అన్నారు. ఎన్నికల ముందు తాము ప్ర జలకు ఇచ్చిన అన్ని హామీలను దశలవారీగా నె రవేర్చుకుంటూ వస్తున్నామని చెప్పారు. చిన్నక ల్వల సొసైటీ రైతులకు సేవలు అందించడంలో ముందుం టుందని, ఇతర సొసైటీలకు ఆదర్శంగా చైర్మన్, పాలకవర్గం, అధికా రులు సిబ్బంది సేవలు అభినందనీయమని ఎమ్మెల్యేఅన్నారు. అనంత రం సొసైటీ పరిధిలోని రైతులకు రూ. 18 లక్షల దీర్ఘకాలిక రుణాలను ఆయన పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దేవరనేని మోహన్ రావు, మార్కెట్ చైర్మన్ ప్రకాష్ రావు, సీఈవో వి. రమేష్, ఏరుకొండ తిరుపతి, డైరెక్టర్లు అన్నమనేని మాధవరావు, సాయిరి మహేందర్, అన్నమనేని కొండలరావు సాగర్ రావు, దేవేందర్ రావు, ఏరుకొండ రమేష్, తిరుపతి, సుగుణాకర్ రావు, భూషణవేణి రాజా గౌడ్ తో పాటు సంఘం కమిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పలువురు పాల్గొన్నారు

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**మంథని మార్చి 23 ( నినాదం న్యూస్):** మంథని రోషిణీ డిగ్రీ కళాశాలలో 2007- 2010 విద్యా సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని చేపట్టారు. తమకు చదువు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ సంధర్బంగా వక్తలు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## పట్టు తప్పితే ప్రమాదమే



**మంచిర్యాల ప్రతినిధి మార్చి 23(నినాదం న్యూస్):** ఎక్కువ మొత్తంలో వస్తువులు తరలించాలనే హడావిడిలో కొంతమంది వాహనదారులు ఇలా ప్రమాదకర రీతిలో ప్రయాణం సాగి స్తున్నారు. అందుకు నిదర్శనమే ఈ చిత్రం. మంచిర్యాల జిల్లా కేంద్రంలో రోడ్డులో ఓ ట్రాలీ ఆటోలో పరిమితికి మించి ప్లాస్టిక్ వస్తువులు తరలిస్తున్నారు. వస్తువులపై ఓ వ్యక్తి కూర్చున్నాడు. అకస్మాత్తుగా ఏదైనా వాహనం అడ్డు వచ్చినా, గుంతల్లో కుదుపులకు కింద పడే అవకాశం ఉంది. అంతేకాక తాడు తెగితే ప్రమాదం జరిగే అవకాశం ఉందని వాహనచోదకులు అంటున్నారు. ఈ దృశ్యాన్ని నినాదం కెమెరాలో క్లిక్ మనిపించింది.

## కార్పొరేషన్ సిబ్బంది ఓవరాక్షన్

- ఇంట్లో ఉండగానే గేటుకు తాళం



**మంచిర్యాల ప్రతినిధి, మార్చి 23(నినాదం న్యూస్):** ఇంటి పన్ను కట్టలేదని మంచిర్యాల కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది ఓవరాక్షన్ చేశారు. జిల్లా కేంద్రంలోని 100 ఫీట్ల రోడ్డులో ఓ ఇంటికి శనివారం సాయంత్రం కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది వెళ్లి యజమాని ఇంటి పన్ను చెల్లించాలని పేర్కొన్నారు. వెంటనే యజమాని ఒకరోజు గడువు ఇవ్వాలని కోరారు. దీంతో వారు మహిళలు, పిల్లలు ఇంట్లో ఉండగానే గేటుకు తాళం వేశారు. దీంతో బాధిత యజమాని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత కుటుంబం అని చూడకుండా మాపై దుష్ప్రచారాలాడరని యజమాని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికుల సాయంతో డబ్బులు చెల్లించడంతో వారు తాళం తీసి అక్కడి నుండి వెళ్ళిపోయాడు. అధికారులు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

- నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నాం
- లబ్ధిదారులకు చెక్కులను అందించిన రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్






**గోదావరిఖని మార్చి 23 (నినాదం న్యూస్)** గోదావరిఖని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆధ్వర్యంలో కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని రామగుండం, పాలకుర్తి, అంతర్గాం మండలాలకు సంబంధించిన 148 మంది కళ్యాణ లక్ష్మీ, 23 మంది షాది ముబారక్ సంబంధించిన కోటి 71, 19, 836 విలువైన చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ మాట్లాడుతూ, అన్ని వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఆయన అన్నారు. ఇదే క్రమంలో రామగుండం నియోజకవర్గాన్ని ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికీ ఐదోసారి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశామని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేరు గొప్ప ఊరు దిబ్బ లాగా తయారు చేసిన ఈ ప్రాంతాన్ని సుందరీకరణం చేసే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. ఇదే క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు సూచనలతో కోట్లాది రూపాయల నిధులను వెచ్చించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ప్రధానంగా ప్రభుత్వ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన వారికి ఎప్పటికప్పుడు అందిస్తున్నామన్నారు. ఇదే క్రమంలో గోదావరిఖని పట్టణంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. కొద్ది రోజుల్లోనే వ్యాపార వర్గాలకు అందుబాటులోకి వచ్చే విధంగా నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. ఓవైపు అభివృద్ధికి అడుగులు వేస్తుంటే కాలం చెల్లిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. వారికి ఇప్పటికే ప్రజలు బుద్ధి చెప్పారని, అయినప్పటికీ వారి ధోరణి మార్చుకోవడం లేదని అన్నారు. ప్రధానంగా పట్టణ వ్యాపార కేంద్రాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం ఎమ్మార్వో కుమారస్వామి, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అకాల వర్షం...అపార నష్టం

- పంట నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకోవాలి
- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దపల్లి అసెంబ్లీ ఇంచార్జ్
- దుగ్యాల ప్రదీప్‌కుమార్



**పెద్దపల్లి, మార్చి 23(నినాదం న్యూస్):** గత రెండు రోజుల క్రితం,ఆకస్మాత్తుగా కురిసిన వడగండ్ల వానకు పెద్దపల్లి అసెంబ్లీ పరిధి లోని జూలపల్లి,పెద్దపల్లి, ఎలిగేడు, సుల్తానాబాద్, ఓదెల,కాల్వ శ్రీరాంపూర్, వివిధ మండలాలలో మొక్కజొన్న మరియు వరి పంట పూర్తిగా దెబ్బతిని రైతులకు తీవ్ర దుఃఖాన్ని మిగిల్చిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దపల్లి అసెంబ్లీ ఇంచార్జ్, దుగ్యాల ప్రదీప్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేల ఎకరాలు మొక్కజొన్న గాలివానకు పూర్తిగా పడిపోయి అక్కరకు రాకుండా పోయిందని అదేవిధంగా రాళ్ల వర్షం పడడంతో వరి పొలాల్లో వరి గొలుసులకు ఒక్క వరి గింజ లేకుండా రాలిపోయిందని,రైతులు ఆరు కాలం కష్టపడి అధికంగా పెట్టుబడి పెట్టి వరి సాగు చేస్తే,పంట చేతికి అందే సమయానికి అనుకోకుండా అకాల వడగండ్ల వాన రావడం వలన పూర్తిగా పంట నష్టపోయి,దిక్కుతోచని స్థితిలో రైతాంగం ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ వడగండ్ల వాన వల్ల నష్టపోయిన రైతులకు మొక్కజొన్న,మరియు వరికి,ప్రతి ఎకరాకు 50 వేల చొప్పున,ప్రభుత్వం వెంటనే వ్యవసాయ అధికారులతో సర్వే చేయించి నష్టపోయిన ప్రతి రైతుకు ప్రతి గుంట భూమితో సహా మొత్తం పరిశీలన చేయించిన నివేదికల ప్రకారం రైతాంగానికి తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనియెడల రైతుల పక్షాన ప్రభుత్వం మెడలు వంచైనా నష్టపరిహారం ఇచ్చేవరకు పోరాటం చేస్తామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## హిందు, ముస్లింలు సోదర భావంతో పండుగలు జరుపుకోవాలి






- వీహెచ్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు వ్యాల్ల అనసూయ, రాంరెడ్డి

**గోదావరిఖని మార్చి 23 (నినాదం న్యూస్):** పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా వ్యాల్ల హరీష్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా తస్నిమ్ భాను, జాహిద్ పాషా ఆధ్వర్యంలో గోదావరిఖని ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం 500 మంది నిరుపేద ముస్లీం కుటుంబాలకు రంజాన్ తోఫా(నిత్యావసర సరుకుల) పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ రాష్ట్ర మైనార్టీ నాయకులు జమీలుద్దీన్, వ్యాల్ల హరీష్‌రెడ్డి ఫౌండేషన్ అధ్యక్షులు వ్యాల్ల అనసూయ, రాంరెడ్డి, హాజరై నిరుపేద ముస్లీం కుటుంబాలకు రంజాన్ తోఫా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫౌండేష్ వ్యవస్థాపకులు వ్యాల్ల హరీష్‌రెడ్డి మానవతా హృదయంతో నిరుపేద ముస్లీం కుటుంబాల్లో రంజాన్ పండుగ సంతోషంగా జరుపుకోవాలని నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. హిందు, ముస్లీంలు సోదర భావంతో పండుగలు జరుపుకోవడం తెలంగాణ సంస్కృతిగా కొనసాగుతుందన్నారు. భవిష్యత్‌లో నియోజకవర్గ వ్యాప్తంగా వీహెచ్ఆర్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ చేస్తామన్నారు. వీహెచ్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరెన్నో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మున్వర్, సిగిరి రాము, మీర్ ఫయాజ్‌అలీ, హస్సేన్, టిప్పు సుల్తాన్, మొయిన్, పొలాడి శ్రీనివాసరావు, వంశీకృష్ణ, కొండ సురేష్, నర్సింగారావు, కడార్ల శ్రీధర్, అన్ను, బుర్హాన్, అధిక సంఖ్యలో నాయకులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టర్ తరుణ్ పై చర్యలు తీసుకోవాలి

- ప్రభుత్వ మెడికల్ కాలేజీలో పనిచేస్తున్న సిబ్బంది కష్టం గుర్తించాలి
- ఏఐటీయూసీ నగర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల డిమాండ్




**గోదావరిఖని మార్చి 23 (నినాదం న్యూస్) :** ప్రభుత్వ మెడికల్ కాలేజీ లో పని చేసే సిబ్బంది కష్టం గుర్తించి, వారికి తగిన జీతం చెల్లించాలని అలా చెల్లించకుండా కాంట్రాక్టర్ తరుణ్ కార్మికుల కు జీవో ప్రకారం చెల్లించాల్సిన వేతనాలు చెల్లించకుండా చేస్తున్నాడని, అల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఏఐటీయూసీ నగర కమిటీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ కరీం శనిగరపు చంద్ర శేఖర్ లు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గోదావరిఖని లోని మెడికల్ కాలేజీ ప్రిన్స్ పాల్ హిమా బిందు వెంటనే స్పందించి కాలేజీ లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల కు ప్రభుత్వ జీవో ప్రకారం వేతనాలు ఇవ్వకుండా ఆర్థిక శ్రమా దోపిడీ చేస్తూ నెలకు పదకొండు వేలు మాత్రమే ఇస్తున్నారని దానికి సంబంధించిన వివరణ తెలుసుకుని కాంటాక్టర్ పై విచారణ జరిపి అతని సొసైటీ లైసెన్స్ రద్దు చేయాలనీ వారు డిమాండ్ చేసారు. అందులో పనిచేస్తున్న వారికి కనీసం ఈఎస్ఐ సౌకర్యం అయినా కల్పించాలని అన్నారు. కాంట్రాక్టు కార్మికులకు ప్రభుత్వ జీవో ప్రకారం వేతనాలు ఇప్పించి నెలకు నాలుగు సెలవులు పండుగ అడ్వాన్స్, బోనస్ తో పాటు ప్లేడే లు చేస్తే మరొక రోజు రెస్టు అనేది ఇవ్వాలని అలాంటి కొన్ని సదుపాయాలు వాళ్ళు చేసే కష్టాన్ని గుర్తించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి

- గ్రంథాలయ,మార్కెట్ చైర్మన్‌లు అన్నయ్య గౌడ్, ప్రకాష్ రావు
- గౌడ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ తల్లి బోనాలు



**సుల్తానాబాద్,మార్చి 23 (నినాదం న్యూస్):** ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని పెంపొందించుకోవాల ని అని పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ లు అంతటి అన్న య్య గౌడ్,మినుపాల ప్రకాష్ రావు అన్నారు. సుల్తానాబాద్ మండల కేంద్రంలో పోచమ్మ తల్లి బో నాల వేడుకలు గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనం గా నిర్వహిం చారు. ఈ వేడుకలకు సుల్తానాబాద్ గ్రంథాలయ,మార్కెట్ చైర్మన్ లు అంతటి అన్న య్య గౌడ్, మినుపాల ప్రకాష్ రావు ముఖ్య అతిథి లు గాపాల్గొనీ పోచమ్మ తల్లికి పూజలు చేసి ఆశీ ర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా గౌడ సం ఘం ఆధ్వర్యంలో ప్రతి ఇంటి నుండి కుటుంబ స భ్యులతో మహిళలు బోనాలెత్తుకొని డప్పు చప్పు లతో, పురవీధుల్లో తిరుగుతూ అమ్మవారి ఆల యానికి చేరుకున్నారు. అనంతరం భక్తిశ్రద్ధలతో అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ అమ్మవారి దీవెనలతో వర్షాలు బాగా కురిపిం చి ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లేలా చూడా లని కోరారు. మంద శ్రీనివాస్ గౌ డ్, గడ్డం సత్యనారాయణ గౌడ్, పొన్నం తిరుపతి గౌడ్, కొయ్యడ శ్రీనివాస్ గౌడ్, అంతటి సాగర్ గౌడ్, కెక్కెర్ల శ్రీనివాస్ గౌడ్, అనపు రం శ్రీనివాస్ గౌడ్, పో డేటి వెంకటేష్ గౌడ్,మంద రమేష్ గౌడ్, కరుణాకర్ గౌడ్, కొయ్యడ ఎల్లయ్య గౌడ్, పెరమండ్ల తిరుపతి గౌడ్,కొయ్యడ రమేష్ గౌడ్ పాల్గొన్నారు.

## రజతోత్సవ సన్నాహసభకు తరలిన బిఆర్ఎస్ యువ నాయకులు



**సుల్తానాబాద్, మార్చి 23(నినాదం న్యూస్):** ఉమ్మడి జిల్లా కరీంనగర్ లో జరుగుతున్న బిఆ ర్ఎస్ రజతోత్సవ సన్నాహక ముఖ్య కార్యకర్తల సమావేశానికి పెద్దపల్లి బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి కేటీఆర్ నిర్వహణలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి సుల్తానాబాద్ పట్టణానికి చెందిన బిఆర్ఎస్ యువ నాయకులు గొట్టం మహేష్, రమేష్, ప్రభాకర్, రఫిక్, వహీద్ పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక రంజాన్



**మంచిర్యాల ప్రతినిధి, మార్చి 23 (నినాదం న్యూస్):** మతసామరస్యానికి ప్రతీక రంజాన్ అని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు పేర్కొన్నారు. ఆదివారం నస్పూర్ లోని ఓ ఫంక్షన్ హాల్ లో రఘుపతి రావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ముస్లిం సోదరీమణులకు రంజాన్ తోఫా ను డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధం లేకుండా ప్రతి సంవత్సరం ట్రస్టు ద్వారా రంజాన్ పండుగ సందర్భంగా రంజాన్ తోఫా ఇస్తున్నామని పేర్కొన్నారు. ముస్లీం సోదరిమణులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ సుర్మిల్ల వేణు, నాయకులు దేవేందర్, కుమార్ పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు



**మంథని టౌన్ మార్చి 23 (నినాదం న్యూస్) :** మంథని పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో రాష్ట్ర ఐటీ ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు . పవిత్ర రంజాన్ వేడుకల సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు.. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ రంజాన్ మాసం త్యాగం ,సహనానికి ప్రతీక అని సమాజంలో ఐక్యత,ప్రేమ,సౌభ్రాతృత్వాన్ని పెంపొందించే పర్వదినం అని తెలిపారు .ప్రభుత్వం మైనార్టీ సంక్షేమానికి కట్టుబడి ఉందని ముస్లిం సోదరుల అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తామని అన్నారు. ఈ సంవత్సరం కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు లేని విధంగా మైనార్టీలకు రూపాయలు మూడు వేల కోట్లను బడ్జెట్లో పెట్టడం జరిగిందన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**మంథని టౌన్ మార్చి 23 (నినాదం న్యూస్):** మంథని పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాయ్స్ హై స్కూల్లో 2001-02 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం మంథనిలోని ఎస్ ఎల్ బి ఫంక్షన్ హాల్లో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించుకున్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులంతా చిందులు వేశారు. ఉపాధ్యా యులు అల్లం వీరయ్య,భాగవతుల శంకర్, పవిత్రం భూమయ్య, గిట్ల భరత్ రెడ్డి,నారంభట్ల సుశీల, ఘనుకోట సునీత, విద్యార్థులు బండారి సమ్మయ్య, రావుల సతీష్, రావికంటి రాకేష్,పెంటరి సంతోష్, మీసాల రాజు పాల్గొన్నారు.

NINADAM CINEMA



## సోషల్ మీడియాలో రియా చక్రవర్తికి క్షమాపణల వెల్లువ

### సుశాంత్ కేసులో క్లీన్‌చిట్..

బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ సుసైడ్ కేసులో బాలీవుడ్ నటి రియా చక్రవర్తికి భారీ ఊరటా లభించింది. ఈ కేసులో రియా చక్రవర్తికి సీబీఐ క్లీన్ చీట్‌ను అందించింది. సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ ఊహించని విధంగా ముంబైలోని తన నివాసంలో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. 14 జూన్ 2020న బాంద్రాలోని తన ఇంట్లో చనిపోయాడు. అయితే ఈ కేసును సుసైడ్ కేసుగా పోలీసులు భావించిన కూడా సుశాంత్ తల్లిదండ్రులు అది ఆత్మహత్యకాదంటూ రియా చక్రవర్తి, ఆమె ఫ్యామిలీపై.. కేసు పెట్టారు. సుశాంత్ బ్యాంకు ఖాతా నుంచి రూ. 15 కోట్లు బదిలీ చేసుకున్నారని అతడి తండ్రి కేకే సింగ్ ఆరోపించడంతో ఈ కేసులో మనీలాండరింగ్ జరిగినట్లు భావించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రియాను ప్రశ్నించింది. ఆ తర్వాత, కేసును సీబీఐకు అప్పగిస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది. సుశాంత్‌కు రియా మాదకద్రవ్యాలు ఇచ్చారనేది మరో ఆరోపణ. ఇలా నటుడి మృతి కేసులో ఆరోపణలు ఎదుర్కొని రియా, ఆమె సోదరుడు షోవిక్ చక్రవర్తి జైలుకు కూడా వెళ్లారు. అయితే తాజాగా ఈ కేసుకు సంబంధించి సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ తుది తీర్పును వెలువరించింది. సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ అతనే ఆత్మహత్య చేసుకున్నాడు, ఎవరూ అతన్ని చనిపోయేలా బలవంతం చేయలేదు అని తెలిపింది. అలానే రియా చక్రవర్తి, ఆమె కుటుంబానికి క్లీన్ చిట్ ఇచ్చింది సీబీఐ. ఇందులో ఎటువంటి నేర కోణం లేదా కుట్ర గాని జరగలేదు. సోషల్ మీడియా చాట్‌లను దర్యాప్తు కోసం అమెరికాకు పంపించగా, అక్కడ కూడా ట్యాంపరింగ్‌కు సంబంధించిన ఆధారాలు ఏం లభించలేదు. అంటూ తీర్పును వెలువరించింది. అయితే తీర్పు అనంతరం రియా చక్రవర్తికి సోషల్ మీడియాలో మద్దతు లభిస్తుంది. నేరం రుజువుకాకముందే రియాను నేషనల్ మీడియా ఎలా నేరస్తురాలిగా చిత్రీకరించిందో నెటిజన్లు గుర్తు చేస్తున్నారు. అంతేగాకుండా తనపై నెగిటివ్ ప్రచారం చేసి తన కెరీర్‌ని తన ఫ్యామిలీ పరువును నాశనం చేసినందుకు నెటిజన్లు రియాకు క్షమాపణలు తెలుపుతున్నారు. మరోవైపు మీడియా కూడా రియాకు క్షమాపణలు తెలపాలని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.




## ఓటీటీలోకి ఆది పినిశెట్టి లేటెస్ట్ హారర్ థ్రిల్లర్..

### కాలేజీలో 42 ప్రేతాత్మలు..

గతంలో పలు సినిమాల్లో హీరోగా నటించి మెప్పించాడు ఆది పినిశెట్టి. అయితే పెళ్లి తర్వాత పెద్దగా వెండితెరపై కనిపించలేదీ ట్యాలెంటెడ్ యాక్టర్. చాలా గ్యాప్ తర్వాత శబ్దం అనే డిఫరెంట్ హారర్ అండ్ థ్రిల్లర్ మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. అరివళగన్ తెరకెక్కించిన ఈ మూవీలో కోలీవుడ్ బ్యూటీ లక్ష్మీ మేనన్ కథానాయికగా కనిపించింది. గతంలో ఆది పినిశెట్టి- అరివళగన్ కాంబినేషన్ లో వైశాలి అనే సూపర్ హిట్ సినిమా వచ్చిన సంగతి తెలిసిందే. దీంతో రిలీజ్ కు ముందే 'శబ్దం'పై అంచనాలు పెరిగిపోయాయి. దీనికి తోడు టీజర్, ట్రైలర్ ఆసక్తికరంగా ఉండడంతో ఈ సినిమాపై పాజిటివ్ వైబ్ క్రియేట్ అయ్యింది. అందుకు తగ్గట్టుగానే ఫిబ్రవరి 28వ తేదీన థియేటర్లలో రిలీజైన శబ్దం సినిమాకు మంచి స్పందనే వచ్చింది. టైటిల్ కు తగ్గట్టుగానే 'సౌండ్' నేపథ్యంలో సాగే ఈ సినిమా ఆడియెన్స్ ను థ్రిల్ కు గురి చేసింది. ఇక తమన్ అందించిన బీజీఎమ్ సినిమాకు హైలెట్ గా నిలిచింది.అయితే ఇన్ని పాజిటివ్ అంశాలున్నా ఈ మూవీ పెద్దగా లాంగ్ రన్ కొనసాగించలేకపోయింది. థియేటర్లలో ఆడియెన్స్ ను భయపెట్టిన శబ్దం మూవీ ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేస్తోంది. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో సొంతం చేసుకుంది. ఉగాది కానుకగా మార్చి 28 నుంచి శబ్దం సినిమాను ఓటీటీలో స్ట్రీమింగ్ చేయనున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి మరో రెండు రోజుల్లో అధికారిక ప్రకటన రానుందని సమాచారం. సెవెన్ జీ ఫిల్మ్స్, ఆల్ఫా ఫ్రేమ్స్ బ్యానర్లపై శివ, భానుప్రియ శివ శబ్దం సినిమాను నిర్మించారు. సీనియర్ హీరోయిన్లు సిమ్రాన్, లైలా ఈ మూవీలో ప్రధాన పాత్రలు పోషించడం విశేషం. అలాగే రెడిన్ కింగ్ స్లే, ఎంఎస్ భాస్కర్, రాజీవ్ మేనర్, వివేక్ ప్రసన్న, టీఎస్సార్ శ్రీనివాసన్ తదితరులు ఈ మూవీలో మెరిశారు. మరి థియేటర్లలో శబ్దం సినిమాను మిస్ అయ్యారా? అయితే మరికొన్ని రోజులు ఆగండి ఎంచెక్కా ఓటీటీలో చూసి ఎంజాయ్ చేయండి.



## చేసిన సినిమాల్లో 10 డిజాస్టర్లే..

### అయినా కోట్ల ఆస్తి కూడబెట్టిన ముద్దుగుమ్మ

చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి ఎంతోమంది వేల కోట్ల ఆస్తులను కూడబెట్టుకుంటున్నారు. అందులో ఓ గ్లామర్ బ్యూటీ కూడా ఉంది. ఈ ముద్దుగుమ్మ అందం చూస్తే ఎవ్వరికైనా మతిపోవాల్సిందే. తన అందం, నటనతో బాలీవుడ్‌నే షేక్ చేసిన బ్యూటీ, స్పెషల్ సాంగ్స్ చేసి మంచి ఫేమ్ సొంతం చేసుకుంది. వరుస ఆఫర్స్‌తో దూసుకెళ్తున్న ఈ చిన్నది ఏకంగా కోట్ల రూపాయల ఆస్తి కూడబెట్టిందంట. శ్రీలంకలో పుట్టి పెరిగి, అక్కడే టీవీ రిపోర్టర్‌గా కెరీర్ స్టార్ట్ చేసి, మోడలింగ్ చేసి, తర్వాత 2006లో మిస్ యూనివర్స్ శ్రీలంక కిరీటాన్ని అందుకున్న ముద్దుగుమ్మ జాక్వాలిన్ పెర్నాండేజ్. ఈ బ్యూటీ గురించి ఎంత చెప్పినా తక్కవే. వన్నె తగ్గని అందం ఈ ముద్దుగుమ్మసొంతం. బ్యూటీ జాక్వాలిన్ 2009లో అలాదిన్ సినిమాతో బాలీవుడ్ సిల్వర్ స్క్రీన్ పైకి ఎంట్రీ ఇచ్చింది. తర్వాత హౌస్ ఫుల్ 2, రేస్ 2 వంటి సినిమాలతో మంచి పాపులారిటీ సొంతం చేసుకుంది. తర్వాత వరసగా పలు సినిమాలు చేసింది. అయితే ఈ ముద్దుగుమ్మ చేసిన సినిమాల్లో 10 డిజాస్టరే అయినా ఈఅమ్మడు క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదు. ఇప్పటికీ వరసగా ఆఫర్స్ అందుకుంటూ మంచి ఫామ్‌లో ఉంది. ఈ క్రమంలోనే ఈ చిన్నదానికి సంబంధించిన ఓ ఇంట్రెస్టింగ్ న్యూస్ నెట్టింట వైరల్ అవుతోంది. ఇప్పటికీ వరసగా ఆఫర్స్ అందుకుంటూ మంచి ఫామ్‌లో ఉంది. జాక్వాలిన్ చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టిన తర్వాత ఏకంగా 160 కోట్లకు పైగానే ఆస్తులు కూడబెట్టిందంట. అంతే కాకుండా ఈ ముద్దుగుమ్మ సంవత్సరానికి రూ.15 కోట్లకు పైగా సంపాదిస్తున్నట్లు సమాచారం. జాక్వాలిన్ చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టిన తర్వాత ఏకంగా 160 కోట్లకు పైగానే ఆస్తులు కూడబెట్టిందంట. అంతేకాకుండా ఈ ముద్దుగుమ్మ సంవత్సరానికి రూ.15 కోట్లకు పైగా సంపాదిస్తున్నట్లు సమాచారం.

## మొదటి భార్యతో విడాకులు..

### మందుకు బానిసై దేవదాస్‌లా మారిన అమిర్‌ఖాన్



బాలీవుడ్ మిస్టర్ ఫర్‌ఫెక్ట్ ఆమిర్ ఖాన్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఒకప్పుడు స్టార్ నటుడిగా రాణించిన ఈ నటుడు ప్రస్తుతం సినిమాలకు చాలా గ్యాప్ తీసుకున్నాడు. చాలా రోజుల తర్వాత ఆయన సితారే జమీన్ పర్ అనే చిత్రంలో నటిస్తున్నాడు. అయితే రీసెంట్‌గా తన 60వ పుట్టినరోజును జరుపుకున్న ఈ హీరో మొదటి భార్య రీనా దత్తాతో విడాకులు గురించి స్పందించాడు. రీనాను తాను ఎంతగానో ప్రేమించానని.. కానీ అనుకోకుండా మేమిద్దరం విడిపోయామని ఈ విడాకులు తనను తీవ్రంగా కుంగదీసినట్లు, దాని కారణంగా మద్యానికి బానిస అయినట్లు అమీర్ తెలిపారు. రీనాతో విడిపోయిన సమయంలో నేను చాలా బాధపడ్డాను. సుమారు మూడేళ్లపాటు ఒక్కడినే ఒంటరిగా గడిపాను. షూటింగ్‌లకు దూరంగా పనిపై దృష్టి పెట్టలేకపోయాను. స్క్రిప్ట్‌లు కూడా వినలేదు. ఇంట్లో ఒంటరిగా కూర్చొని బాధపడుతూ ఉండేవాడిని. నిద్ర కూడా పట్టేది కాదు. ఏం చేయాలో అర్థం కాక, ప్రశాంతంగా నిద్రపోవడం కోసం మద్యం తాగడం మొదలుపెట్టాను. ఆల్కహాల్ గురించి ఏమీ తెలియని నేను ఒక్కసారిగా రోజుకో బాటిల్ తాగే స్థాయికి చేరాను. ఏడాదిన్నర పాటు మద్యానికి బానిస అయ్యాను. ఒక విధంగా చెప్పాలంటే దేవదాస్‌లా మారిపోయాను. తీవ్రమైన మానసిక కుంగుబాటులోకి వెళ్లాను. ఆ పరిస్థితి నుంచి బయటపడటానికి సినిమాను ఎక్కువగా ప్రేమించడం మొదలుపెట్టాను. అదే నా జీవితాన్ని మార్చింది. సినిమా పట్ల నాకున్న ప్రేమ నా వ్యసనాలకు చెక్ పెట్టేలా చేసింది. అయితే ఇష్టపడిన వారు పక్కన లేకుండానే జీవితాన్ని కొనసాగించాలని తెలుసుకున్నానంటూ ఆమిర్ చెప్పుకోచ్చాడు. 1986లో ఆమిర్ ఖాన్, రీనా దత్తా ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు ఐరా ఖాన్, జునైద్ ఖాన్ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. 16 సంవత్సరాల వైవాహిక జీవితం తర్వాత, 2002లో వీరిద్దరూ విడాకులు తీసుకున్నారు. అనంతరం ఆమిర్ 2005లో కిరణ్ రావును వివాహం చేసుకున్నారు. ఈ జంటకు ఆజాద్ రావు ఖాన్ అనే కుమారుడు ఉన్నాడు. కానీ, 2021లో ఆమిర్ కిరణ్ కూడా విడిపోయారు. ప్రస్తుతం ఆమిర్ ఖాన్ గౌరీ అనే స్నేహితురాలితో రిలేషన్‌లో ఉన్నాడు.

## 'ఆర్ సీ-16' టైటిల్ ఫిక్స్.?

### ఆకట్టుకుంటున్న పోస్టర్..



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, టాలీవుడ్ డైరెక్టర్ బుచ్చిబాబు సనా దర్శకత్వంలో ఓ సినిమా రాబోతున్న సంగతి తెలిసిందే. 'ఆర్ సీ-16' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ మూవీలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇక ఈ చిత్రానికి ఎ ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా.. స్టార్ యాక్టర్ జగపతి బాబు, శివరాజ్ కుమార్, దివ్యేందు వంటి ప్రముఖులు కీరోల్ ప్లే చేస్తున్నారు. అయితే ఈ సినిమాను భారీ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఇక ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ స్టార్ట్ కాగా రీసెంట్‌గా శివన్న కూడా షూటింగ్ జాయిన్ అయినట్లు మూవీ టీమ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇక స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో రామ్ చరణ్ న్యూ లుక్‌లో కనిపించబోతున్నాడు. ఇదిలా ఉంటే.. తాజాగా ఈ మూవీ టైటిల్ ఫిక్స్ అయినట్లు ఓ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. ఇక ఆర్ సీ-16 మూవీకి 'పెద్ది' అనే టైటిల్ ఫిక్స్ చేసినట్లు ఓ పోస్టర్ సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తుంది. మరి ఇందులో నిజమెంతుందో తెలియాలంటే అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చే వరకు వెయిట్ చేయాల్సిందే. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట బాగా వైరల్ అవుతోంది.

## అక్కినేని అభిమానులకు గుడ్‌న్యూస్



అక్కినేని అఖిల్‌కు పరిచయం అక్కర్లేదు. చైల్డ్ ఆర్టిస్ట్‌గా ఇండస్ట్రీకి వచ్చి హీరోగా మారాడు. 'హలో'సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న అఖిల్ పలు చిత్రాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించాడు. కానీ 2023లో ఆయన నటించిన 'ఏజెంట్' భారీ డిజాస్టర్‌గా నిలువడంతో అఖిల్ ఫేమ్‌పై తీవ్ర ప్రభావం పడింది. స్టార్ హీరో నాగార్జున కొడుకు అయినప్పటికీ పెద్దగా ఫేమ్ సంపాదించుకోలేకపోయాడు. ఇక 'ఏజెంట్'తర్వాత రెండేళ్లపాటు ఇండస్ట్రీకి దూరంగా ఉన్నాడు. ప్రస్తుతం 'లెనిన్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. మురళీ కృష్ణ అబ్బూర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. అయితే ఇందులో అఖిల్ సరసన క్రేజీ బ్యూటీ శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ శరవేగంగా జరుగుతుండగా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇదిలా ఉంటే.. తాజాగా, ఓ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అక్కినేని అభిమానుల ఆనందానికి కారణం అవుతుంది. అఖిల్ 'లెనిన్'విడుదల కాకముందే మరో రొమాంటిక్ సినిమాతో రాబోతున్నట్లు సమాచారం. అయితే ఈ సినిమాలో టాలీవుడ్ యంగ్ బ్యూటీ కృతి శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్నట్లు తెలుస్తోంది. ఇది రొమాంటిక్ చిత్రంగా రాబోతుండగా.. కొత్త డైరెక్టర్ నందు దర్శకత్వం వహించనున్నట్లు టాక్. ఇందులో నిజమెంత అనేది తెలియనప్పటికి ప్రస్తుతం ఇదే వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. అది చూసిన వారు ఈ కాంబో అస్సలు ఊహించలేదని అంటున్నారు. అఖిల్ పర్సనల్ లైఫ్ విషయానికొస్తే.. ఇటీవల నాగార్జున అఖిల్, జైనబ్‌ల నిశ్చితార్థం జరిపించిన విషయం తెలిసిందే. కుటుంబ సభ్యుల మధ్య జరిగిన ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలు షేర్ చేస్తూ నాగార్జున అధికారిక ప్రకటన చేశారు. అయితే వీరి పెళ్లి డేట్ మాత్రం అనౌన్స్ చేయలేదు. దీంతో అంతా అఖిల్ పెళ్లి గురించి వెయిట్ చేస్తున్నారు.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrial Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL : +91 80742 79741